www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

నవభూమి

ANUKSHANAM

NAVABHOOMI TELUGU DAILY

నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada

ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 23 ఆదివారం | మార్చి 2025 | పేజీలు 12 | వెల: రూ.6 | సంపుటి:2 సంచిక: 187

Navabhoomi daily fallows..

Circulated at: Hyderabad, Rangareddy, Adilabad, Karimnagar,Warangal,Khammam, Nalgonda, Mahabubnagar,Medak, Nizamabad, Krishna,Guntur,Easrt Godavari, West Godavari,Prakasam, Nellore,Srikakulam,Vizianagaram,Visakhapatanam,Kurnool,Chittoor,Kadapa,and Anantapur

వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు

- పురస్కారానికి ఎంపికైన హిందీ రచయిత
- ఛత్తీస్‌గఢ్ నుంచి జ్ఞానపీఠ్ అందుకున్న తొలి రచయిత శుక్లా
- సాహిత్యానికి అందించిన విశిష్ట సేవలకు గుర్తింపుగా అవార్డు

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో: ప్రఖ్యాత హిందీ రచయిత వినోద్ కుమార్ శుక్లా 2024 సంవత్సరానికి గాను జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జ్ఞానపీఠ్ కమిటీ శనివారం అధికారికంగా ప్రకటించింది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం

జనాభా కంటే మొబైల్ ఫోన్లే ఎక్కువ..!

- ట్రాయ్ నివేదిక ప్రకారం తెలంగాణలో మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 4.19 కోట్లు
- ఇందులో మొబైల్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 4.4 కోట్లు
- ల్యాండ్‌లైన్ వినియోగదారుల సంఖ్య 15.25 లక్షలు

2

హైదరాబాద్-నవభూమిబ్యూరో: తెలంగాణలో రోజురోజుకూ మొబైల్ ఫోన్ల వినియోగం పెరుగుతోంది. ప్రస్తుతం రాష్ట్రంలో జనాభా కంటే మొబైల్ ఫోన్లు అధికంగా ఉన్నాయి.

5.30 లక్షల మందికి నివాస హోదా రద్దు

- ట్రంప్ మరో సంచలన నిర్ణయం
- ఇప్పుడు తాత్కాలిక వలసదారులపై ట్రంప్ కన్నెర్ర
- అమెరికాను వీడనున్న క్యూబా, హైతీ, నికరాగ్వా, వెనిజులా దేశాలకు చెందిన

2

వాషింగ్టన్-నవభూమిబ్యూరో: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నుంచి వలసల విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికే అక్రమవలసదారులపై ట్రంప్

యుఎస్ భారతీయ విద్యార్థులకు కేంద్రం సూచనలు

- అమెరికా చట్టాలకు మన విద్యార్థులు లోబడి ఉండాలి
- అక్కడి చట్టాలు, నిబంధనలను పాటించాలి
- ఏవైనా ఇబ్బందులు వస్తే భారత ఎంబసీ
- కాన్సులేట్ కార్యాలయాలు సాయం: కేంద్రం

2

న్యూఢిల్లీ-నవభూమిబ్యూరో: అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ బాధ్యతలను చేపట్టిన తర్వాత సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం

తెలంగాణపై కేంద్రం వివక్ష

- లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం
- కేంద్రానికి భారీగా పన్నులుచెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో పొందుతున్నాం
- రూపాయి చెల్లిస్తే.. తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి
- బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది
- భాజపాను కట్టడి చేస్తేనే దక్షిణాది రాష్ట్రాలకు మేలు
- డీఎంకే ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశంలో రేవంత్

2

చెన్నై-నవభూమిబ్యూరో: కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ను వ్యతిరేకిస్తున్నా మని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పన్నుల రూపంలో కేంద్రానికి రాష్ట్రాలు భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలోనే తిరిగి పొందుతున్నామని పేర్కొన్నారు. లోక్సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగనుందన్న విషయమై చర్చించేందుకు డీఎంకే ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి రేవంత్రెడ్డి హాజరై మాట్లాడారు.

'తెలంగాణాలో వేగవంతమైన ఆర్థిక అభివృద్ధిని సాధించాం. జీఎస్ పీ, తలసరి ఆదాయంలోనూ వృద్ధి సాదించాం. తెలంగాణలో సుపరిపాలన తోపాటు సంక్షేము కార్యక్రమాలు అమలు చేస్తున్నాం. పన్నుల రూపంలో కేంద్రానికి భారీగా చెల్లిస్తున్నా.. తక్కువ మొత్తంలో తిరిగి పొందుతున్నాం. రూపాయి చెల్లిస్తే.. తెలంగాణకు 42 పైసలు తిరిగొస్తున్నాయి. తమిళనాడుకు 26 పైసలు, కర్ణాటకకు 16 పైసలు, కేరళకు 49 పైసలు మాత్రమే లభిస్తున్నాయి. కానీ, బిహార్ మాత్రం రూపాయికి రూ.6.06 పొందుతోంది. యూపీకి రూ.2.03, మధ్యప్రదేశకు రూ.1.73 మేర లభిస్తోంది" అని రేవంత్రెడ్డి వివరించారు. రాణిస్తున్న రాష్ట్రాలకు రాజకీయ పరిమితులు

డీలిమిటేషన్‌పై పోరాటానికి జేఏసీ ఏర్పాటు

- డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా పోరుకు స్టాలిన్ శ్రీకారం
- దక్షిణాది రాష్ట్రాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకుని రావడానికి కృషి
- బీజేపీయేతర ముఖ్యమంత్రులు,పార్టీలకు ఆహ్వానం
- ఉద్యమ కార్యాచరణలో భాగంగా జేఏసీ ఏర్పాటు
- తెలంగాణ సీఎం రేవంత్‌కు కీలకబాధ్యతలిచ్చే అవకాశం

2

చెన్నై-నవభూమిబ్యూరో

దక్షిణాది రాష్ట్రాలను తీవ్ర ఆందోళనలోకి నెడుతోన్న అంశం- డీలిమిటేషన్. 2026 నాటికి జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజించాలంటూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణాది రాష్ట్రాల్లో జనాభా సంఖ్య తక్కువగా ఉండటం వల్ల ఆశించిన స్థాయిలో సీట్ల సంఖ్య పెరగవని ఇక్కడి ప్రభుత్వాలు భావిస్తోన్నాయి. ఈ పరిస్థితుల మధ్య- కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న డీలిమిటేషన్ ప్రక్రియకు వ్యతిరేకంగా సరికొత్త ఉద్యమాలకు శ్రీకారం చుట్టారు స్టాలిన్. దక్షిణాది రాష్ట్రాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకుని రావడానికి కృషి చేస్తోన్నారు. ఇందులో భాగంగా దక్షిణాదిన బీజేపీ-మిత్రపక్షాలేతర ముఖ్యమంత్రులు, వివిధ పార్టీల అధినాయకులతో నేడు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశం సందర్భంగా స్టాలిన్ మాట్లాడారు. డీలిమిటేషన్ అంశంపై ఎప్పటికప్పుడు ఉద్యమ కార్యాచరణ ను నిర్వహించడానికి ప్రత్యేకంగా జాయింట్ యాక్షన్ కమిటీని ఏర్పాటు చేసినట్లు ప్రకటిం

తెలంగాణపై కుట్రలు..

- సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి
- కొందరు సిద్ధంగా ఉన్నారన్న కేసీఆర్
- సింగిల్‌గానే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి వస్తాం
- గోదావరి కన్నీటి గోస పేరిట గోదావరిఖని నుంచి
- బీఆర్ఎస్ కోరుకంటి చందర్ మహా పాదయాత్ర
- పాదయాత్ర చేసిన నేతలతో కేసీఆర్ సమావేశం

2

సిద్దిపేట-నవభూమిబ్యూరో: తెలంగాణ రాష్ట్రంలో రాబోయే రోజుల్లో అధికారం బీఆర్ఎస్‌దేనని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సింగిల్‌గా అధికారంలో వస్తామని ఉద్ఘాటించారు. బెల్లం ఉన్న దగ్గర ఈగలు వస్తాయని.. అలానే సిరిసంపదలు ఉన్న తెలంగాణను దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని విమర్శించారు. గోదావరి కన్నీటి గోస పేరిట గోదావరిఖని నుంచి బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెలే కోరుకంటి చందర్ మహా పాదయాత్ర చేపట్టారు. ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు శనివారం కోరుకంటి చందర్ మహా పాదయాత్ర ద్వారా కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు చేరుకున్నారు.

పాదయాత్ర చేసి వచ్చిన వారితో కేసీఆర్ సమావేశమయ్యారు .ఈ సందర్భంగా కేసీఆర్ కీలక కామెంట్స్ చేశారు. పదేళ్లు తమ హయాంలో తెలంగాణలో ఎలాంటి ఇబ్బందులు లేవని అన్నారు. ఇప్పుడు సమస్యల వలయంలో తెలంగాణ చిక్కుకుందని చెప్పారు. ఆనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మెడపై కత్తి పెట్టిన తెలంగాణ కోసం తాను ఎక్కడ వెనకడుగు వేయలేదని గుర్తుచేశారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని కేసీఆర్ తెలిపారు.

తెలంగాణకు ఆనాడు దివంగత మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ మోసం చేసిందని కేసీఆర్ విమర్శించారు. ఏపీలో కూటమి లేకుంటే సీఎం చంద్రబాబు గెలిచేవారు కాదని చెప్పారు. బలవంతంగా తెలంగాణను ఆంధ్రాలో కలిపారని మండిపడ్డారు. ఈ నేలపై ఎవరూ శాశ్వతం కాదని చెప్పారు. అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని ఉద్ఘాటించారు. తెలంగాణ హక్కుల కోసం బీఆర్ఎస్ నేతలు పోరాడాలని చెప్పారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన

విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల చెల్లింపు

- రూ.600 కోట్ల రూపాయిలు విడుదల చేసిన ఏపీసర్కార్
- త్వరలో మరో విడతగా రూ.400 కోట్లు విడుదల
- దశలవారీగా బకాయిలన్నీ చెల్లిస్తామని..సర్కార్ వెల్లడి
- గత సర్కార్ హయాంలో రూ.4200 కోట్ల బకాయిలు
- ఏపీ విద్యాశాఖ,ఐటీ శాఖ మంత్రి లోకేశ్ వెల్లడి

అమరావతి-నవభూమిబ్యూరో

ఏపీ విద్యార్థులకు ప్రభుత్వం ఎట్టకేలకు గుడ్ న్యూస్ చెప్పింది. విద్యాసంవత్సరం ముగింపు దశకు చేరుకున్న తరుణంలో విద్యాసంస్థల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులకు ఊరటనిస్తూ ఓ కీలక పథకానికి సంబంధించి రూ.600 కోట్ల బకాయిల్ని ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలో మరో విడతగా రూ.400 కోట్లు విడుదల చేస్తామని కూడా ప్రకటించింది. ఆ లోపు విద్యార్థుల్ని ఇబ్బందిపెడితే ఊరుకోబోమని విద్యాసంస్థల్ని హెచ్చరించింది. ఏపీలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్ మెంట్ నిధుల బకాయిలు భారీగా పేరుకుపోయాయి. దీంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల్లో రూ.600 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో విద్యార్థులు తమ ఫీజుల్ని స్కూల్స్, కాలేజీలకు చెల్లించేందుకు వీలు కలిగింది. ఇప్పటికే ఆయా విద్య సంస్థలు ఫీజు చెల్లించలేదన్న కారణంతో విద్యార్థులకు పలు చోట్ల హాల్ టికెట్లు నిరాకరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రూ.600 కోట్ల నిధుల్ని ఫీజు రీయింబర్స్ మెంట్ పథకం కింద విడుదల చేసింది. త్వరలో మరో రూ.400 కోట్లు విడుదల చేస్తామని కూడా ప్రకటించింది. దశలవారీగా బకాయిలన్నీ చెల్లిస్తామని..విద్యా సంస్థలకు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. కాబట్టి ఫీజుల కోసం విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావొద్దని..హాల్ టికెట్లు నిలిపివేస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేసింది. దీంతో విద్యార్థులకు ఊరట దక్కినట్లయింది. తాజాగా శాసనమండలిలో వైసీపీ సభ్యులు విద్యార్థుల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. దీనికి సమాధానంగా వైసీపీ హయాంలో రూ.4200 కోట్లు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు పెట్టారని విద్యామంత్రి లోకేష్ తెలిపారు. వీటిన్నింటినీ చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు సభా సాక్షిగా హామీ ఇస్తున్నట్లు లోకేష్ తెలిపారు.

తెలంగాణ రెవెన్యూ శాఖలో 10,954 ఉద్యోగాలు



హైదరాబాద్-నవభూమిబ్యూరో

తెలంగాణ సర్కారు గుడ్ న్యూస్ చెప్పింది. గ్రామ పరిపాలనను మరింత పటిష్టం చేసే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర రెవన్యూ శాఖలో కొత్తగా 10,954 గ్రామ పాలనా అధికారిక పోస్టులకు గ్రీన్ సిగ్నల్ లభించింది. ఈ మేరకు ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చల్లబడిన హైదరాబాద్! అధికారులను అలర్ట్ చేసిన సీఎం రేవంత్ మాజీ వీఆర్వోలు, మాజీ వీఆర్ఏల నుంచి ఆప్షన్లు తీసుకుని ఈ నియామకాలను చేపట్టనున్నారు. త్వరలోనే నియామక ప్రక్రియ ప్రారంభం కానుంది. దీనికి సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ఆర్థిక శాఖ కోరింది. అయితే ఇటీవల కేబినెట్ సమావేశంలో ఈ ఉద్యోగాల భర్తీకి ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. కేబినెట్ నిర్ణయం మేరకు జీపీవో పేరుతో 10,954 పోస్టుల భర్తీకి ప్రక్రియ త్వరలో ప్రారంభం కానుండగా.. గతంలో వీఆర్వోలుగా పని చేసి ప్రస్తుతం వివిధ శాఖల్లో ఉన్న 6 వేల మందిని జీపీవోలుగా నియమించే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. అదనంగా 4వేలకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉంది.

%=వషశీఎవవఅనవన ఖీశీతీ ్శీబ% జేఏసీ ఏర్పాటు- బంతి రేవంత్ కోర్టులో..!! ఇదిలా ఉండగా.. ఉగాదిన నుంచి అన్ని శాఖల్లో ఖాళీల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది.

మొత్తం 61,579 పోస్టుల జాబితాను సిద్ధం చేసిన సర్కారు.. ఉగాది తర్వాత వారం లేదా పది రోజుల్లో 55 వేలకు పైగా ఉద్యోగాలకు నోటిఫికేషన్లు విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 58, 868 పోస్టులను భర్తీ చేసింది.

పోసాని కృష్ణమురళి విడుదల

- షరతులతో కూడిన బెయిలు మంజూరు
- 2వారాలకోసారి సీఐడీ కార్యాలయంలో హాజరుకావాలి
- పోలీసులు పిలిచినప్పుడు తప్పనిసరిగా విచారణకు రావాలి
- గుంటూరు జిల్లా జైలు నుంచి విడుదలైన పోసాని
- జైలు వద్ద ఘన స్వాగతం పలికిన వైసీపీనేత అంబటి

2

గుంటూరు-నవభూమిబ్యూరో

చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్, నారా లోకేష్‌ల మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో పోసాని కృష్ణమురళి అరెస్ట్ అయిన సంగతి తెలిసిందే. గత కొన్ని రోజుల నుంచి ఆయన గుంటూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. నిన్న ఆయనకు గుంటూరులోని సీఐడీ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో శనివారం ఆయన జైలు నుంచి విడుదల అయ్యారు. వైసీపీ నేత అంబటి రాంబాబు జైలు వద్దకు వెళ్లారు. జైలు నుంచి బయటకు వచ్చిన పోసానికి

ఏపీలో డ్రగ్ కలకలం

- ఆపరేషన్ గరుడలో భాగంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు
- ట్రేమడాల్ అనే సైకో ట్రోపిక్ సబ్ స్టెన్స్ (మాదక ద్రవ్యం) అనుమతి లేకుండా మెడికల్ షాపుల్లో అమ్ముతున్నట్టు నిర్ధారణ
- అలసట, నిద్ర రాకుండా ఉండటానికి, ఉత్తేజంగా పనిచేయటానికి ఐసిస్, బోకోహరామ్ వంటి ఉగ్రవాద సంస్థలు వాడే మాత్రలివి
- మెడికల్ స్టోర్ యజమాని కేసు నమోదు..ఇవి ఎలా వచ్చాయని ఆరా

అమరావతి-నవభూమిబ్యూరో

తెలంగాణ వ్యాప్తంగా కలకలం సృష్టించిన డ్రగ్స్ వ్యవహారం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో కూడా దుమారం రేపుతోంది. ఇన్నాళ్లు ఛోటా మోటాగా అక్కడక్కడ మాత్రమే తక్కువ మోతాదులో డ్రగ్స్ పట్టుబడ్డప్పటికీ.. ఈసారి మాత్రం ఏపీ వ్యాప్తంగా ఈగల్ టీం జరుపుతున్న దాడుల్లో అధికారులకు సైతం ఊహించని షాక్ తగిలింది. ఐసిస్ లాంటి ఉగ్రవాద సంస్థలు వినియోగించే డ్రగ్స్ ని అధికారులు గుర్తించడం రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర దుమారంగా మారింది. కృష్ణాజిల్లా అవనిగడ్డలో ఉన్న భార్గవ్ మెడికల్ షాప్ లో ఈ ఐసిస్ డ్రగ్స్ ను గుర్తించారు. ఐసిస్, బోకో హారం లాంటి ఉగ్రవాద సంస్థలు ఈ డ్రగ్ విజయవాడ పరిసరాల్లో మెడికల్ షాపుల్లో సులువుగా లభ్యమవడం ఏంటని షాక్ అవుతున్నారు. ట్రేమడాల్ అనే సైకో ట్రోపిక్ సబ్ స్టెన్స్ (మాదక ద్రవ్యం) అనుమతి లేకుండా అమ్ముతున్నట్టు నిర్ధారించారు. ఆపరేషన్ గరుడలో భాగంగా మెడికల్ షాపుల్లో తనిఖీలు నిర్వహించగా.. సంచలన విషయాలు బయటకు వచ్చాయి. అలసట, నిద్ర రాకుండా ఉండటానికి, ఎక్కువ సమయం ఉత్తేజంగా పనిచేయటానికి ఐసిస్, బోకోహరామ్ వంటి ఉగ్రవాద సంస్థలు ఉగ్రవాదులకు.. ఈ ట్రెమడాల్ మాత్రలను అందిస్తుంటాయి. అందుకే వీటికి ప్రపంచ వ్యాప్తంగా ఐసిస్ డ్రగ్గా, ఫైటర్ డ్రగ్గా పేరుంది. గత రెండేళ్ల కాలంలో ఈ ఒక్క షాపులోనే 55, 961 ట్రెమడాల్ ట్యాబెల్ట్స్, 2, 794 ఇంజెక్షన్లు విక్రయించినట్టు తేల్చారు. అవనిగడ్డలోని భార్గవ మెడికల్ స్టోర్స్‌లో ఈ మాదకద్రవ్యాల రాకెట్ జరుగుతున్నట్టు గుర్తించారు. ఇక ట్రెమడాల్ తయారీ, వినియోగంపై 2018లోనే కేంద్ర ప్రభుత్వం ఆంక్షలు విధించింది. అంతే కాకుండా చట్టపరిధిలోకి వీటిని తీసుకొచ్చింది. అనుమతించిన పరిమాణం, కాంబినేషన్‌లో మాత్రమే తయారు చేసి వైద్యుల సూచనలతో విక్రయించాలని స్పష్టం చేసింది. కానీ అధికారుల తనిఖీల్లో ఇప్పుడు ఈ డ్రగ్ బాగోతం బయటపడడం అధికారులను సైతం కలవరపెడుతోంది. రికార్డుల్లోనే అంత మేర సేల్స్ జరిగితే.. లెక్కల్లోకి రాకుండా ఎంకెన్ని విక్రయించి ఉంటారో అని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ స్టోర్ యజమాని కొనకళ్ల రామ్మోహన్‌పై ఎన్‌డిపి చట్టం కింద కేసు నమోదు చేసి.. అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు అధికారుల విచారణలో మెడికల్ స్టోర్ యజమాని చాలా కాలంగా ఈ మాత్రలు, ఇంజెక్షన్లు విక్రయిస్తున్నట్లు వెల్లడించినట్టు సమాచారం. దీంతో అవనిగడ్డ పరిసర ప్రాంతాల్లో అనేక మంది ఈ మత్తు పదార్థానికి బానిసలుగా మారి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
2 హైదరాబాద్
ఆదివారం
23 మార్చి 2025

తమ్ముడూ నీ లైఫ్ స్టైల్ వేరు..నా లైఫ్ స్టైల్ వేరు.. పాడి కౌషిక్ రెడ్డిపై మంత్రి సీతక్క సెటైర్లు

హైదరాబాద్-నవభూమి:అసెంబ్లీ వేదికగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌషిక్ రెడ్డిపై మంత్రి సీతక్క ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తమ్ముడూ నీ లైఫ్ స్టైల్ వేరు..నా లైఫ్ స్టైల్ వేరు' అని సీతక్క చెప్పారు. ములుగు నియోజకవర్గంలో తాను తిరిగినట్లు నువ్వు తిరగలేవు అని చెప్పారు. ప్రజలకు ఎవరు ఎక్కువ అందుబాటులో ఉంటారో తేల్చుకుందామని సవాల్ విసిరారు. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదన్న కౌషిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను మంత్రి సీతక్క ఖండించారు.హైదరాబాద్‌లో తిరిగే వాళ్లకు రైతులకు బోనస్ వస్తుందో లేదో తెలుస్తుందా అని ప్రశ్నించారు. రైతులతో సంబంధం లేకుండా హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నేతలు తిరుగుతున్నట్లు ఉందని విమర్శించారు. బోనస్ ఇస్తామని చెప్పి రైతులను బీఆర్ఎస్ ప్రభుత్వం బోగస్ చేసిందని ఆరోపించారు. వరి వేస్తే ఉరి అన్నది మాజీ సీఎం కేసీఆర్ కాదా అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం సన్నవడ్లకు రూ.1200 కోట్లు బోనస్ ఇచ్చిందని గుర్తుచేశారు. ఇంకా ఎవరికన్నా రాకపోతే అవి కూడా ఇస్తామని స్పష్టం చేశారు. రైతు కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇస్తున్నామని ప్రకటించారు. భూమి లేని వాళ్లకే కూలీ భరోసా ఇస్తున్నామని చెప్పారు. కొంత భూమి ఉన్న కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ఇవ్వాలనే అంశం పరిశీలనలో ఉందని మంత్రి సీతక్క పేర్కొన్నారు.

నేను ఉండేది అక్కడే..బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు తమ ఇంటికి రావాలని మంత్రి సీతక్క ఆహ్వానం పలికారు. ప్రభుత్వం వసతి కల్పించిన క్వార్టర్స్‌లోనే తాను నివసిస్తున్నానని స్పష్టం చేశారు. వైఎస్ భవనంలో ఉండటం తాను అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. అది వైఎస్ హయాంలో నిర్మించిన భవనమేనని చెప్పారు. ఆ భవనంలోనే తాను ఉంటున్నానని అన్నారు. బీఆర్ఎస్ నేతల్లాగా ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోటల్లో తాను నివసించడం లేదని తేల్చిచెప్పారు.



పదో తరగతి విద్యార్థిని మృతి

హైదరాబాద్-నవభూమి: హైదరాబాద్‌లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. పరీక్ష రాసి ఇంటికి వెళ్తున్న పదో తరగతి విద్యార్థిని బస్సు కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ ఘటన గచ్చిబౌలి ఫ్లైఓవర్ మీద జరిగింది. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిన్నటి (మార్చి 21) నుంచి పదో తరగతి విద్యార్థులకు పరీక్షలు మొదలవగా.. ఈరోజు (మార్చి 22న) సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే.. ప్రభాతి ఛత్రియ (16) అనే పదో తరగతి విద్యార్థి పరీక్ష ముగించుకుని.. తన సోదరుడు సుమన్ ఛత్రియతో కలిసి ఇంటికి బయలుదేరింది. గచ్చిబౌలి నుంచి లింగపల్లి వైపు వెళ్తుండగా.. ఫ్లైఓవర్ మీద ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రభాతి ఛత్రియ మీది నుంచి ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్సు వెళ్లటంతో.. విద్యార్థిని అక్కడికక్కడే ప్రాణాలు వదిలింది. కాగా.. విద్యార్థిని సోదరుడు సుమన్‌కు తీవ్ర గాయాలయ్యాయి.టీఎన్జీవో కాలనీకి చెందిన ప్రభాతి ఛత్రియకు గచ్చిబౌలిలో పరీక్షా కేంద్రం పడింది. దీంతో.. తన సోదరిని పరీక్ష కేంద్రానికి తన ద్విచక్రవాహనంపై తీసుకెళ్లిన సుమన్ ఛత్రియ.. ఎగ్జామ్ రాసిన తర్వాత ఇంటికి తిరిగి తీసుకొస్తున్న క్రమంలో.. గచ్చిబౌలి ఫ్లైఓవర్ వద్దకు రాగానే బైక్ అదుపుతప్పి ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్ కింద పడింది. ఈ ప్రమాదంలో విద్యార్థిని తీవ్రంగా గాయపడటంతో.. ఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయింది. కాగా.. సుమన్ ఛత్రియకు తీవ్ర గాయాలయ్యాయి.మిగతా వాహనదారులు ఇచ్చిన సమాచారంతో.. రాయదుర్గం పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. గాయపడిన సుమన్ ఛత్రియ స్థానిక ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దర్యాప్తు చేస్తున్నారు. అయితే.. ఈ ప్రమాదానికి కారణం ఏంటీ అనేది పోలీసులు విచారిస్తున్నారు. ద్విచక్రవాహనం అతివేగంగా వెళ్లటం వల్లే.. ఫ్లైఓవర్ మీద అదుపుతప్పి కింద పడిపోయి ఉంటుందని భావిస్తున్నారు. అదే సమయంలో అటుగా ఆర్టీసీ డబుల్ డెక్కర్ బస్సు రావటంతో.. అమ్మాయి బస్సు టైర్ల కింద పడిపోగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే ప్రాణాలు వదిలినట్టు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించినట్టు సమాచారం. కాగా.. ఈ ప్రమాదానికి గల కారణాలు పూర్తిగా తెలుసుకునే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ఆదిలాబాద్ కుర్రోడికి వరుస ప్రభుత్వ ఉద్యోగాలు.. నిజంగా మీరు గ్రేట్ భయ్యా..!

హైదరాబాద్-నవభూమి:ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం సాధిచటం ప్రతి ఒక్క నిరుద్యోగ కల. అందుకోసం రాత్రింబవళ్లు కష్టపడి చదువుతుంటారు. నెలలు, సంవత్సరాలు కష్టపడి చదివితేగానీ.. ఒక్క ఉద్యోగం సాధించలేరు. ప్రభుత్వం ఏ ఉద్యోగ నోటిఫికేషన్ రిలీజ్ చేసినా.. వేలల్లో, లక్షల్లో పోటీ ఉంటుంది. రోజులో ఎన్ని గంటలు కష్టపడినా.. ఏన్నేళ్లు నిరీక్షించినా.. కొందరు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగ సాధనలో సక్సెస్ అవుతారు. అటువంటింది ఒకటి కాదు.. రెండు కాదు.. వరుసగా 3 ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిందాడు ఓ యువకుడు.

ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ముస్కు సిద్ధార్థ రెడ్డి వరుస ఉద్యోగాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన సిద్ధార్థ రెడ్డి.. చిన్నప్పటి నుంచి చదువులో ముందుండే వాడు. తల్లిదండ్రులు ముస్కు వినోద్‌రెడ్డి, నందల కష్టాన్ని చూసి వారి ఆశలకు అనుగుణంగా చదువును కొనసాగించాడు. ఆదిలాబాద్‌లోనే ప్రాథమిక విద్యను పూర్తి చేసిన సిద్ధార్థ రెడ్డి హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ చదివారు. నాగ్‌పూర్‌లోని ఎన్ఐటీలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు. చదువు పూర్తయిన వెంటనే ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం వచ్చింది.ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమయ్యాడు. మొదట గ్రామీణ వికాస్ బ్యాంకులో సెక్టార్ అధికారిగా ఉద్యోగం వచ్చింది. ఆ తర్వాత తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ పోస్టుకు పరీక్ష రాశారు. అందులో మేనేజర్ ఉద్యోగం సాధించారు. ఇంతలో కేంద్ర ప్రభుత్వ పరిధిలో పోస్టుల నోటిఫికేషన్ వచ్చింది. వెంటనే దరఖాస్తు చేసుకుని పరీక్షకు సిద్ధమయ్యారు. ఈసారి ఏకంగా కేంద్ర పరిశ్రమ, వాణిజ్య పన్నుల శాఖ (ఈసీజీసీ లిమిటెడ్) పీఓగా ఎంపికయ్యారు. కేంద్ర సర్వీసులో ఉద్యోగం రావడంతో తల్లిదండ్రులతో పాటు బంధువులు, స్నేహితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.సిద్ధార్థ తల్లిదండ్రులు నిజంగా అదృష్టవంతులంటూ స్థానికులు ప్రశంసిస్తున్నారు. ఒక్క ఉద్యోగం సాధించటమే గగనమైన ఈ రోజుల్లో వరుసగా ఇన్ని ఉద్యోగాలు సాధించటం మామూలు విషయం కాదని అంటున్నారు. సిద్ధార్థ టాలెంట్ సూపర్ అని అతడిని ఆదర్శంగా తీసుకొని యువత ఉద్యోగాలకు సన్నద్ధం కావాలని అంటున్నారు.

కొత్త పోస్టులు.. ఉత్వర్వులు జారీ..

హైదరాబాద్-నవభూమి:కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ పథకాలను అమలు చేసుకుంటూ ముందుకు పోతోంది. ప్రతి వర్గానికి న్యాయం చేసుకుంటూ పాలన సాగిస్తోంది. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా పాటిస్తోంది. ఇటీవల నిరుద్యోగులకు ఉపయోగపడే విధంగా రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ కూడా సాగుతోంది. అర్హులైన వారికి రూ.3 లక్షలను ప్రభుత్వం అందించనుంది.అయితే నిరుద్యోగ ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రేవంత్ రెడ్డి సర్కార్.. ఇటీవల జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. ఇప్పటికే గ్రూప్ 1, గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలకు సంబంధించి ఫలితాలను విడుదల చేసిన ప్రభుత్వం.. త్వరలోనే వీటికి నియామక పత్రాలను అందజేస్తామని బడ్జెట్ సమావేశాల్లో మంత్రి కూడా తెలియజేశాడు. వీటితో పాటు.. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకారం కొత్త పోస్టులకు నోటిఫికేషన్లను విడుదల చేస్తామన్నారు.%ఇప్పటికే తెలంగాణలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను గుర్తించి ఆర్థిక శాఖ ఆమోదం కూడా తెలిపింది. వాటికి కూడా త్వరలోనే నోటిఫికేషన్లను విడుదల చేసి అభ్యర్థులను నియమించనున్నారు. తాజాగా నిరుద్యోగులకు మరో శుభవార్త చెప్పింది తెలంగాణ ప్రభుత్వం. రెవెన్యూ శాఖలో పలు ఖాళీల పోస్టులను గుర్తిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గ్రామీణ స్థాయిలో పాలనను మరింత సులభతరం చేసేందుకు ప్రభుత్వం రెవెన్యూ శాఖలోని కొత్తగా 10,954 గ్రామ పాలనాధికారి పోస్టులను మంజూరు చేసింది.ఈ మేరకు ఆర్థిక శాఖ నుంచి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి. ఈ పోస్టులకు సంబంధించి ఇప్పటికే మాజీ వీఆర్ఏలు, మాజీ వీఆర్ఓల నుంచి ఆప్షన్స్ తీసుకున్నారు. వారిలో అర్హులైన వారికి ఈ పోస్టుల్లో నియమించనున్నారు.ఒక వేళ అందులో ఏమైనా మిగిలిన పోస్టులు ఉంటే.. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ విధానంలో భర్తీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

రైతులకు మరో శుభవార్త.. సబ్సిడీ కోసం దరఖాస్తుల ఆహ్వానం..

హైదరాబాద్-నవభూమి:తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పలు పథకాలను అందిస్తోంది. దీనిలో భాగంగానే రైతుభరోసా కింద ఏడాదికి రూ.12 వేలు, రైతు కూలీలకు కూడా రూ.12 వేలను అందిస్తోంది. దీంతో పాటు.. రైతుబీమా వంటి పథకాలను అందిస్తున్నారు. వీటితో పాటు.. కేంద్ర ప్రభుత్వం నుంచి పీఎం కిసాన్, ఫసల్ బీమా యోజన వంటి పథకాలు రైతులకు ఎంతగానో మేలు చేస్తున్నాయి.రైతులకు మరో శాభవార్త చెప్పింది తెలంగాణ ప్రభుత్వం. సబ్సిడీపై వ్యవసాయ పరికరాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన రైతులను గుర్తించి వారికి సబ్సిడీపై పరికరాలను అందించబోతున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. అయితే ప్రస్తుతం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్, కల్హేర్ మండల పరిధిలోని రైతులకు మాత్రం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ రాయితీ పై వ్యవసాయ పరికరాలను అందించడానికి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం అయిందని నారాయణఖేడ్ డివిజన్ వ్యవసాయ శాఖ సహాయ సంచాలకుడు నూతన్‌కుమార్ తెలిపాడు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ కేటగిరీకి చెందిన మహిళా రైతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. వీరికి 50 శాతం రాయితీతో పరికరాలను అందిస్తుండగా.. జనరల్ రైతులకు 40 శాతం రాయితీ అందిస్తారు. రూ.లక్ష లోపు లబ్ధి పొందే రైతులు ఒక ఎకరం లోపు భూమి కలిగి ఉండాలన్నారు. ఇంతకంటే ఎక్కువ మొత్తంలో లబ్ధి పొందే రైతులు కచ్చితంగా ఎకరం భూమి ఉండాలని పేర్కొన్నారు.అధికారులు రైతులకు అందించే పరికరాల వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాటరీ స్ప్రేయర్, రోటోవేటర్, నాప్సాక్ స్ప్రయెర్, బ్రష్ కట్టర్‌తో పాటు మరికొన్ని పరికరాలు ఉన్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అనంతరం మండల స్థాయిలోని నియమించిన కమిటీ సమక్షంలో లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందన్నారు. ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవసాయాధికారి ఉంటారు. మెంబర్లుగా తహసీల్దారు, ఎంపీడీఓలు వ్యవహరిస్తారు. ఇక దరఖాస్తులు చేయడానికి చివరి తేదీ మార్చి 24గా నిర్ణయించారు. దరఖాస్తు చేసే రైతులు నేల సారంకు సంబంధించి సాయిల్ హెల్త్ కార్డు తప్పనిసరిగా ఉండాలి. వీటితో పాటు.. బ్యాంక్ పాసు పుస్తకం కూడా ఉండాలన్నారు. పూర్తి వివరాలకు సంబంధిత ఏఓ, ఏఈఓలను సంప్రదించాలన్నారు.

చంద్రబాబు గెలిచేవాడే కాదు.. కేసీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్-నవభూమి:తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. మరోసారి ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేశారు. రామగుండం నుంచి ఎర్రవెల్లి వరకు 180 కిలోమీటర్లు 200 మంది వారం రోజుల పాటు పాదయాత్ర చేయగా.. ఈరోజు (మార్చి 22) కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా.. కార్యకర్తలతో సమావేశమైన కేసీఆర్.. వారితో పలు కీలక అంశాలు ప్రస్తావించారు. ఈ సందర్భంగానే.. ఏపీ రాజకీయాలు, చంద్రబాబు నాయుడు గెలుపుపై ఇంట్రెస్టింగ్ విషయాలు చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రామగుండం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో తన వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ సమావేశమయ్యారు. ఎండిన గోదావరి తల్లి కన్నీటి గోసను.. కాళేశ్వరం నీళ్లందక పంటలు ఎండిన రైతన్నల గుండె కోతలను.. సమాజానికి తెలిపేందుకు.. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అధ్వర్యంలో రామగుండం నుంచి ఎర్రవల్లి దాకా 200 మందితో 180 కిలోమీటర్ల పాదయాత్ర వారం రోజుల పాటు సాగి శనివారం (మార్చి 22న) ముగిసింది. ఈ సందర్భంగా.. పాదయాత్ర చేసిన కార్యకర్తలతో గులాబీ బాస్ కేసీఆర్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాట్లాడిన కేసీఆర్ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ఆనాటి విషయాలు గుర్తు చేయటమే కాకుండా.. తనదైన శైలిలో చలోక్తులు వదులుతూ నవ్వులు పూయించారు.రాబోయే రోజుల్లో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీదే అధికారమని కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. అది కూడా సింగిల్‌గానే అధికారంలో వస్తామని తెలిపారు. బెల్లం ఉన్న దగ్గరికే ఈగలు వస్తాయని.. అలానే సిరిసంపదలు ఉన్న తెలంగాణాని దోచుకోవడానికి కొందరు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత పదేళ్ల పాటు తెలంగాణలో ఎటువంటి ఇబ్బందులు లేవని చెప్పుకొచ్చిన కేసీఆర్.. ఇప్పుడు సమస్యల వలయంలో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.ఆనాడు ప్రధాని నరేంద్ర మోదీ తన మెడపై కత్తి పెట్టిన తెలంగాణ కోసం తాను ఎక్కడా వెనకడుగు వేయలేదని కేసీఆర్ గుర్తు చేశారు. తెలంగాణ కోసం ఎప్పటికైనా పోరాడేది బీఆర్ఎస్ మాత్రమేనని చెప్పుకొచ్చారు. రామగుండంలో గెలిచిన ఎమ్మెల్యే ఓ సన్నాసి అని కేసీఆర్ తెలిపారు. తెలంగాణకి ఆనాడు ఇందిరాగాంధీ మోసం చేసిందని ఆరోపించారు. తెలంగాణను బలవంతంగా ఆంధ్రాలో కలిపారని ఆనాటి పరిస్థితులను కేసీఆర్ వివరించారు.ఈ నేలపై ఎవరు శాశ్వతం కాదన్న కేసీఆర్.. అందరూ ఒక్కో కేసీఆర్‌లా తయారు కావాలని గులాబీ బాస్ పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కుల కోసం పోరాడాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ నోటికి వచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని.. కానీ ఇప్పుడు ఒక్క హామీ కూడా నెరవేర్చడం లేదని మండిపడ్డారు. ఆనాడు.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు.. మేనిఫెస్టోలో పెట్టకున్నా సరే.. రైతు బంధు, కళ్యాణ లక్ష్మీ ఇచ్చామని కేసీఆర్ చెప్పుకొచ్చారు.ఇదే క్రమంలో.. ఏపీ రాజకీయాలపై కూడా కేసీఆర్ ఇంట్రెస్టింగ్ కామెంట్లు చేశారు. ఏపీలో కూటమి లేకుంటే చంద్రబాబు గెలిచేవాడే కాదని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. కూటమి ఏర్పడింది కాబట్టే ఈరోజు ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నారని.. చెప్పుకొచ్చారు. మరోవైపు.. తెలంగాణ, ఏపీ మధ్య కృష్ణా జలాల వివాదం విషయాన్ని కూడా ప్రస్తావించారు కేసీఆర్. తమకు రావాల్సిన నీళ్లను ఎత్తుకుపోతుంటే.. నిలబడి కలబడి కొట్లాడేవాడే అసలైన ఫైటర్ అని.. కానీ ఇప్పుడున్న ప్రభుత్వం ఆ పని చేయట్లేదని తెలిపారు.

పోసాని కృష్ణమురళి విడుదల

(1వపేజీ తరువాయి)స్వాగతం పలికారు. ఆ తర్వాత పోసాని తన కుటుంబసభ్యులతో కలిసి కారులో అక్కడినుంచి వెళ్లిపోయారు. కాగా, మార్చి 23వ తేదీ వరకు పోసాని రిమాండ్‌లో ఉండాల్సి ఉంది. సీఐడీ అధికారులు ఒక రోజు ఆయన్ని కస్టడీలోకి తీసుకుని విచారించారు. మరోసారి తమకు విచారణ నిమిత్తం అప్పగించాలని కోర్టును కోరారు. కానీ, ఈ లూపే కోర్టు ఆయనకు బెయిల్ ఇచ్చింది.

షరతులతో కూడిన బెయిల్..గుంటూరులోని సీఐడీ కోర్టు పోసానికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. లక్ష రూపాయల చొప్పున ఇద్దరు వ్యక్తులతోపాటు సొంత పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. చార్జిషీటు దాఖలు చేసే వరకు గుంటూరు సీఐడీ రీజినల్ ఆఫీసులో రెండు వారాలకోసారి హాజరు కావాలని షరతు పెట్టింది. పోలీసులు పిలిచినప్పుడు వచ్చి విచారణకు సహకరించాలని ఆదేశించింది. అయితే, పోసానిపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం వ్యాప్తంగా చాలా చోట్ల కేసులు నమోదు అయి ఉన్నాయి. బెయిల్ మంజూరు అయిన తర్వాత కూడా ఆయన విడుదలపై ఉత్కంఠ నెలకొని ఉండింది. కోర్టు బెయిల్ మంజూరు చేసినా.. ఏ జిల్లా నుంచి అయినా పోలీసులు వచ్చి పీటీ వారెంట్‌తో పోసానిని మరోసారి అదుపులోకి తీసుకుంటారా? అన్న అనుమానం కూడా ఉండింది. కానీ, ఆ ఉత్కంఠకు తెరపడి, పోసాని విడుదలయ్యారు.

డీలిమిటేషన్‌పై పోరాటానికి జేఏసీ ఏర్పాటు

(1వపేజీ తరువాయి)రు. ఇందులో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన వివిధ పార్టీలను భాగస్వామ్యం చేశారు. నిష్పక్షపాతంగా, న్యాయబద్ధంగా డీలిమిటేషన్ జరగాల్సిన అవసరం ఉందని స్టాలిన్ డిమాండ్ చేశారు. పక్షపాత వైఖరిని కేంద్రం ప్రదర్శించితే దాన్ని ఎదుర్కొనడానికి అవసరమైన న్యాయ సలహాలను ఇవ్వాలని ఆయన దక్షిణాది రాష్ట్రాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ నియోజకవర్గాల విభజన అనేది న్యాయబద్ధంగా చేపట్టడానికి నిపుణుల కమిటీని సైతం ఏర్పాటు చేయాలని ఆయన ప్రతిపాదించారు. ఈ అంశంపై ఎట్టిపరిస్థితుల్లోనూ వెన్నుచూపని పోరాటం సాగించాల్సిన అవసరం ఉందని, దక్షిణాది రాష్ట్రాలన్నీ కూడా ఐక్యంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. తమకు ఎంతమాత్రం ప్రాధాన్యత తగ్గకుండా చూసుకోవాలని, జనాభా ప్రాతిపదికన లోక్‌సభ నియోజకవర్గాలను విభజించడం సరికాదని అన్నారు. దీనివల్ల తమిళనాడు వంటి రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అసమానతలు తలెత్తుతున్నాయని స్టాలిన్ ఆందోళన వ్యక్తం చేశారు. జనాభాను ఆధారంగా చేసుకోవడం వల్ల లోక్‌సభలో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గుతుందని వివరించారు. ఫలితంగా ఆయా రాష్ట్రాల ప్రయోజనాలు దెబ్బతింటాయని తేల్చి చెప్పారు.

ఏపీకి కొత్త డీజీపీ ఎవరు ?

విజయవాడ-నవభూమి: ఏపీలో ఇన్ ఛార్జ్ డీజీపీగా ఉన్న హరీష్ కుమార్ గుప్తా స్థానంలో కొత్త డీజీపీ ఎంపిక కోసం కసరత్తు మొదలైంది. ఇందులో భాగంగా ప్రభుత్వం ఇవాళ ఐదుగురు సీనియర్ ఐపీఎస్ అధికారుల పేర్లను యూపీఎస్సీకి పంపింది. ఇందులో మూడు పేర్లను ఎంపిక చేసి తిరిగి యూపీఎస్సీ ప్రభుత్వానికి పంపుతుంది. ఇందులో నుంచి ఒక అధికారిని ప్రభుత్వం డీజీపీగా నియమించే అవకాశం ఉంది. దీంతో కొత్త డీజీపీ ఎవరన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. గతంలో డీజీపీగా పనిచేసిన ద్వారకా తిరుమల రావు రిటైర్మెంట్ తర్వాత ప్రభుత్వం కొత్త డీజీపీ ఎంపిక చేయాల్సి ఉంది. ఇందుకోసం యూపీఎస్సీకి పేర్లు పంపడానికి సమయం లేకపోవడంతో ప్రభుత్వం తాత్కాలిక డీజీపీగా హరీష్ గుప్తాను నియమించింది. గతంలో ఎన్నికల సమయంలోనూ హరీష్ గుప్తాను ఈసీ ఓసారి డీజీపీగా నియమించింది. దీంతో హరీష్ గుప్తాను ఎంపిక చేసిన ప్రభుత్వం.. ఆయనతో పాటు మొత్తం ఐదు పేర్లను యూపీఎస్సీకి పంపింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్త డీజీపీ ఎంపిక కోసం యూపీఎస్సీకి పంపిన పేర్లలో సీనియర్ ఐపిఎస్ లు మాదిరెడ్డి ప్రతాప్, రాజేంద్ర నాథ్ రెడ్డి, హరీష్ కుమార్ గుప్తా, కుమార్ విశ్వజిత్. సుబ్రహ్మణ్యం ఉన్నారు.వీరిలో ముగ్గురిని కేంద్రం ఎంపిక చేసి తిరిగి పంపనుంది. అప్పుడు వారిలో ఒకరిని ప్రభుత్వం డీజీపీగా ఎంచుకునే అవకాశాలున్నాయి. అప్పుడు ఆయన్ను కొత్త డీజీపీగా నియమించనున్నారు. ఎలాగో కేంద్రంలోనూ ఎన్డీయే ప్రభుత్వమే ఉండటంతో ప్రభుత్వ ఛాయిస్ మేరకే డీజీపీ ఎంపిక ఉండొచ్చని తెలుస్తోంది.

వడగండ్ల వాన

హైదరాబాద్-నవభూమి: తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాలో శుక్రవారం కురిసిన వర్షంతో రాష్ట్ర వ్యాప్తంగా ఎండ తీవ్రత నుంచి ప్రజలు కొంత ఉపశమనం పొందారు. శుక్రవారం రాత్రి హైదరాబాద్ తోపాటు పలు జిల్లాల్లో భారీ వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో వడగండ్ల వాన పడింది. దీంతో ప్రజలు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించినట్లయింది. తాజాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. రాగల 24 గంటల్లో రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో వడగండ్ల వానలు కురుస్తాయని పేర్కొంది. ఆదిలాబాద్, కొమరంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. హైదరాబాద్ మహా నగరంతోపాటు చుట్టు పక్కల జిల్లాల్లో నూ వర్షం కురిసే అవకాశం ఉంది

వినోద్ కుమార్ శుక్లాకు జ్ఞానపీఠ్ అవార్డు

(1వపేజీ తరువాయి) నుంచి ఈ అత్యున్నత సాహిత్య పురస్కారాన్ని అందుకున్న తొలి రచయితగా వినోద్ కుమార్ శుక్లా నిలిచారు. భారతీయ సాహిత్యానికి ఆయన చేసిన విశేషమైన సేవలకు గుర్తింపుగా ఈ జ్ఞానపీఠ్ అవార్డును ప్రదానం చేయనున్నారు. దేశంలోనే ఇది అత్యున్నతమైన సాహిత్య పురస్కారంగా పరిగణించబడుతుంది. ఈ అవార్డుకు ఎంపికైన 12వ హిందీ రచయితగా శుక్లా గుర్తింపు పొందారు. ఈ పురస్కారంలో భాగంగా రూ. 11 లక్షల నగదు బహుమతితో పాటు, సరస్వతి కాంస్య విగ్రహాన్ని అందజేస్తారు.

హిందీ సాహిత్యంలో ఆయన చేసిన కృషికి, ఆయన విలక్షణమైన రచనా శైలికి గాను ఈ అవార్డు లభించింది. ఇదివరకే, 1999లో ఆయన సాహిత్య అకాడమీ అవార్డును కూడా అందుకున్నారు.

జనాభా కంటే మొబైల్ ఫోన్లే ఎక్కువ..!

(1వపేజీ తరువాయి)టెలికాం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) 2024 సెప్టెంబర్ నివేదిక ప్రకారం రాష్ట్రంలో ఉన్న మొత్తం టెలిఫోన్ వినియోగదారుల సంఖ్య 4.19 కోట్లు. ఇందులో మొబైల్ ఫోన్ వినియోగదారుల సంఖ్య 4.4 కోట్లు కాగా, ల్యాండ్‌లైన్ వినియోగదారుల సంఖ్య15.25 లక్షలుగా ఉంది.

ఇక టెలిఫోన్ వినియోగదారుల్లో 60 శాతానికి పైగా పట్టణ ప్రాంతాల్లో ఉంటే.. 39 శాతానికి పైగా గ్రామీణంలో ఉన్నారు. కేవలం మొబైల్ ఫోన్ల వినియోగదారులను చూస్తే పట్టణాల్లో 59 శాతం మంది, గ్రామీణ ప్రాంతంలో 41 శాతం మంది ఉన్నారు. అలాగే ల్యాండ్‌లైన్ వినియోగదారుల్లో 96 శాతం పట్టణాల్లో ఉంటే.. గ్రామీణంలో కేవలం 4 శాతం మాత్రమే. ట్రాయ్ నివేదిక ప్రకారం మొబైల్ ఫోన్ల వినియోగానికి సంబంధించి రాష్ట్ర వైర్‌లెస్ టెలీ డెన్సిటీ 105.32 శాతంగా ఉంది. అంటే రాష్ట్రంలోని సగటున ప్రతి 100 మందికి 105కి పైగా మొబైల్ ఫోన్లు ఉన్నాయి.

ఈ అంశంలో రాష్ట్రం దేశంలో నాలుగో స్థానంలో ఉంది. గోవా-152, కేరళ-115, హర్యానా 114 శాతంతో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. అలాగే తెలంగాణలో ఇంటర్నె

సజీవంగా తిరిగి వచ్చిన హత్యకు గురైన మహిళ.. జైల్లో నిందితులు

భోపాల్-నవభూమి: హత్యకు గురైన మహిళ ఏడాదిన్నర తర్వాత సజీవంగా ఇంటికి తిరిగి వచ్చింది. ఆమెను చూసి తండ్రి, కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. అయితే ఆ మహిళ హత్య కేసులో అరెస్టైన నలుగురు వ్యక్తులు జైల్లో ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని మందసౌర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 2023 సెప్టెంబర్‌లో గాంధీ సాగర్ ప్రాంతంలో నివసించే 35 ఏళ్ల లలితా బాయి అదృశ్యమైంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, ముఖం చిద్రమైన మహిళ మృతదేహాన్ని లలిత కుటుంబానికి పోలీసులు చూపించారు. చేతిపై పచ్చబొట్టు, కాలికి నల్లటి దారం వంటి భౌతిక గుర్తుల ఆధారంగా ఆమె తన కుమార్తె అని తండ్రి గుర్తించాడు. ఆ తర్వాత మృతదేహానికి అంత్యక్రియలు కూడా నిర్వహించారు. ఆ మహిళ హత్య కేసుకు సంబంధించి నలగురు అనుమానితులైన ఇమ్రాన్, షారుక్, ఎమరోవైపు రెండు రోజుల కిందట లలితా బాయి తన ఇంటికి తిరిగి వచ్చింది. ఆమె సజీవంగా ఉండటం చూసి తండ్రి, కుటుంబ సభ్యులు షాక్ అయ్యారు. తల్లి తిరిగి రావడం పట్ల ఆమె ఇద్దరు పిల్లలు సంతోషం పట్టలేకపోయారు. అనంతరం లలితా బాయి తన తండ్రితో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. ఏడాదిన్నర కిందట షారుక్ అనే వ్యక్తితో కలిసి భానుపరాకు తాను వెళ్లినట్లు పోలీసులకు చెప్పింది. అక్కడ రెండు రోజులు ఉన్నానని, ఆ తర్వాత రూ.5 లక్షలకు మరో వ్యక్తికి అతడు అమ్మినట్లు చెప్పింది.

డీలిమిటేషన్ మెడపై వేలాడుతున్న కత్తి : కేరళ సీఎం విజయన్

న్యూఢిల్లీ-నవభూమి: డీలిమిటేషన్ అంశంపై చెన్నైలో విపక్షాల నేతలు సమావేశమ య్యారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. డీలిమి టేషన్‌పై న్యాయ పోరాటం చేస్తామని స్టాలిన్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేరళ సీఎం పీ విజయన్ మాట్లాడారు. పార్లమెంట్ నియోజకవర్గాల డీలిమిటేషన్ అంశంపై మెడపై వేలాడుతున్న కత్తిలా ఉందన్నారు. ఎవరితోనూ చర్చించకుండానే డీలిమిటేషన్ అంశంపై బీజేపీ అడుగులు వేసిందని ఆరోపించారు. ఇది రాజ్యాంగానికి వ్యతిరేకమని, ప్రజాస్వామ్య ప్రక్రియకు విరుద్ధమని అభివర్ణించారు. జనాభా ప్రాతిపదికన లోక్‌సభ స్థానాల డీలిమిటేషన్ జరిగితే సీట్లు తగ్గుతాయన్నారు. బీజేపీ అధినేత, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ ఓ వీడియో సందేశంలో జేఏసీ సమావేశం చాలా కీలకమైందన్నారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్.. జనాభాను నియంత్రించే రాష్ట్రాలకు అన్యాయమన్నారు. జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ చేయకూడదనేది తమ డిమాండ్ అన్నారు. అన్ని సందేహాలను నివృత్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని పార్టీలతో సవివరంగా చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. జాయింట్ యాక్షన్ కమిటీ సమావేశంలో డీలిమిటేషన్‌పై నేతలు తీర్మానం చేశారు. డీలిమిటేషన్ అంశంపై ప్రజాస్వామ్య పద్ధతిలో అన్ని వాటాదారులతో సవివరమైన చర్చలు జరపాలని తీర్మానం డిమాండ్ చేశారు. 42వ, 84వ, 87వ రాజ్యాంగ సవరణలను పరిరక్షించాలని.. అందులో జనాభా నియంత్రణ చర్యలు అమలు చేయబడినట్లుగా నేతలు పేర్కొన్నారు. తద్వారా దేశ జనాభాను నియంత్రించవచ్చని.. జనాభా నియంత్రణ చేసిన రాష్ట్రాలను శిక్షించకూడదని నేతలు పేర్కొన్నారు. జేఏసీ తర్వాతి మీటింగ్ హైదరాబాద్‌లో జరుగనున్నది. ఇంకా తేదీ ఖరారు కాలేదు. సమావేశంలో డీఎంకే ఎంపీ కనిమొళి మాట్లాడుతూ ప్రతిపాదిత డీలిమిటేషన్‌లో పారదర్శకత లోపించిందని, ఇందుకు సంబంధించి వివిధ వాటాదారులతో ఎలాంటి చర్చ జరగలేదని అన్నారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా పార్లమెంట్ స్థానాలపై విధించిన నిషేధాన్ని మరో 25 ఏళ్ల పాటు పొడిగించాలని డిమాండ్ చేశారు.

మహిళా నిరసనకారులను బెదిరించిన బీజేపీ నేత..

కోల్‌కతా:నవభూమి: రోడ్డు ప్రారంభోత్సవానికి వెళ్లిన బీజేపీ సీనియర్ నేత పట్ల స్థానిక మహిళలు నిరసన వ్యక్తం చేశారు. దీంతో ఆయన సహనం కోల్పోయారు. గొంతు నొక్కుతానంటూ మహిళలను ఆయన బెదిరించారు. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. పశ్చిమ బెంగాల్‌లోని పశ్చిమ మెదినీపూర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మార్చి 21న ఖరగ్‌పూర్‌లోని ఆరో నంబర్ వార్డులో కొత్తగా నిర్మించిన రోడ్డును ప్రారంభించేందుకు బీజేపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ దిలీప్ ఘోష్ వెళ్లారు. ఈ సందర్భంగా తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మహిళలు ఆయనను చుట్టుముట్టారు. ఆయన ఎంపీగా ఉన్నప్పుడు ఎక్కడా కనిపించలేదంటూ నిరసన తెలిపారు. తమ కౌన్సిలర్ ప్రదీప్ సర్కార్ ఈ రోడ్డును నిర్మించారని అన్నారు. ప్రారంభోత్సవం కోసం ఆయన రావడంపై మహిళలు మండిపడ్డారు. కాగా, బీజేపీ నేత దిలీప్ ఘోష్ తీవ్రంగా స్పందించారు. మహిళా నిరసనకారులను తృణమూల్ మద్దతుదారులుగా ముద్రించారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ఎంపీలాడ్ నిధులతో ఈ రోడ్డును నిర్మించినట్లు చెప్పారు. 'మీ నాన్న డబ్బులతో కాదు. వెళ్లి ప్రదీప్ సర్కార్‌ని అడగండి' అని అన్నారు. మరోవైపు కొందరు మహిళలు ఆగ్రహించారు. తమ తండ్రి గురించి ఎందుకు ప్రస్తావించావని దిలీప్ ఘోష్‌ను నిలదీశారు. ప్రజాప్రతినిధివైన నువ్వు ఇలా మాట్లాడవచ్చా? అని ప్రశ్నించారు. దీంతో దిలీప్ ఘోష్ సహనం కోల్పోయారు. 'మీ పద్నాలుగు తరాల గురించి కూడా మాట్లాడతా. అరవకండి. మీ గొంతు నొక్కుతా' అని బెదిరించారు. ఆ మహిళలను 'తృణమూల్ కుక్కలు'గా ఆయన అభివర్ణించారు. అయితే బీజేపీ నేత దిలీప్ ఘోష్ వ్యాఖ్యలతో అక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. ఆగ్రహించిన మహిళలు ఆయన కారును చుట్టుముట్టారు. ఆ వాహనంపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఇంతలో పోలీసులు అక్కడకు చేరుకోవడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే ఈ వాగ్వాదానికి సంబంధించిన వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

భర్తతో గొడవపడి అతడి నాలుక కొరికేసిన భార్య..!

న్యూఢిల్లీ-నవభూమి: భార్యాభర్తల మధ్య గొడవలు సహజమే. చాలామటుకు ఇలాంటి గొడవలు వెంటనే సమసిపోతుంటాయి. కానీ కొందరు దంపతుల మధ్య మాత్రం తీవ్ర స్థాయికి చేరుకుంటాయి. తాజాగా రాజస్థాన్‌లో అలాంటి గొడవే జరిగింది. భర్తతో గొడవపడిన ఓ మహిళ ఏకంగా అతని నాలుకలోని కొంత భాగాన్ని కొరికిపారేసింది. అతను నాలుక ముక్క పట్టుకుని ఆస్పత్రికి పరుగులు తీసేలా చేసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే.. రాజస్థాన్ రాష్ట్రం ఝులావర్ జిల్లాలోని బకానీ పట్టణానికి చెందిన కన్హయలాల్ సైన్ (25), రవీనా సైన్ (23) ఇద్దరూ భార్యాభర్తలు. పట్టణానికి సమీపంలోని సునేల్ గ్రామానికి చెందిన రవీనా సైన్‌ను ఏడాదిన్నర క్రితమే కన్హయలాల్ సైన్ వివాహం చేసుకున్నాడు. అయితే పెళ్లయిన దగ్గర నుంచి ఇద్దరి మధ్య నిత్యం గొడవలే జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా భార్యాభర్తలు గొడవపడ్డారు. ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి గొడవ తీవ్రమైంది. దాంతో కోపం పట్టలేకపోయిన రవీనా సైన్ తన భర్త నాలుకలో కొంత భాగాన్ని కొరికేసింది. అనంతరం ఓ గదిలోకి వెళ్లి తలుపేసుకుని ఎడమచేతి మణికట్టును కోసుకునేందుకు ప్రయత్నించింది. గమనించిన బంధువులు తలుపులు పగులగొట్టి ఆమె నుంచి కత్తిని గుంజుకున్నారు. వెంటనే కన్హయలాల్ సైన్‌ను ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు తెగిపోయిన కన్హయలాల్ నాలుకను కలిపి కుట్టేశారు. కన్హయ సోదరుడి ఫిర్యాదు మేరకు ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. చట్ట ప్రకారం రవీనాపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. బాధితుడు మాట్లాడే పరిస్థితిలో లేకపోవడంతో అతడి నుంచి వాంగ్మూలం తీసుకోవడం సాధ్యం కాలేదని చెప్పారు. బాధితుడి వాంగ్మూలం అనంతరం నిందితురాలిని అరెస్టు చేయనున్నట్లు తెలిపారు.

ట్విట్టర్ పాత లోగో వేలం.. బ్లూ పిట్ట ఎంతకు అమ్ముడు పోయిందంటే?

న్యూఢిల్లీ-నవభూమి: ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ (గతంలో ట్విట్టర్)ను ప్రపంచ కుబేరుడు, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ స్వాధీనం చేసుకున్నప్పటి నుంచి పెద్ద ఎత్తున మార్పులు చేశారు. ఎవరూ ఊహించని విధంగా దాని పేరును ట్విట్టర్ నుంచి ఎక్స్‌గా మార్చారు. అలాగే లోగోను సైతం బ్లూ బర్డ్ నుంచి ఎక్స్‌గా మార్చి సెన్సేషన్ క్రియేట్ చేశారు. అయితే తాజాగా ట్విట్టర్ పాత లోగో బ్లూ పిట్టను వేలం వేయగా.. రికార్డు ధర పలికింది. ఎవరూ ఊహించని స్థాయిలో దీనికి డబ్బులు రాగా.. ప్రజలంతా షాక్ అవుతున్నారు. ఒకప్పుడు నెటిజెన్లను ఎంతగానో ఆకట్టుకున్న ఈ లోగోకు ఇప్పటికీ అదే క్రేజ్ ఉందంటూ కామెంట్లు చేస్తున్నారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. ఆర్ఆర్ ఆక్షన్ అనే సంస్థ నిర్వహించిన ఈ వేలం పాటలో.. ఒకప్పుడు శాన్‌ఫ్రాన్సిస్కోలోని హెడ్ క్వార్టర్ వద్ద దర్శనం ఇచ్చిన ఈ బ్లూ బర్డ్ లోగో రికార్డు ధర పలికిందని సంస్థ తెలిపింది. ముఖ్యంగా 12 అడుగులు పొడవు, 9 అడుగుల వెడల్పు.. 254 కిలోల బరువు కల్గిన ఓ బ్లూ పిట్టను 35వేల డాలర్లకు ఓ వ్యక్తి కొనుగోలు చేసినట్లు వివరించింది. అంటే భారత కరెన్సీ ప్రకారం దీని విలువు దాదాపు రూ.30 లక్షలు అన్నమాట. ఎవరో కొనుగోలు చేసినట్లు మాత్రమే చెప్పిన సంస్థ అతడి పేరును మాత్రం వెల్లడించలేదు. కావాలనే సదరు వ్యక్తి తన వివరాలు ఎవరికీ చెప్పొద్దని కోరారని.. అందుకే ప్రకటించడం లేదంటూ కూడా ఆర్ఆర్ ఆక్షన్ సంస్థ వివరించింది. అయితే ఈ లోగోను వేలానికి పెట్టింది మరెవరో కాదు ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్. ఎక్స్ పాత విలువైన జ్ఞాపకాలను ఆ సంస్థ అధినేత మస్క్ వేలానికి పెట్టారు. దీనిలో ట్విట్టర్ ప్రధాన కార్యాలయంపై ఉన్న పిట్ట బొమ్మ సైన్ బోర్డు కూడా ఉంది. అయితే ఈ లోగోను.. 2006లో ఏర్పాటు అయిన ట్విట్టర్ బ్లూ బర్డ్ లోగోను.. పక్షుల కిలకిలరావాలకు గుర్తుగా డిజైన్ చేశారు. వెబ్ సైట్ క్రియేటివ్ బ్లాగ్ కథనం ప్రకారం లైట్ బ్లూ బర్డ్ సింబల్ కోసం అప్పట్లో 15 డాలర్లు చెల్లించి లోగో తయారు చేయించారు.

ఇదంతా ఇలా ఉండగా.. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ఎక్స్‌ను 2022 అక్టోబర్ నెలలో కొనుగోలు చేశారు. అందుకోసం ఆయన ఒక్కో స్టాక్‌కు 54.20 డాలర్లు చొప్పున చెల్లించారు. ఇలా మొత్తంగా 44 బిలియన్ డాలర్లు చెల్లించి మరీ ఈ మైక్రోబ్లాగింగ్ సైట్‌ను దక్కించుకున్నారు. ఆపై 75 శాతం మంది ఉద్యోగులను తొలగించి.. ట్విట్టర్ పేరును ఎక్స్‌గా మార్చారు. అలాగే లోగోను సైతం మార్చేశారు.

యూట్యూబ్ వీడియోలు చూసి సొంతంగా ఆపరేషన్.. 11 ఇంచుల మేర కడుపు కోసుకున్న వ్యక్తి

న్యూఢిల్లీ-నవభూమి: రోజురోజుకూ సోషల్ మీడియా ప్రభావం ఎక్కువైపోతుంది. ఎవరికి ఏం విషయం తెలియకపోయినా.. నెట్టింట వెతికేసి అన్నీ తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా ఎవరికైనా ఆరోగ్య సమస్యలు వస్తే కూడా యూట్యూబ్‌లో కొట్టి సొంతంగా చికిత్స కూడా చేసుకుంటున్నారు. అచ్చంగా ఇలాంటి పనే చేశాడో వ్యక్తి. ముఖ్యంగా విపరీతమైన కడుపు నొప్పి రావడం.. ఎన్ని ఆస్పత్రుల చుట్టూ తిరిగానా తగ్గకపోవడంతో.. తనకు తానే ఆపరేషన్ చేసుకోవాలనుకున్నాడు. యూట్యూబ్ వీడియోలు చూసి మరీ.. ఆపరేషన్‌కు కావాల్సిన సామగ్రి కొని తెచ్చుకున్నాడు. ఆపై పొట్టను కోసి.. అందులో ఏమైనా సమస్య ఉందేమోనని వెతికేశాడు. ఆపై ఏం జరిగిందో తెలియాలంటే మీరు ఈ కథ చదివేయాల్సిందే. ఉత్తర ప్రదేశ్ మథుర జిల్లాలోని సున్‌రాక్ గ్రామానికి చెందిన 32 ఏళ్ల రాజబాబుకు చాలా కాలంగా కడుపు నొప్పి వస్తుంది. అనేక ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. ఎన్ని మందులు వేసుకున్నా నొప్పి మాత్రం తగ్గలేదు. దీంతో తరచుగా తన సమస్య ఏంటో తెలుసుకోవాలనుకుని మొబైల్ ఫోన్ తీసుకుని నెట్టింట వెతకడం ప్రారంభించాడు. ముఖ్యంగా యూట్యూబ్ ఓపెన్ చేసి కడుపు నొప్పి తగ్గాలంటే ఏం చేయాలని సెర్చ్ చేశాడు. ఈక్రమంలోనే అనేక వీడియోలు వచ్చాయి. ఓ వీడియోలో కడుపు నొప్పి తగ్గాలంటే ఆపరేషన్ చేయించుకోవాలని చూపించగా.. రాజబాబు శస్త్ర చికిత్స చేయించుకోవాలనుకున్నాడు. కానీ సర్జరీ కోసం ఎక్కువ డబ్బులు ఖర్చు అవుతాయని భావించి.. తనకు తానే ఆపరేషన్ చేసుకోవాలనుకున్నాడు. అందుకోసం ఏమేం కావాలో వీడియోలో చూసి రాసుకున్నాడు. ఆపై మెడికల్ స్టోర్‌కు వెళ్లి వాటిని కొనుగోలు చేశాడు. ముఖ్యంగా సర్జికల్ బ్లేడ్, కుట్లు వేసుకునే సూదులు, మత్తు ఇంజెక్షన్లు తెచ్చుకున్నాడు. అనేక వీడియోలు చూసి సర్జరీ చేయడం ఎలాగో తెలుసుకున్నాడు. ముందుగా మత్తు సూది ఇచ్చుకుని.. ఆపై కడుపుపై 7 ఇంచుల మేర కోసుకున్నాడు. పొట్టలో వెతుకు తూ.. నొప్పికి గల కారణం ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేశాడు. రాజబాబుకు ఏమీ అర్థం కాకపోవడంతో 11 ఇంచుల మేర కడుపు కోసుకున్నాడు. నొప్పి ఎక్కువ అవడం, తీవ్ర రక్తస్రావం కావడంతో భయపడి కేకలు వేశాడు. దీంతో కుటుంబ సభ్యులు గదిలోకి వచ్చి చూసి షాక్ అయ్యారు. వెంటనే రాజబాబును స్థానిక ఆస్పత్రికి తీసుకువెళ్లారు. కడుపు కోసి ఉండడం చూసి ఏమైందని అడగ్గా.. తానే సర్జరీ చేసుకోవాలనుకున్నట్లు చెప్పాడు. అది విన్న వైద్యులు దిగ్భ్రాంతికి గురయ్యారు. కడుపు లోపలికి కట్ అవ్వడం గమనించి.. మెరుగైన చికిత్స నిమిత్తం ఆగ్రాలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి నిలకడానే ఉండగా.. రాజబాబుకు 18 ఏళ్ల క్రితం అపెండిసైటిస్ ఆపరేషన్ జరిగిందని కుటుంబ సభ్యులు వివరిస్తున్నారు.

మరో విమానంలో అమెరికా నుంచి అక్రమ వలసదారుల రాక..

న్యూఢిల్లీ-నవభూమి: అక్రమంగా అమెరికాలో నివాసం ఉంటున్న వారిని ఆయా దేశాలకు పంపిస్తున్న విషయం తెలిసిందే. విడతల వారీగా భారతీయులను పంపుతున్న అగ్రరాజ్యం తాజాగా మరో విడతలో భారీగా భారతీయులను పంపించేందుకు సిద్ధమైంది. త్వరలోనే మరో 295 మంది భారతీయులను పంపించనున్నట్లు కేంద్రం తాజాగా వెల్లడించింది. ఈ మేరకు అమెరికాకు అక్రమంగా వలస వెళ్లిన వారిని తిరిగి పంపిస్తున్న అంశంపై పార్లమెంటులో అడిగిన ప్రశ్నకు కేంద్ర విదేశాంగ శాఖ లిఖితపూర్వకంగా సమాధానం ఇచ్చింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పదవి చేపట్టగానే అమెరికా ప్రభుత్వం అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతోందని చెప్పుకొచ్చింది. అయితే అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో ఆయా దేశాలకు పంపించడం సహా వారితో అమెరికా అధికారులు వ్యవహరిస్తున్న తీరుపైనా కేంద్రం స్పందించింది. దీనిపై తమ ఆందోళనను అగ్రరాజ్య ఉన్నతాధికారులకు తెలియజేసినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 5వ తేదీన భారత్‌కు పంపించిన అక్రమ వలసదారులకు, ముఖ్యంగా మహిళలకు సంకెళ్లు వేసిన అంశాన్ని అమెరికా వద్ద ప్రస్తావించినట్లు చెప్పుకొచ్చింది. దీనికి అమెరికా కూడా సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించింది. భారత్ తన ఆందోళనలు తమ దృష్టికి తీసుకువచ్చిన తర్వాత ఫిబ్రవరి 15, 16 తేదీల్లో పంపించిన వలసదారుల్లో మహిళలు, చిన్నారులకు సంకెళ్లు వేయలేదని అమెరికా ధ్రువీకరించింది. వలసదారులు స్వదేశానికి చేరుకున్న తర్వాత వారితో చర్చించి మన అధికారులు కూడా దీన్ని నిర్ధారించుకున్నట్లు కేంద్రం వెల్లడించింది. అమెరికాలో చట్ట విరుద్ధంగా నివాసం ఉంటున్న వారిలో మరో 295 మంది వివరాలను సంబంధిత ఏజెన్సీలు పరిశీలిస్తున్నాయని, త్వరలోనే వారిని కూడా అమెరికా స్వదేశానికి పంపించినట్లు చెప్పుకొచ్చింది. ఫిబ్రవరి 5వ తేదీ నుంచి ఇప్పటి వరకూ 388 మంది భారత అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో అమెరికా వెనక్కి పంపించింది. వీరిలో ఎక్కువ శాతం మంది (40 శాతం) మంది పంజాబ్ వాసులే ఉన్నారు. ఆ తర్వాత హర్యానా(34 శాతం) కు చెందిన వారు ఉన్నారు. వీరిని సైనిక విమానాల్లో చేతులకు సంకెళ్లు వేసి, కాళ్లకు గొలుసులు కట్టి భారత్‌కు తీసుకురావడం ఆయా వీడియోలు, ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఆందోళనకు దారి తీసింది. అయితే అమెరికా ఇలా అక్రమ వలసదారులను వెనక్కి పంపించడం కొత్తేమీ కాదని అప్పట్లోనే కేంద్రం చెప్పింది. చాలా కాలం నుంచి ఈ ప్రక్రియ సాగుతోందని 2009 నుంచి 2024 వరకు దాదాపు 15,500 మంది అక్రమ వలసదారులను అమెరికా వెనక్కి పంపించినట్లు గుర్తు చేసింది.

కర్ణాటక సర్కారు సంచలన నిర్ణయం.. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు 100% పెంపు

న్యూఢిల్లీ-నవభూమి: కర్ణాటక సర్కారు సంచలన నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా అక్కడి శాసన సభ్యుల జీతాల పెంపును ప్రతిపాదిస్తూ.. కర్ణాటక శాసనసభ జీతాలు, పెన్షన్లు మరియు భత్యాలు సవరణ బిల్లును కర్ణాటక శాసన సభ ఆమోదించింది. దీంతో కర్ణాటక ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేల జీతాలు 100 శాతం పెరగబోతున్నాయి. అంటే రెట్టింపు కాబోతున్నాయి. ఈ జీతాల పెంపుతో ప్రభుత్వ వార్షిక వ్యయం రూ.10 కోట్లు పెరుగుతుందని నిపుణులు భావిస్తున్నారు. సమావేశానికి అంతరాయం కల్గించిన హానీట్రాప్ వివాదంపై అసెంబ్లీలో గందరగోళం ఉన్నప్పటికీ ఈ బిల్లును ఆమోదించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. కర్ణాటక శాసన సభ్యుల జీతాలు, భత్యాలు సవరణ బిల్లుతో పాటు కర్ణాటక శాసనసభ జీతాలు, పెన్షన్లు మరియు భత్యాల బిల్లలు ఎలాంటి చర్చ లేకుండానే అసెంబ్లీలో ఆమోదించబడ్డాయి. దీంతో ప్రతిపక్ష బీజేపీ నేతలు సభలోనే నిరసన వ్యక్తం చేశారు. కానీ దీన్ని సమర్థించుకుంటూ.. అధికార కాంగ్రెస్ పార్టీ అనేక విషయాలను వివరించింది. జీవన వ్యయంలో గణనీయమైన పెరుగుదల ఉందని.. ముఖ్యమంత్రి, మంత్రులు, సహాయ మంత్రులు, డిప్యూటీ మంత్రుల జీతాలు, భత్యాలు చాలా కాలంగా సవరించలేమని వెల్లడించారు. ఈ బిల్లు ఆమోదించడంతో.. కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య జీతం నెలకు రూ.75,000 నుంచి రూ.1.5 లక్షలకు చేరుకుంది. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా శాసన సభ్యుల జీతాలు నెలకు రూ.40,000 నుంచి రూ.80,000కి రెట్టింపు అవుతాయి. ఇవి మాత్రమే కాకుండా శాసన సభ్యుల నియోజకవర్గ భత్యం నెలకు రూ.60,000 నుంచి లక్ష రూపాయలకు పెరగబోతుంది. మంత్రుల ఇంటి అద్దె భత్యం నెలకు రూ.1.2 లక్షల నుంచి రూ.2 లక్షలకు పెరుగుతుంది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు చాలా కాలంగా చెల్లించాల్సిన జీతా సవరణ కోసం డిమాండ్ చేయగా.. ఈ బిల్లను రూపొందించినట్లు వర్గాల చెబుతున్నాయి. 2022 సవరణ ప్రకారం ప్రతి 5 సంవత్సరాలకు ఒకసారి జీతాల పెంపుదల తప్పనిసరి. కానీ అది ఎప్పుడూ అమలు కాలేదు. ఇదంతా ఇలా ఉండగా.. ఈ జీతాల పెంపును కర్ణాటక హోంమంత్రి జి. పరమేశ్వర సమర్థించారు. చాలీ చాలని జీతాల వల్ల సామాన్యులు బాధ పడుతున్నారని.. ఎమ్మెల్యేలు కూడా జీతాల కోసం బాధ పడుతున్నారని చెప్పారు. దీని ఆధారంగానే బిల్లు ప్రతిపాదించినట్లు వివరించారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండే వ్యక్తి.. సహజంగానే కాస్త ఎక్కువ డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని.. ఈ జీతం పెంపు వల్ల అది సాధ్యం అవుతుందని చెప్పుకొచ్చారు.

జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల జరిగితే.. దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం : కేటీఆర్

చెన్నై-నవభూమి: డీలిమిటేషన్ వలన దక్షిణాదికి జరగనున్న నష్టాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అద్భుతంగా తెలియచెప్పారు. ఇది కేవలం పార్లమెంటులో ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశం మాత్రమే కాదు. నిధులు కేంద్రీకృతం కావడంతో పాటు.. ఆర్థిక నియంతృత్వానికి దారి తీస్తుందని%% దక్షిణాది భవిష్యత్తును కాలరాస్తుందని కేటీఆర్ వివరించారు. దేశం ప్రజాస్వామిక దేశమైనాభిన్న అస్తిత్వాలు, సంస్కృతులు కలిగిన ఒక సమాఖ్య రాష్ట్ర అన్న విషయాన్ని కేటీఆర్ గుర్తుంచుకోవాలన్నారు. కవలం జనాభా ఆధారంగా సీట్ల పెరుగుదల గనుక జరిగితే దేశ సమాఖ్య స్ఫూర్తికి తీవ్ర విఘాతం కలిగే ప్రమాదం ఉన్నది అని కేటీఆర్ అన్నారు. మనమందరం భారతీయులం.. అయితే మనందరికీ ఆయా ప్రాంతాల అస్తిత్వం ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు. విభిన్న భాషలు సాంస్కృతిక అస్తిత్వాలతో కూడిన ఒక సమైక్య దేశం అన్న విషయాన్ని మర్చిపోకూడదు అని కేటీఆర్ సూచించారు. చెన్నైలో జరుగుతున్న డీలిమిటేషన్ సదస్సులో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు.

హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది..

కేసీఆర్ ఆధ్వర్యంలో 14 సంవత్సరాల పాటు తెలంగాణ ఉద్యమం నడిపించారు. మెజార్టీ నియంతృత్వం మందబలం ఉన్నప్పుడు జరిగే నష్టాలు మా తెలంగాణ ప్రజలకు తెలుసు.. తెలంగాణ ఉద్యమ కాలంలో ఢిల్లీలో ఉన్న మందబలంతో పాటు సమైక్య రాష్ట్రంలోని మెజార్టీ నాయకత్వం పైన పోరాటం చేసి 14 సంవత్సరాల అనంతరం తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చుకున్నాము. దీనివల్లనే 14 సంవత్సరాలు పట్టింది అనేక ఉద్యమాలు చేయాల్సి వచ్చింది. తమిళనాడు ప్రజల నుంచి అనేక అంశాలు స్ఫూర్తి తీసుకుంటాము. అస్తిత్వం కోసం, హక్కుల కోసం కొట్లాడడంలో తమిళనాడు స్ఫూర్తినిచ్చింది.. ద్రవిడ ఉద్యమం సమైక్య దేశంలో తమ హక్కులు సాధించుకోవడానికి రాష్ట్రాలకు ఒక దిక్సూచి లెక్క పనిచేస్తుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

వివక్షపూరిత విధానాల వలన దక్షిణాదికి అనేక నష్టాలు..

కేంద్ర ప్రభుత్వ ప్రస్తుత డిలిమిటేషన్ వల్ల అనేక నష్టాలు జరుగుతున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ వివక్షపూరిత విధానాల వలన దక్షిణాదికి అనేక నష్టాలు జరుగుతున్నాయి. దేశ అభివృద్ధి కోసం పని చేసినందువలన ఈరోజు నష్టం జరుగుతుంది. మనమంతా ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం. ప్రజాస్వామ్యం మందబలం ఆధారంగా నడవరాదు. మందబలం ఉన్నందువలన నియంతృత్వం రావద్దు. దేశ అభివృద్ధిలో ముందు వరుసలో ఉన్న రాష్ట్రాలకు నష్టం కలిగిస్తూ%% దేశాన్ని వెనక్కి నడుస్తున్న రాష్ట్రాలకి ఈ డిలిమిటేషన్ విధానం లాభం చేకూరుస్తుంది. పరిపాలన ఆర్థిక అభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆదర్శంగా ఉన్నాయి కానీ దానివల్లనే తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలు శిక్షింపబడుతున్నాయి..

దేశానికి 36 శాతం జిడిపిలో భాగస్వామ్యం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు శిక్షింపబడుతున్నాయి. డీలిమిటేషన్ అంశం కేవలం పార్లమెంట్ ప్రాతినిధ్యం తగ్గడానికి పరిమితం కాదు. ఆర్థికపరమైన నిధుల కేటాయింపుల్లో కూడా తీవ్రమైన నష్టం జరగబోతుంది. వీటి కేటాయింపుల్లో కూడా అధికారం పూర్తిగా కేంద్రీకృతమై నియంతృత్వం వైపు దారితీసే అవకాశం ఉన్నది. ఆర్థిక వనరుల కేంద్రీకృతం జరగడం వలన భవిష్యత్తులోనూ ప్రస్తుతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న నిధుల కేటాయింపులు అన్యాయం మరింతగా పెరుగుతుంది. దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ వివక్ష కొత్త కాదు. కానీ ఈ మధ్యకాలంలో ఈ వివక్ష అన్యాయం మరింత పెరిగ

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
4 | హైదరాబాద్ ఆదివారం 23 । మార్చి । 2025
ఎడిట్ పేజీ

ఏప్రిల్ 1 నుంచి ఆ నంబర్లకు యూపీఐ సేవలు బంద్

న్యూఢిల్లీ-నవభూమి:: క్రియారహిత మొబైల్ ఫోన్ నంబర్లపై నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) కీలక ఆదేశాలు జారీచేసింది. ఇతరులకు కేటాయించిన, ఇన్‌యాక్టివ్ మొబైల్ నంబర్లకు ఏప్రిల్ 1 నుంచి యూపీఐ సేవలు నిలిపివేయాలని ఆదేశించింది. అనధికార వాడకాన్ని, మోసాలను అరికట్టేందుకు ఈ మేరకు పేమెంట్ సర్వీస్ ప్రొవైడర్లు,

బ్యాంకులకు ఎన్‌పీసీఐ ఈ ఉత్తర్వులిచ్చింది. యూపీఐ వినియోగంలో మొబైల్ నంబర్ కీలకం. దీనికి వచ్చే ఓటీపీ వెరిఫికేషన్ కీలక పాత్ర పోషిస్తుంది. దీర్ఘకాలం పాటు వినియోగంలో లేని మొబైల్ నంబర్లను టెలికం కంపెనీలు వేరే వినియోగదారునికి కేటాయిస్తాయి. దీంతో యూపీఐ ఖాతాలు కూడా వారి చేతుల్లోకి వెళ్లే అవకాశం ఉండటంతో వీటిని నివారించేందుకు ఎన్‌పీసీఐ ఈ చర్యలు చేపడుతున్నది.



నల్లబంగారానికి రాజకీయ రంగు!

తెలంగాణలో కొంగు బంగారం సింగరేణి. కానీ నేడు నల్లబంగారాన్ని ఉత్పత్తి చేసే ఈ సింగరేణి సంస్థ భవిష్యత్తుపై సర్వత్రా చర్చ జరుగుతున్నది. నాడు లక్షా 16 వేల మంది కార్మికులతో కళకళలాడిన ఈ ప్రాంతం నేడు కార్మికుల సంఖ్య తగ్గించడంతో ప్రాభవం కోల్పోయింది. భవిష్యత్తు తరాలకోసం ఆలోచించకుండా నాటి కాంగ్రెస్, బీఆర్ఎస్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో ఈ పరిస్థితి వచ్చింది. 90వ దశకంలో నూతన పారిశ్రామిక ఆర్థిక విధానాలు అమలు చేయడం వలన సింగరేణి కంపెనీ సిక్ ఇండస్ట్రీ జాబితాలోకి వెళ్లింది. సింగరేణిని ఆదుకోవాలని నాటి బీజేపీ ప్రధాని అటల్ బిహార్ వాజపేయి రూ.650కోట్ల మారటోరియం ప్రకటించారు. దీనికి తోడు కార్మికులు ఉద్యోగులు, అధికారులు, యూనియన్ నాయకులు సింగరేణికి జవసత్వాలు అందించి నష్టాల్లో ఉన్న సంస్థను లాభాల్లోకి తీసుకురావడమే కాకుండా రెండు దశాబ్దాలుగా బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తున్నారు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వచ్చిన తరువాత కోల్‌బెల్ట్ ప్రాంతం ఒక రాజకీయ అవకాశంగా మారింది. ఓపెన్ కాస్ట్ మైనింగ్‌లను వ్యతిరేకించి, అవసరమయితే కుర్చీ వేసుకుని ఓపెన్ కాస్ట్‌లను తగ్గిస్తానని చెప్పిన బీఆర్ఎస్ పార్టీ ఏకంగా 17 ఓపెన్ కాస్ట్ గనులను తీసుకు వచ్చింది.

ప్రైవేటీకరణను అడ్డుకుంటామని చెప్పిన రాజకీయ పార్టీల హామీలన్నీ పక్కనే ఉన్న గోదారి పాలయ్యాయి. ఇప్పుడు సంస్థలో 30 వేల మందికి పైగా కాంట్రాక్టు కార్మికులున్నారు. ఆనాడు ఒక లక్షా 16వేల మంది ఉన్న పర్మినెంట్ కార్మికుల సంఖ్య నేడు 39వేలకు పడిపోయింది. ఈ మార్చి 31 నాటికి మరో రెండు వేల మంది పదవీ విరమణ కానున్నారు. ఈ పరిస్థితికి కారణం నువ్వంటే నువ్వంటూ బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నాయి. కానీ తమ వల్ల సింగరేణికి జరిగిన నష్టంపై నోరెత్తడం లేదు. ఒకవైపు దేశవ్యాప్తంగా బొగ్గుకు డిమాండ్ పెరిగిపోతున్న దశలో ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉంది. ఉత్పత్తి పెరగాలంటే కొత్త బొగ్గు గనులను దక్కించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది. సింగరేణి కార్మిక సంఘం ఎన్నికల సమయంలో 10 అండర్‌గ్రౌండ్ బొగ్గు గనులకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ శ్రీరాంపూర్‌లో జరిగిన సభలో వేదిక పక్కనే శంకుస్థాపన చేశారు. ఇప్పటికీ ఆ శిలాఫలకాలు భద్రంగా ఉన్నాయి. కానీ ఒక్క అండర్‌గ్రౌండ్ బొగ్గు గని కూడా ప్రారంభం కాలేదు. అవి గనక ప్రారంభమై ఉంటే సుమారు 30వేల మందికి ఉద్యోగాలు వచ్చేవి. ఇలా ఉండగా అప్పటి యూపీఏ-1, యూపీఏ-2 హయాంలో జరిగిన బొగ్గు కుంభకోణం వల్ల ప్రత్యక్షంగా లక్షా రూ.80వేల కోట్లు, పరోక్షంగా రూ.10లక్షల కోట్ల మేర నష్టం జరిగనట్లు కాగ్ రిపోర్ట్ తెలిపింది. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని అవకతవకలు జరిగిన బొగ్గు బ్లాకులను రద్దుచేసి పారదర్శక వేలానికి ఆదేశించింది.

ఈ మేరకు అన్ని పక్షాలను సంప్రదించి ప్రధాని నరేంద్ర మోదీ కొత్త చట్టాన్ని తీసుకువచ్చారు. 2020జూన్‌లో మోదీ తొలిసారి పారదర్శక బొగ్గుగనుల కమర్షియల్ వేలాన్ని ప్రారంభించారు. నాటి నుండి 11 విడతలుగా బొగ్గు మంత్రిత్వ శాఖ ఈ వేలాన్ని నిర్వహిస్తున్నది. కానీ సింగరేణి కంపెనీ ఆ బొగ్గు బ్లాకుల వేలంలో రాజకీయ ఒత్తిడుల వల్ల పాల్గొనడం లేదు. బీఆర్ఎస్ హయాంలో నూతన చట్టానికి అనుగుణంగా ఒరిస్సా రాష్ట్రంలోని నైనీ బ్లాక్‌ను తీసుకున్నారు. అదేవిధంగా తాడిచర్ల ఓపెన్ కాస్ట్ మైన్‌ను సింగరేణి, జెన్ కో నుండి తప్పించి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పగించి తెలంగాణలోని బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకుండా మా బ్లాకులు మా రాష్ట్రానికే ఇవ్వాలని వితండ రాజకీయాలు చేసింది. కొత్త చట్టానికి పార్లమెంట్‌లో అప్పటి బీఆర్ఎస్ ఎంపీలు మద్దతు పలికి చట్టానికి అనుకూలంగా ఓటువేసి అదే చట్ట ప్రకారం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనలేదు. ఫలితంగా ఐదేళ్ల కాలం గడిచిపోయింది. ప్రస్తుతం సింగరేణి చేతిలో బొగ్గు గనులు తగ్గడంతో కార్మికులు కూడా తగ్గుతున్నారు. ఈ దశలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలి. తెలంగాణలో బొగ్గు గనుల వేలానికి నిబంధన ప్రకారం దరఖాస్తు చేసుకోమని పలుమార్లు కేంద్ర బొగ్గుగనుల శాఖా మంత్రి కిషన్‌రెడ్డి కోరినా ప్రభుత్వం పట్టించుకోలేదు. మరోవైపు కోల్‌బెల్ట్ ప్రాంత బీజేపీ నేతలతో కలిసి హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా బొగ్గు గనుల శాఖా మంత్రిని కలిసిన సందర్భంలో వేలంలో పాల్గొంటే సింగిల్ టెండర్‌గా తెలంగాణకే కేటాయిస్తామని చెప్పినా కూడా టెండర్ ఫారాన్ని తీసుకున్న నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతి, ఓటుబ్యాంకు రాజకీయాల కోసం బిడ్డింగ్‌లో పాల్గొనలేదు. దీంతో కోల్‌బెల్ట్ ప్రాంత కార్మికులకు, సింగరేణి సంస్థకు అన్యాయం జరిగింది. కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాజకీయాలకు అతీతంగా ముందుకు సాగుతున్నామని, భవిష్యత్తులో తెలంగాణ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక సంపదతో దేశంలో ముందుంటామని చెబుతూనే, ఢిల్లీలో ఇటీవల పత్రికా కాంక్లేవ్‌లో విలేకరులు అడిగిన ప్రశ్నకు ఉచితాల వలన రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాలేదనీ, కనీస మౌలిక వసతులు కూడా కల్పించలేకపోతున్నామనీ, ఆరు గ్యారంటీల అమలు చేయలేమనీ చెప్పకనే చెప్పారు. ఈ స్థితిలో ఆర్థిక వనరులు పెంచుకోవాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి గుర్తించాలి. తెలంగాణకు ప్రధాన ఆదాయవనరు అయిన సింగరేణి ప్రభుత్వానికి ఆర్థిక పరిపుష్టిని అందించడంలో అగ్రభాగాన ఉంటుంది. అలాంటి సింగరేణిని కాపాడుతూ కార్మికుల సంఖ్యను పెంచడం ద్వారా కోల్‌బెల్ట్ ప్రాంతాన్ని కాపాడవచ్చు. సింగరేణి సంస్థ ద్వారా ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొని బ్లాకులను దక్కించుకోవాలి. భవిష్యత్తులో కొత్త బ్లాక్‌లలో ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం ద్వారా ఆయా బొగ్గుగనులలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించడంతోపాటు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించి కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి.

ఇంధన రంగంలో 2047కల్లా స్వతంత్రంగా అభివృద్ధి సాధించాలన్న ప్రధానమంత్రి మోదీ ఆకాంక్షల మేరకు 'బొగ్గు రంగంలో ఆత్మనిర్భర్'లో బాగంగానే బొగ్గు బ్లాకులు వేలం జరుగుతున్నది.

ఇజ్రాయిల్ నరమేధాన్ని నిలువరించాలి

రక్తపు రుచి మరిగిన 'ఫాసిస్ట్ ఇజ్రాయిల్ దేశం' అమెరికా అండతో పాలస్తీనా ప్రజానీ కంపై నరమేధాన్ని నిరాట కంగా కొనసాగిస్తూ యుద్ధ నేరాలకు పాల్పడు తోంది. భారీగా పౌర మరణాలకు మరియు మరచిపోలేని నెత్తుటి గాయాలకు ఇజ్రాయిల్‌కారణమ వుతూనే ఉంది. యావత్ ప్రపంచం ఆక్షేపిస్తున్నా కూడా ఇజ్రాయిల్ ఏకపక్షంగాయుద్ధన్మాదంతో ముందుకెళు తోంది. హమాస్ అంతమే లక్ష్యంఅని పేర్కొంటూఇజ్రాయిల్ మారణహోమాన్ని సమర్థించుకుంటోంది. ఈ రకంగా ఇజ్రాయిల్ యుద్ధోన్మాదదాడులతో నేడు గాజా ఒక మృత్యుకూపంగా మారిపోయింది. లక్షలాది మంది ప్రజానీకంఅనేక సమస్యలతో విలవిలలాడుతుండడం హృదయవిదారకరం. శాంతిభద్రతా పరిస్థితులు రోజురోజుకు మరింతగా క్షీణిస్తుండడంతో నేడు గాజా అంతటా అమానవీయవీయ విషమపరిస్థితులు నెలకొని ఉండడం కడు విషాదకరం. 2025 జనవరి 19 నాడు హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినతర్వాత ఆ ఒప్పందానికి తూట్లు పొడుస్తూ ఇజ్రాయిల్ సైనిక దళాలు మళ్ళీ గాజాపై భీకరదాడులకి పాల్పడుతూ మృత్యుకూపంగా మార్చడం ఏమాత్రం సహేతుకం కాదు. పవిత్రరంజాన్ మాసంలోనే ఇజ్రాయిల్ సైనిక దళాలు ఈ దాడులకి

పాల్పడడాన్ని చాలాసునిశితంగా గమనించవచ్చు. కాల్పుల విరమణకి సజావుగా కట్టుబడి ఉండాలి 'అనిఅంతర్జాతీయం గాను ఒత్తిడి వస్తున్ననూ కూడా వాటన్నింటిని తోసిపుచ్చుతూఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు యుద్ధోన్మాదంతో దుందుకు డుగావ్యవహరిస్తుండడం ఏమాత్రం సహేతుకం కాదు. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉండగానే కాల్పుల విరమణ ఒప్పందానికిమధ్యలోనే తూట్లు పొడిచి ఈ నెల 18 నాడు గాజాపై ఇజ్రాయిల్ దాడులకు పాల్పడడంఅత్యంత హేయమైన చర్యకు నిదర్శనం కాగలదు. అలా విచక్షణారహితంగా రెండు రోజులపాటు వైమానిక దాడులు చేసిన ఇజ్రాయిల్ సైనిక దళాలు తాజాగా గాజాపై భూతలదాడులను తిరిగి కొనసాగిస్తూ అత్యంత పాశవికంగా వ్యవ హరిస్తున్న తీరు కడుఆక్షేపనీయం. గత మూడు రోజులుగా ఇజ్రాయిల్ సైనిక దళాలు కొనసాగిస్తున్న వైమానికమరియు భూతల దాడులతో 200 మందికి పైగా చిన్నారులతో పాటు మొత్తం 506మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం విచారకరం. గాజాలో 2023, అక్టోబరు 7 నుండి నేటి వరకు ఇజ్రాయిల్ జరిపిన దాడుల్లో61,700 మందికి పైగా పాలస్తీనా ప్రజలు చనిపోగా 1,12,000 మందికి పైగా ప్రజలుగాయపడడం ఇజ్రాయిల్ నరహంతక యుద్ధోన్మాదానికి పరాకాష్టగా నిలుస్తుంది. వీరిలోమూడింట రెండొంతుల మంది మహిళలు మరియు బాలలు ఉండడం గమనార్హం. ఇజ్రాయిల్ యుద్ధోన్మాద క్రూరత్వాలకు గాజా ప్రజలు బలి కావడం కడు విషాదకరం. నేడు గాజా ప్రజానీకం కడు దయనీయ పరిస్థితులతో కొట్టుమిట్టాడుతూనే బిక్కుబిక్కుమంటూ యుద్ధం నడుమ దుర్భర జీవితాలను గడుపుతున్నారు. ప్రజలుతీవ్రమైన ఆహార కొరతతో ఇబ్బంది పడుతున్నారు. గాజాలో మానవతా సాయం సరిగాఅందకపోవడంతో చాలా మంది ఆకలితో అలమటిస్తూ మృత్యువు లోగిళ్లకు బలైపోవడం కడువిచారకరం. గాజా ప్రజలకు మానవతాసాయాన్ని అందించేందుకు ఇజ్రాయిల్ ఆంక్షలుసైతం అడ్డుగా ఉండడాన్ని అంతర్జాతీయ సమాజం చాలా తీవ్రంగా వ్యతిరేకిస్తూనే ఉంది. ఏది ఏమైననూ నేడు ఇజ్రాయిల్ క్రమంగా ప్రపంచ దేశాల మద్దతును కోల్పోతూనే ఉందిఅని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఒంటెద్దు పోకడలతో దుందుకుడుగా వ్యవహరిస్తున్న ఇజ్రాయిల్ భవిష్యత్తులోనూ ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం లేకపోలేదు. ఫాసిస్ట్ ఇజ్రాయిల్ కాల్పుల విరమణకి మధ్యలోనే తూట్లు పొడిచి ఈ రకంగా మరోసారి అమానుష మారణకాండకు పాల్పడు తుండం ఏమాత్రం మానవీయం కాదు. గాజాలో మానవ హననానికి స్వస్తి పలకాలి అని గతంలో అంతర్జాతీయ న్యాయస్థానంఇజ్రాయిల్‌ను ఆదేశించి ననూ ఆ ఆదేశాన్ని ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టడం ఏమాత్రంసహేతుకం కాదు. అందువలన ఇకనైననూ ఇజ్రాయిల్ తన ఫాసిస్ట్ యుద్ధోన్మాదవిధానాలను విడనాడాల్సిన అవసరం ఉంది. ఐక్యరాజ్య సమితి (ఐరాస) భద్రతా మండలిఆమోదించిన తీర్మానానికి ఇజ్రాయిల్ కట్టుబడి ఉండాల్సిన అవసరం నేడు తప్పకుండాఉంది. తద్వారా గాజాలో కాల్పుల విరమణ సజావుగా జరిగి అంతిమంగా నరమేధాన్నినిలువరించి శాంతిని నెలకొల్పవచ్చు. ఏది ఏమైననూ గాజాలో ఇజ్రాయిల్ నరమేధాన్నినిలువరించేంత వరకు అంతర్జాతీయంగా ప్రగతిశీల ప్రజాస్వామ్య శక్తులు నిరవధికంగాఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

- జె.జె.సి.పి. బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

మనీమాయలో మసకబారుతున్న మానవ సంబంధాలు'

మనుషుల మధ్య నమ్మకం, ప్రేమ, గౌరవం వంటి విలువలు ఎప్పటినుంచో బలమైన సంబంధాలను నిర్మించాయి. కానీ, కాలానుగుణంగా డబ్బు ఈ సంబంధాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతోంది. ఒకప్పుడు మనుషుల మధ్య అనుబంధాలు మానవీయతపై ఆధారపడితే, ఇప్పుడు వాటిని డబ్బు, హోదా, లాభనష్టం నిర్ణయిస్తున్నాయి. డబ్బు కారణంగా సంబంధాలు బలహీనపడటమే కాకుండా, కొన్ని విరిగిపోతున్నాయి.?ఆస్తి కోసం కన్నవారిని కడతేర్చిన కొడుకులు

-మనీ కోసం మట్టుపెట్టుకున్న అన్నదమ్ముళ్ళు

- డబ్బు కోసం స్నేహితుని మోసం చేసిన మరో స్నేహితుడు

- డబ్బు కోసం భర్తను చంపిన భార్య

-ఆస్తి కోసం తాతను చంపిన మనువడు

అని ఈ రోజుల్లో ఎక్కడో ఒక చోట ఇలాంటివి చాలా చూస్తున్నాం, వింటున్నాం.

మనిషి మనిషిగా జీవించడం మాని మనీ ఊబిలో విచక్షణ మరిచి ప్రవర్తిస్తున్నాడు.

డబ్బు వల్ల కుటుంబ సంబంధాల్లో మార్పులు

తల్లిదండ్రులు - పిల్లల అనుబంధం

పూర్వం పిల్లలు తల్లిదండ్రుల సంరక్షణలో పెరిగేవారు, వారి గౌరవాన్ని, ప్రేమను అర్థం చేసుకునేవారు.

అయితే, ఆధునిక జీవనశైలి, ఉద్యోగాల ఒత్తిడి వల్ల పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేస్తున్నారు.

వారసత్వ ఆస్తుల విషయంలో తల్లిదండ్రుల్ని మాత్రమే కాకుండా, అన్నదమ్ముల మధ్య కూడా విభేదాలు ఎక్కువైపోతున్నాయి.

రక్త సంబంధీకులు కూడా ఆస్తులు కోసం, డబ్బు కోసం ఎంతకు అయినా తెగించే పరిస్థితి నేటి సమాజంలో పరిపాటిగా మారింది

లి)అన్నదమ్ముల మధ్య బంధం

డబ్బు వచ్చిన తర్వాత కొన్ని కుటుంబాల్లో అన్నదమ్ముల మధ్య అసూయ, ఆదిపత్యం, పెరిగి, ఆస్తి కోసం గొడవలు ఎక్కువవుతున్నాయి. ఆస్తి వివాదాల కారణంగా కోర్టు కేసులు, విబేధాలు, కలహాలు పెరిగిపోతున్నాయి.

- భార్యాభర్తల సంబంధం

ప్రేమ కంటే డబ్బు, హోదా , సంపదకు ప్రాముఖ్యం పెరిగిపోతోంది.

డబ్బు లేకుంటే భార్యాభర్తల మధ్య విబేధాలు

తలెత్తుతాయి.

కేవలం డబ్బు కోసం పెళ్లిళ్లు జరుగుతున్న సందర్భాలు చాలా పెరిగిపోతున్నాయి. డబ్బుతోనే గౌరవం, మర్యాద అనే స్థితికి బంధాలు చేరాయి..

స్నేహ బంధాలపై డబ్బు ప్రభావం

స్వార్థపూరిత స్నేహం

ఇప్పుడు చాలా మంది స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే స్నేహం కొనసాగిస్తున్నారు.

లాభం ఉండే వరకు మాత్రమే స్నేహం కొనసాగించడం ఓ ట్రెండ్‌గా మారింది.

అవసరాల కోసం మాత్రమే స్నేహాన్ని నటించడం నేడు సమాజంలో అలవాటుగా మారింది

-నమ్మకాన్ని కోల్పోతున్న స్నేహం

డబ్బు తీసుకుని తిరిగి ఇవ్వకపోవడం, వ్యాపార సంబంధాల్లో నమ్మకద్రోహం చేయడం వల్ల స్నేహబంధాకు తీరని గాయాలను చేస్తున్నాయి ఒకరు అధిక సంపాదన చేసే స్థాయికి ఎదిగితే, మిగిలినవారు అసూయతో అప్రయత్నంగా దూరమవుతుండటం కనిపిస్తోంది.

-సమాజంలో డబ్బు ప్రభావం

-ధనిక - పేద మధ్య భేదాలు

ధనికులు మరింత ధనికులుగా మారుతుండగా, సామాన్యులు ఆర్థిక సమస్యలతో బాధపడుతున్నారు. ధనవంతుల మాటకు ఎక్కువ విలువ, సామాన్యులకు తక్కువ గౌరవం కలుగుతోంది.

-అసమానతలు పెరుగుతున్నాయి

సంపన్నులు డబ్బుతో అధికారాన్ని, సమాజంలో ఆధిపత్యాన్ని చూపుతున్నారు, పేదవారు ఎన్ని కష్టాలు పడ్డా, సమాజంలో వారి స్థాయి మారడం కష్టంగా మారింది.

లి)డబ్బు ప్రభావం వల్ల నష్టాలు

-ప్రేమ - గౌరవం తగ్గిపోతాయి - డబ్బు ఉన్నంతవరకు మాత్రమే గౌరవం, ప్రేమ,ఆదరాభిమానాలు లభిస్తున్నాయి.

-బంధాలను దూరం చేసుకోవడం డబ్బు కోసం తల్లిదండ్రులను, కుటుంబాన్ని, స్నేహితులను మరచిపోతున్నారు. కుటుంబాలు విచ్ఛిన్నం అవుతున్నాయి.

-నిజాయితీ తగ్గిపోవడం - మనుషుల మధ్య నమ్మక ద్రోహం, స్వార్థం పెరుగుతోంది.

-అవినీతి పెరుగుతోంది - డబ్బు కోసం అడ్డ దారులు, చెడు మార్గాలు మార్గాలు ఎక్కువవుతున్నాయి.

-డబ్బు కన్నా సంబంధాలకు విలువ ఇవ్వాలి

మనీ మనిషి జీవితంలో అవసరమే కానీ అది మనుషుల విద్వేషాన్ని పెంచే విధంగా వుండకూడదు

- డబ్బు ,మానవ సంబంధాల కన్నా గొప్పది కాదని గుర్తించాలి.

-కుటుంబ వ్యవస్థను బలపరచాలి, సంస్కారం తో కూడిన విద్యను, విలువలతో కూడిన విద్యను అందించాలి,బాధ్యతాతో కూడిన బంధాలను ఏర్పరచాలి..ప్రపంచంలో అన్నిటికన్నా గొప్పవి నమ్మకం, ప్రేమను వాటిని డబ్బుతో కొనే ప్రయత్నం చేయకూడదు. కుటుంబాన్ని, స్నేహితులను కేవలం లాభనష్టాల కోణంలో కాకుండా మానవీయతతో చూడాలి. ధనం ఎంత సంపాదించినా, చివరికి మానవ సంబంధాలే మన జీవితాన్ని అర్థవంతంగా మారుస్తాయని అర్థం చేసుకోవాలి. "డబ్బు మనిషిని కొనుగోలు చేయగలదేమో, కానీ ప్రేమను, నమ్మకాన్ని కొనలేదు అనే నిజాన్ని నమ్మాలి డబ్బు కోసం బంధాలను వదులుకుంటే, చివరికి మనం ఒంటరిగా మిగిలిపోతాం. కాబట్టి, డబ్బును మన జీవితాన్ని మెరుగుపరిచే సాధనంగా మాత్రమే చూడాలి, కానీ మనుషులను , బంధాలను కోల్పోయే ఆయుధంగా వాడకూడదు .మనిషిని మనిషిగా గౌరవించిన రోజే సమాజాభివృద్ధి సాధ్యపడుతుంది. మనీని గౌరవించాలి కానీ ప్రేమించకూడదు మనీ ఉన్నది అవసరాలు తీర్చడానికే కానీ మనుషుల మధ్య అసమానతలు పెంచడానికి కాదు. మనిషి సృష్టించిన మనీ మనిషిని మనిషికి దూరం చేసే స్థితికి చేరడం మనిషి మనుగడకే ప్రమాదం జీవం లేని మనీ మనిషి జీవితాలను నిర్ణయించలేదనే వాస్తవాన్ని విస్మరించకు.

-జి . అజయ్ కుమార్
కాలమిస్ట్

వరాల వసంతం... రంజాన్

భక్తి

రంజాన్ నెల ప్రధానంగా ఆత్మప్రక్షాళన మాసం. విశ్వాసులు తమ జీవితాలను ఆధ్యాత్మికతకు పునరంకితం చేసే మాసం. వ్యక్తి జీవన విధానంలో చైతన్యాన్ని ప్రేరేపించే మాసం. క్రమశిక్షణను నేర్పి, దైవ సేవలో నిమగ్నమయ్యేలా చేసే మాసం. దైవం కరుణా కటాక్షాలను, ప్రసన్నతను పొందే మాసం. సౌభ్రాతృత్వానికి అద్దం పట్టే మాసం. పరస్పర ఆత్మీయతా భావాన్ని అనుసంధానించే ఈ మాసం ఒక సత్కార్యానికి పదిరెట్లు పుణ్య ఫలాలను అందిస్తుంది. ఈ నెలలో స్వర్గద్వారాలు పూర్తిగా తెరిచి ఉంటాయి, నరక ద్వారాలు మూతపడతాయి. వయసుతో నిమిత్తం లేకుండా విశ్వాసులు ఇంటిల్లిపాదీ రాత్రింబవళ్ళు ఆధ్యాత్మికతలో మునిగి తేలుతారు. దైవం పట్ల విశ్వాసాన్ని పటిష్టపరచుకుంటారు. పుణ్యకార్యాలపట్ల ఆకాంక్షను, పాపకార్యాల పట్ల విముఖతను పెంచుకుంటారు. అల్లాహ్ తన బోధనామృతాన్ని ప్రజలకు అందజేసిన మాసం ఇది. ఆయన తన అపార అనుగ్రహాన్ని వర్షిస్తాడు. ధనవంతులకు పేదల హక్కును గుర్తు చేసి, జకాత్ ఫిత్రా లాంటి ధర్మాలను నిర్వర్తించడాన్ని విధిగా నిర్దేశించిన రంజాన్ నెల... ఉపవాసాల ద్వారా... ఆర్తుల ఆకలిదప్పులను సంపన్నులకు అనుభవపూర్వకంగా తెలియజేస్తుంది.

ఖుర్ఆన్ అవతరించిన మాసం

ఈ మాసం పేరిట ఉన్న పర్వదినాన్ని 'ఈద్-ఉల్-ఫితర్' అని కూడా వ్యవహరిస్తారు. రంజాన్ మాసం... ఖుర్ఆన్ అవతరించిన నెల. "ఈ దివ్య గ్రంథం మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు సత్యాసత్యాలను వేరుపరిచే స్పష్టమైన నిదర్శనాలు ఇందులో ఉన్నాయి. ఈ నెలను ఎవరు చూస్తారో వారు ఉపవాసాలు ఉండాలి" అని దివ్య ఖుర్ఆన్ చెబుతోంది. "వెయ్యి నెలలకన్నా శ్రేష్టమైన రాత్రి ఒకటి ఈ మాసంలోనే ఉంది. దాని శుభాలను కోల్పోయినవారు దౌర్భాగ్యులు. స్వర్గానికి ఎనిమిది ద్వారాలు ఉన్నాయి. వాటిలో ఒక ద్వారాన్ని కేవలం ఉపవాసులకే ప్రత్యేకంగా కేటాయించడం జరిగింది" అని పేర్కొంది.

రంజాన్ మాసంలోనే ఇబ్రహీమ్ ప్రవక్త 'సహీఫాల'ను, మూసా ప్రవక్త 'తౌరాత్' గ్రంథాన్ని, దావూద్ ప్రవక్త 'జబూర్' గ్రంథాన్ని, ఈసా ప్రవక్త 'ఇంజీల్' గ్రంథాన్ని దైవ కృపతో అందుకున్నారు. ఈ నెలలో ప్రపంచవ్యాప్తంగా మసీదులు కళకళలాడతాయి. దానధర్మాలకు సంబంధించిన కార్యాలు ముమ్మరం అవుతాయి. సోదరభావం పరస్పరం బలపడుతుంది. శాంతియుత వాతావరణంలో... విశ్వాసులు భక్తి ప్రపత్తులతో ప్రార్థనలు చేస్తారు. యంత్రాలు ఎడతెరిపి లేకుండా కొంతకాలం పని చేసిన తరువాత... వాటికి విశ్రాంతి కావాలి. వాటి భాగాలను ఊడదీసి శుభ్రం చేయాలి. అప్పుడే మలినాలన్నీ పోతాయి. మళ్ళీ సమర్థమైన విధి నిర్వహణకు సిద్ధమవుతుంది. అలాగే మన జీర్ణ వ్యవస్థకు విశ్రాంతిని ఇచ్చి, దానికి క్రమబద్ధతను చేకూర్చే ఆరాధనే... రోజా (ఉపవాసం).

రాత్రి వేడుకల్లో వెలిగిపోయేలా...

లిప్‌స్టిక్: పగటి వేళ న్యూడ్, బీజ్ లాంటి రంగులతో వీలైనంత తేలికపాటి మేకప్‌తో సరిపెట్టుకోవచ్చు. కానీ రాత్రి వేళ లేత రంగులు లైట్ల వెలుగుకు వెలాతెలా పోతాయి. కాబట్టి ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్స్ మాత్రమే ఎంచుకోవాలి. ఎరుపు, ముదురు గోధమ రంగు లిప్‌స్టిక్స్ బాగుంటాయి.ఐ షాడో: లైట్ల వెలుగుకు ఐషాడో ప్రతిఫలించేలా చూసుకోవాలి. అందుకోసం గ్లిట్టర్ వాడుకోవాలి. నీలం, పర్పుల్ గ్లిట్టర్స్ రాత్రి వేళ వేడుకలకు ఎంతో బాగా నప్పుతాయి. ఇవి ధరించే డ్రస్సుతో సరిపోయేలా చూసుకోవాలి.

చెక్కుచెదరకుండా: మేకప్ చెక్కుచెదరకుండా ఉండడం కోసం మేకప్ సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. లేదంటే, ఫౌండేషన్ మీద కాంపాక్ట్ పౌడర్ అద్దుకోవాలి. అలాగే బేస్ చెదిరిపోకుండా ఉండడం కోసం కొంత ఫౌండేషన్, బ్యూటీ బ్లెండర్ కలిపి వాడుకోవాలి.

ఐలైనర్: మేకప్ (లుక్ అదిరిపోవాలంటే కనురెప్పలకు నియాన్ ఐలైనర్ వేయాలి.

చెక్కినట్టు: ముక్కు, చుబుకం, కనుబొమలు స్పష్టంగా చెక్కినట్టు కనిపించడం కోసం బ్రాంజర్‌తో కాంటూర్ చేసుకోవాలి.

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
9 హైదరాబాద్
ఆదివారం
23 । మార్చి । 2025

బౌన్సింగ్ మహారాణి!

గుండె బలమే కాదు కండబలమూ మహిళల సొంతమని నిరూపిస్తున్నదామె.సినిమా తారలు, రాజకీయ ప్రముఖులు,సెలెబ్రిటీల చుట్టూ ఎప్పుడూ మగ బౌన్సర్లే ఉండటాన్ని ప్రశ్నించి, గెలిచిందామె! దేశంలోనే తొట్టతొలి మహిళా బౌన్సర్‌గా రికార్డు సాధించడమే కాదు, తానే బౌన్సర్లను తీర్చిదిద్దే సంస్థనూ స్థాపించింది. బాలీవుడ్ స్టార్లు సహా గాయకులు, రాజకీయ ప్రముఖులకు సేవలందిస్తున్నది. నల్లని చొక్కా, కండలు తిరిగిన దేహంతో ఢిల్లీలోని నైట్ క్లబ్‌కి కాపలాగా నిలబడే మెహరున్నీసా షౌకత్ అలీని చూస్తే ధైర్యానికి ప్రతిబింబంలా కనిపిస్తుంది. ఆడపిల్లలు చదువుకోవడమే తప్పు అనే కుటుంబం నుంచి వచ్చిన ఆమె%ొ% ఎదగాలన్న తపన ఉంటే ఎవరూ అడ్డుకోలేరంటూ తన సాహసగాథను ఇలా చెబుతున్నది.

ముప్పై ఏడేండ్ల మెహరున్నీసాది ఉత్తర్‌ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్. నలుగురు ఆడపిల్లలు ఉన్న దిగువ మధ్య తరగతి కుటుంబంలో రెండో కూతురు తను. ఆడపిల్లలు చదవడమంటే పాపమే అని భావించే తండ్రి రాత్రిపూట కరెంటు తీసేసేవాడు. అయినా చదువుకుంటే పుస్తకాలు తగలబెట్టే ప్రయత్నాలూ చేసేవాడు. అతణ్ని ఎదిరించే ధైర్యం ఆ తల్లికి లేదు. కానీ బిడ్డలు చదువుకుంటే బాగుంటుందన్న ఆశ మాత్రం ఉండేది. ఆ కొద్ది ప్రోత్సాహమే మెహరున్నీసాకి దన్ను అయింది. చదువుకునేందుకు తీవ్ర ప్రయత్నం చేసింది. టీనేజీలోనే పెళ్లి చేసుకున్న అక్క కష్టాలు చూసి ఆమె వణికిపోయేది. తన జీవితం అలా కాకూడదనీ అనుకునేది. కానీ పన్నెండో ఏటనే ఆమెకూ పెండ్లి సంబంధం చూశారు. తీరా పెండ్లికి ముందు ఆమెకు టైఫాయిడ్ జ్వరం వచ్చింది. కొన్నాళ్లపాటు మంచానికే పరిమితమైంది. కోలుకున్నాక తాను ఎలాగైనా జీవితంలో మంచి స్థానంలో ఉండాలని గట్టిగా సంకల్పించుకుంది చిన్నారి మెహరున్నీసా. ఎవరేమన్నా, ఎలాంటి కష్టం ఎదురైనా తన బతుకు తాను బాగా బతకాలని దృఢంగా నిశ్చయించుకుంది. ఆ సంకల్పమే నేటికీ ఆమెలో కనిపిస్తుంది. ఆ బలం తనలాంటి ఎందరిలోనో ధైర్యం నింపుతున్నది కూడా.

ఆర్మీలో చేరాలని

చిన్ననాటి నుంచి కాస్త దృఢంగా ఉండే మెహరున్నీసాకు సైనికుల్ని చూస్తే ఆరాధనా భావం. రక్షణ విధుల్లో కనిపించే పోలీసులన్నా ఆమెకు ఇష్టం. దాంతో తానూ ఆ రంగాల్లో పనిచేయాలని అనుకునేది. అందుకే స్కూల్లో ఎన్‌సీసీ క్యాడెట్‌గా చేరింది. కరాటే నేర్చుకుంది. శారీరక దృఢత్వం మీద దృష్టి పెట్టింది. తనను తాను ఎప్పుడూ ఫిట్‌గా ఉంచుకునేది. అయితే తన కోరికను దగ్గరి వారికి చెప్పినప్పుడు ఆడపిల్లలను ఆ ఉద్యోగాల్లో తీసుకోరు అని చెప్పారట. దీంతో ఆర్మీలో చేరేందుకు నోటిఫికేషన్ తేదీలు వచ్చినప్పుడు ఆమె దరఖాస్తు చేయలేకపోయింది. ఆ విషయానికి తాను ఎంతో దిగులుపడింది. కానీ ఏం చేయాలన్నదీ పాలుపోలేదు.

ఓసారి ఏదో పనిమీద కుటుంబంతో కలిసి ఢిల్లీ వెళ్లినప్పుడు కొంతమంది కండల వీరులు ఓ ఈవెంట్‌కి కాపలా కాస్తుండటం చూసింది. ఎవరా అని ఆరా తీస్తే వాళ్లను బౌన్సర్లు అంటారని తెలిసింది. తాను కూడా అలా నిలబడి జనాన్ని అదుపు చేస్తూ, అవసరమైన వారికి రక్షణగా ఉండాలని కోరుకుంది. అందుకే ఈసారి తెలిసిన వాళ్లూ దగ్గరి వాళ్లను కాకుండా నేరుగా దానికి సంబంధించిన సంస్థనే అడిగింది. తాను వాళ్లతో కలిసి పనిచేయాలని అనుకుంటున్నట్టు చెప్పింది. దీంతో ఆమెను సెక్యూరిటీ గార్డ్‌గా తీసుకున్నారు.

అక్కడా వివక్షే

కుటుంబంలో, సమాజంలో వివక్షను ఎదుర్కొన్న ఆమెకు ఈ ఉద్యోగంలోనూ అదే కనిపించింది. అసలు అక్కడ ఆడవాళ్లను బౌన్సర్‌లుగానే పిలవరు. మగవాళ్లకు మాంసాహారం పెట్టేవారు. ఆడవాళ్లకి శాకాహారమే. రక్షణ పరంగా ప్రధానమైన ప్రాంతాల్లోనూ స్త్రీలను ఉంచేవారు కాదు. వీటన్నిటి విషయంలోనూ ఆమె పోరాడింది. ఉద్యోగ పరంగానూ కొన్ని నిబంధనలను కాలదన్ని మరీ తనను తాను నిరూపించుకుంది. సెలెబ్రిటీల దగ్గరి వలయంలో ఉండి, జనాన్ని నిలువరించడంలో తానూ ఏమాత్రం తీసిపోనని రుజువు చేసుకుంది. యాజమాన్యంతో, తోటి వారితో పోరాడి మరీ తన హోదాను బౌన్సర్‌గా మార్చుకుంది మెహరున్నీసా. అలా ఆమె దేశంలోనే తొట్టతొలి మహిళా బౌన్సర్‌గా ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించుకుంది. పకడ్బందీ రక్షణ కల్పించడంలోనూ, బార్‌లు, పబ్‌లలాంటి చోట్ల జరిగే గొడవల్ని సద్దుమణిగేలా చేయడంలోనూ, డ్రగ్స్‌లాంటి నిషేధిత పదార్థాలను గుర్తించి ఆడపిల్లలకు రక్షణ కల్పిస్తూనే యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లడంలోనూ ఆమె బాగా పేరుపొందింది. ఈ రంగంలో బెదిరింపులు ఎక్కువే. ప్రాణాలే పోతాయంటూ మాట్లాడేవారూ ఉంటారు. వాటికి తాను ఎప్పుడూ వెరవనని చెబుతుందామె. ఈ రంగంలోకి తాను రావడమే కాదు, మరింత మంది ఆడవాళ్లు రావాలని కోరుకుంది. అందుకే ఈ రంగానికి సంబంధించిన ఓ సంస్థనూ స్థాపించింది.

రెండు వేల మందికిపైగా

%బౌన్సర్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నాక మరో ఇద్దరు మిత్రులతో కలిసి సొంతంగా 'మర్దానీ బౌన్సర్ అండ్ డాల్ఫిన్ సెక్యూరిటీ సర్వీసెస్' పేరిట ఒక సంస్థను స్థాపించింది మెహరున్నీసా. దాని ద్వారా ఆమె 2500 మంది దాకా మహిళలు, పురుషులకు బౌన్సర్లుగా, సెక్యూరిటీ గార్డులుగా శిక్షణను అందించి వివిధ సంస్థల్లో ఉద్యోగులుగా నియమితులయ్యేలా చేసింది. అమితాబ్ బచ్చన్, ప్రియాంక చోప్రా, రాణీ ముఖర్జీ, దీపికా పదుకొణె, రణ్‌బీర్ కపూర్‌లాంటి బాలీవుడ్ స్టార్లకు ఆమె సేవలందించింది. నిజానికి ఆమె చెల్లికి కూడా పన్నెండేండ్లకే పెండ్లి చేశారు. ముగ్గురు పిల్లలు పుట్టాక, చిన్న వయసులోనే భర్త చనిపోవడంతో పుట్టింటికి చేరింది. తండ్రి వ్యాపారమూ దెబ్బ తినడంతో ఇప్పుడు కుటుంబం మొత్తాన్నీ మెహరున్నీసానే చూసుకుంటున్నది.

తన చివరి చెల్లెలినీ బౌన్సర్‌ను చేసింది. ఆనాడు ఆడపిల్ల అడుగు బయట పెట్టడానికి వీలు లేదన్న తండ్రే ఇప్పుడు ఆమె గురించి గొప్పగా చెబుతున్నాడు. 'ఢిల్లీలోని నైట్‌క్లబ్‌లో బౌన్సర్‌గా పనిచేస్తున్న సంగతి చాలా రోజులు ఇంట్లో వాళ్లు సహా ఎవరికీ చెప్పలేదు. అలా చెప్తే వద్దంటారనే భయం. నిజానికి నేను ఆర్మీలో చేరకపోవడానికీ ఎదుటి వాళ్ల ఆలోచనలే కారణం. నేను మరోసారి వాళ్ల భావజాలం వల్ల ఇబ్బంది పడదలుచుకోలేదు.

కొంత సమయం గడిచాక వాళ్లకి విషయం చెప్పాను. చుట్టుపక్కల వాళ్ల నుంచి కూడా సూటిపోటి మాటలు పడ్డాను. కానీ నేను మాత్రం వెనకడుగు వేయలేదు. అందుకే నేను ఇవాళ నన్ను నేను చూసుకుంటూ, నా కుటుంబాన్నీ కాపాడుకోగలుగుతున్నా. మనకు బలం ఉండటమే కాదు, అది ఉన్నట్టు ఎదుటి వారికి కనిపించాలి. అందుకే ఇలా కండలు కనబడేలా శరీర నిర్మాణాన్ని మలచుకున్నా. ఏ రంగమైనా ఇష్టం ఉంటే చాలు మనం గెలవగలం అని నేను నమ్ముతాను. అదే నలుగురికీ చెబుతాను' అంటుంది మెహరున్నీసా. కండ బలం, గుండె బలాల మేలు కలయిక మెహరున్నీసా అని అంటే ఎవరైనా కాదనగలరా చెప్పండి!

ఎప్పటికప్పుడే మంచిది..

దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దుకోవాలని పెద్దలు అంటారు. ఈ సూత్రాన్ని అనుసరించే.. కొందరు సమయం చిక్కినప్పుడే పనులను చక్కబెట్టుకుంటారు. శని/ ఆదివారాల్లోనే ఆ వారం వంటలకు కావాల్సిన పదార్థాలను సిద్ధం చేసుకుంటారు. ముఖ్యంగా.. అల్లం, వెల్లుల్లి పొట్టుతీయడం, ఉల్లిగడ్డలను కోసిపెట్టడం.. ఇలా కష్టంగా అనిపించేవాటిని ముందే పూర్తిచేస్తారు. వాటిని ప్లాస్టిక్ కంటైనర్లలో పెట్టేసి.. ఫ్రిజ్‌లో నిల్వ చేస్తుంటారు. ఇలా చేయడం వల్ల సమయం కలిసొచ్చినా.. ఆయా పదార్థాలు ఆరోగ్యానికిహాని చేస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఉల్లిపాయలు : ఒకేసారి కట్ చేసి ఫ్రిజ్‌లో పెట్టుకునే ఉల్లిపాయలు.. ఆరోగ్యానికి హానికరం. ఘాటైన వాసన కలిగే ఉల్లిపాయలను పొట్టుతీసి ఉంచేస్తే.. అవి విషపూరితంగా మారుతాయి. ఇందులో ఉండే సల్ఫర్.. కంటైనర్‌లోని ప్లాస్టిక్‌తో రసాయన చర్య జరిపి సల్ఫర్ సమ్మేళనాలను ఏర్పరుస్తుంది. అది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిదికాదు. అంతేకాదు.. తక్కువ ఉష్ణోగ్రతల వద్ద ఉల్లిపాయల్లోని పిండి పదార్థం చక్కెరగా మారిపోతుంది. ఇది మధుమేహం ఉన్నవారికి ప్రమాదకరంగా పరిణమిస్తుంది.అల్లం : పొట్టు తీసి ఫ్రిజ్‌లో నిల్వ ఉంచే అల్లంలో ఫంగస్ ఎక్కువగా పెరుగుతుంది. అది మూత్రపిండాలు, కాలేయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. ఆరోగ్యానికి మేలుచేసే అల్లంలోని సహజ సుగుణాలూ కోల్పోతుంది. కాబట్టి, అల్లాన్ని ఆరుబయట ఉంచడమే మంచిది. తాజాగా, ఎప్పటికప్పుడు పొట్టుతీసి వాడుకుంటేనే బాగుంటుంది. వెల్లుల్లి : ఇప్పుడు సూపర్ మార్కెట్లలో ఒలిచిన వెల్లుల్లి రెబ్బలను ప్లాస్టిక్ బాక్స్‌లలో ఉంచి అమ్మకానికి పెడుతున్నారు. శ్రమ తగ్గుతుందని వీటిని కొని.. అలాగే ఫ్రిజ్‌లో పెట్టేస్తుంటారు కొందరు. కావాల్సినప్పుడు తీసి వాడుకుంటారు. ఇది ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. పొట్టుతీసిన వెల్లుల్లి రెబ్బలను ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే.. అందులోని పోషకాలు తగ్గిపోతాయి. దీర్ఘకాలంలో క్యాన్సర్ కారకంగానూ మారుతాయి. నిజానికి వెల్లుల్లిని ఆరు బయట గాలికి పెట్టేస్తేనే.. ఎన్నిరోజులైనా తాజాగా ఉంటుంది. కావాల్సినప్పుడు పొట్టు ఒలిచి వాడుకుంటే.. అందులోని సుగుణాలు శరీరానికి అందుతాయి. ఇక బయట కొన్నా, ఇంట్లోనే చేసుకున్నా.. అల్లం %-% వెల్లుల్లి పేస్ట్‌ను కూడా ఎక్కువరోజులపాటు ఫ్రిజ్‌లో నిల్వ ఉంచకూడదు.

మాతృత్వాన్ని ఆస్వాదించాలంటే..

సంతానోత్పత్తిలో వయసుదే కీలక పాత్ర! కానీ, ఉన్నత చదువులు, ఉద్యోగ లక్ష్యాలు.. ఇలా అనేక కారణాలతో 'జెన్-జెడ్'లో చాలామంది పెళ్లిని, ఆ తర్వాత పిల్లల్నీ వాయిదా వేస్తున్నారు. అయితే, ఒక నిర్దిష్ట వయసు తర్వాత సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతూ వస్తుంది. మహిళల్లో 35 ఏళ్లు దాటితే.. ఆకస్మిక గర్భస్రావాలు, ఇతర సమస్యలు, పిల్లల్లో జన్యుపరమైన రుగ్మతలు వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇలాంటివారు ముందుగానే ఆధునిక పద్ధతుల్లో అండాలను సంరక్షించుకోవాల్సిందే!

అధిక బరువుతో అనర్థం!

నేటి తీరికలేని జీవనశైలితో చాలామంది ఊబకాయం బారినపడుతున్నారు. మరికొందరు సైజ్ జీరో అంటూ.. కడుపు కట్టుకొని సన్నబడిపోతున్నారు. ఈ రెండూ సంతాన సాఫల్యతపై దుష్ప్రభావం చూపేవే! తక్కువ బరువు.. అండాశయాల ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నెలలు నిండకుండానే ప్రసవమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇక ఎక్కువ బరువుంటే.. రుతుచక్రం దెబ్బతింటుంది. గర్భస్రావం అయ్యే అవకాశం ఉంటుంది. సంతాన సాఫల్యత కోసం బరువును అదుపులో ఉంచుకోవాల్సిందే!

ఆహారం.. హాహాకారం!

ఇంటివంట అంతగా రుచించని తరం. 'టిఫిన్ బాక్స్' అంటేనే.. అదేదో వింత వస్తువు అన్నట్టు చూసే జనం. బయటికెళ్లారంటే.. బయటి ఫుడ్ తినాల్సిందే అనేరకం! కానీ, జంక్‌ఫుడ్‌లో ఉండే చెడు కొవ్వులు.. మహిళల రుతుచక్రానికి అంతరాయం కలిగిస్తాయి. పునరుత్పత్తి హార్మోన్లపైనా తీవ్ర ప్రభావం చూపుతాయి. అయితే, సంతానోత్పత్తి మెరుగుపడాలంటే.. ఆహారంలో తృణధాన్యాలు, చేపలు, కూరగాయలను భాగం చేసుకోవాల్సిందే!

నిద్రాభంగం!

ఉద్యోగులకు నైట్ షిఫ్టులు, యువతకు లేట్‌నైట్ పార్టీలు.. కారణాలు ఏవైతేనేం, ఈతరం కుర్రకారుకి రాత్రినిద్ర కరువైపోతున్నది. నిద్రలేమి.. సంతానోత్పత్తిపై దుష్ప్రభావం చూపుతుంది. హార్మోన్ల అసమతుల్యతకు దారితీసి.. వంధ్యత్వానికి కారణం అవుతున్నది. మెరుగైన సంతానం కావాలంటే.. ప్రతిరోజూ 7 నుంచి 8 గంటల నిద్రపోవాల్సిందే!

ఇతర అలవాట్లూ..

పొగతాగడం వల్ల ఆడవాళ్లలో సంతానోత్పత్తి సామర్థ్యం తగ్గుతుంది. ఎక్కువగా కాఫీలు తాగినా.. పునరుత్పత్తి వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. రోజుకు 100 ఎంజీ కంటే ఎక్కువగా కెఫీన్ తీసుకునేవారికి గర్భస్రావం అయ్యే అవకాశం ఉంటుందని పలు అధ్యయనాల్లో తేలింది. ఇక ధూమపానం చేసే మహిళల్లో అండాశయ నిల్వలు తగ్గుతాయి. మానసిక, శారీరక ఒత్తిడితోపాటు వాతావరణ కాలుష్యం, సెల్‌ఫోన్ల అతివాడకం కూడా.. సంతానోత్పత్తిపై ప్రభావం చూపుతుందని వివిధ అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. పండంటి బిడ్డను పొందాలంటే.. ఈ అలవాట్లను దూరం పెట్టాల్సిందే!

ఉపవాసం తర్వాత ఖర్జూరమే ఎందుకు?

రంజాన్ నెలలో ముస్లింలు పగలంతా పచ్చి మంచినీళ్లు కూడా ముట్టరు. చంద్రోదయం తర్వాత మాత్రం ముందుగా ఖర్జూరం పండును అందులోనూ అజ్వా డేట్స్‌ను చాలామంది తీసుకుంటారు. ఎన్నో గంటలు కడుపు ఖాళీగా ఉన్న తర్వాత ఖర్జూరం తినడం వెనుక మతపరమైన ప్రాశస్త్యమే కాదు ఆరోగ్యపరమైన అంశాలూ ముడివడి ఉన్నాయంటున్నారు ఆరోగ్య నిపుణులు.

ముస్లింలు ఈ నెలలో తమ ఉపవాసాన్ని ఖర్జూరం పండు తినడంతో ముగిస్తుంటారు. ముఖ్యంగా సాధారణమైన పండ్లకు భిన్నంగా నలుపు రంగులో ఉండే అజ్వా డేట్స్‌ను ఎక్కువగా తీసుకుంటారు. ఇవి సౌదీ అరేబియాలోని మదీనా ప్రాంతంలో విరివిగా పండుతాయి. మృదువైన గుజ్జుతో ఉండే వీటి రుచి కూడా మిగతావాటికి భిన్నంగా ఉంటుంది. సాధారణంగానే ఖర్జూర పండ్లలో నీటి శాతం ఎక్కువ. అన్ని గంటలపాటు నీరూ ఆహారమూ లేకుండా ఉండేవారు వీటిని తీసుకుని కాసిన్ని మంచినీళ్లు తాగితే శరీరం నెమ్మదిస్తుంది. డీహైడ్రేషన్‌కు గురవ్వకుండా ఉంటుంది. మహమ్మద్ ప్రవక్త కూడా ఉపవాసాన్ని ఇలాగే వదిలేవారని నమ్ముతారు. దాన్నే ఇప్పటికీ ముస్లింలు పాటిస్తున్నారు. వీటిలో ఉండే సహజ చక్కెరలు రక్తంలో గ్లూకోజ్ స్థాయులు ఒకేసారి పెరిగిపోకుండా చూస్తూనే దేహానికి శక్తినందిస్తాయి.

ఈ చక్కెరలు సులభంగా జీర్ణమవుతాయి కూడా. రోజంతా ఉపవాసం ఉన్నాక ఇవి తినడం వల్ల పొట్ట మీద ఒకేసారి భారం పడదన్నమాట! అంతేకాదు, ఈ పండ్లలో పుష్కలంగా ఉండే పీచులు జీర్ణాశయ ఆరోగ్యానికి మేలుచేస్తాయి. ఇందులో ఉండే యాంటి ఇన్‌ఫ్లమేటరీ (వాపుల్ని తగ్గించే) గుణాలు రోజంతా ఖాళీగా ఉన్న పొట్టకు సాంత్వన చేకూరుస్తాయి. వీటిలో ఉండే మెగ్నీషియం, పొటాషియం లాంటి ఖనిజాలు రక్తపోటును, తద్వారా గుండె ఆరోగ్యాన్ని కాపాడుతాయి. అంతేకాదు, తగిన మోతాదులో చక్కెరలు, పీచులు, ఇతర పోషకాలు కలిగి ఉండే ఈ చిన్న పండ్లు సాయంకాలం మొత్తం ఉత్సాహంగా గడిపేందుకు కావలసినంత శక్తినీ అందించగలవు. అదన్నమాట ఇఫ్తార్ విందులో ఖర్జూర పండ్ల రహస్యం!

కమ్మని మజ్జిగతో... చల్ల చల్లగా...



వేసవి కాలం వచ్చేసింది. రోజు రోజుకీ ఎండ వేడి పెరుగుతోంది. మధ్యాహ్నం వేళ బాగా ఎండగా ఉన్నప్పుడు ఒక గ్లాసు చల్లటి మజ్జిగ తాగితే ప్రాణం లేచొచ్చినట్లు ఉంటుంది. అందుకే ఈ వేసవిలో మీ దాహార్తిని తీర్చేందుకు విభిన్న మజ్జిగ రుచులను అందిస్తున్నాం...

స్వీట్ లస్సీ

కావాల్సిన పదార్థాలు

పెరుగు- రెండు కప్పులు, పంచదార- అర కప్పు, యాలకుల పొడి- అర చెంచా, కుంకుమ పువ్వు- పావు చెంచా, గులాబీ నీళ్లు- ఒక చెంచా, చల్లటి నీళ్లు- అర గ్లాసు, ఐస్ క్యూబ్స్- ఆరు

తయారీ విధానం

ఒక కప్పులో ఒక చెంచా నీళ్లు, కుంకుమ పువ్వు వేసి అయిదు నిమిషాలు నాననివ్వాలి.

ఒక వెడల్పాటి గిన్నెలో పెరుగు, పంచదార వేసి బీటర్ సహాయంతో బాగా బీట్ చేయాలి. పంచదార మొత్తం కరిగాక ఇందులో యాలకుల పొడి, కుంకుమపువ్వు మిశ్రమం, గులాబీ నీళ్లు, చల్లటి నీళ్లు, ఐస్ క్యూబ్స్ వేసి మరోసారి బీట్ చేయాలి. తరవాత ఈ మిశ్రమాన్ని గాజు గ్లాసులో పోసి పైన కుంకుమ పువ్వు రేకులు, పిస్తా తరుగు చల్లితే స్వీట్ లస్సీ సిద్ధం అవుతుంది.

జాగ్రత్తలు

కమ్మగా ఉండే గడ్డ పెరుగుని తీసుకుంటే లస్సీ రుచికరంగా తయారవుతుంది.

ఇందులో ఒక చెంచా కోవా కలిపితే మరింత కమ్మగా ఉంటుంది.

పంచదారకు బదులు బెల్లం పొడి లేదా తాటి బెల్లం కూడా వాడుకోవచ్చు.

మసాలా మజ్జిగ

కావాల్సిన పదార్థాలు

అల్లం- ఒక చిన్న ముక్క, పచ్చి మిర్చి- ఒకటి, పుదీనా ఆకులు- అయిదు, కొత్తిమీర- రెండు రెమ్మలు, మిరియాల పొడి- పావు చెంచా, జీలకర్ర పొడి- పావు చెంచా, పెరుగు- ఒక గంటె, ఉప్పు- తగినంత, చల్లటి నీళ్లు- ఒక గ్లాసు, నిమ్మరసం- ఒక చెంచా

తయారీ విధానం

పచ్చిమిర్చి, పుదీనా, అల్లం, కొత్తిమీరలను నీళ్లతో శుభ్రంగా కడగాలి. కొత్తిమీరను సన్నగా తరగాలి.

మిక్సీ గిన్నెలో పెరుగు, అల్లం, పచ్చిమిర్చి, పుదీనా ఆకులు, కొత్తిమీర తరుగు, మిరియాల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. తరవాత ఇందులో చల్లటి నీళ్లు పోసి మరోసారి గ్రైండ్ చేయాలి. ఇలా తయారైన మసాలా మజ్జిగను గాజు గ్లాసులో పోయాలి. ఇందులో నిమ్మరసం వేసి కలపాలి. దీనిపైన చిటికెడు జీలకర్ర పొడి, కొద్దిగా కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేస్తే బాగుంటుంది.

యూటర్న్ తీసుకున్న ఎఫ్ఐఐలు.. భారత స్టాక్ మార్కెట్ ఇక పైపైకేనా..

న్యూఢిల్లీ-నవభూమి: కొన్ని నెలలుగా భారత స్టాక్ మార్కెట్(%×అ౸ఱుఅ క్శీషిన మీఖతీనవ్%)ను పాతాళంలోకి నెట్టుకుంటూ వచ్చిన విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు (%ఖీశీతీవఱస్త్రఅ ×అర్ఱ్ఱ్ఱఱశీఱుశ్రీ ×అజవర్శీతీం%) ఇప్పుడు యూటర్న్ తీసుకున్నారు. కొన్ని రోజులుగా భారీ అమ్మకాలు, చిన్నా చితకా కొనుగోళ్లు జరుపుకుంటూ వచ్చి ఎఫ్ఐఐలు నిన్న (శుక్రవారం) బిగ్ కమ్ బ్యాక్ ఇచ్చారు. మార్చి 21న అంటే నిన్న ఏకంగా రూ.7,470 కోట్ల మేర అధిక మొత్తంలో కొనుగోలు చేశారు. ఈ ఏడాదిలో వారి అత్యధిక ఈక్విటీ కొనుగోలు ఇదేనని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఇండియన్ స్టాక్ మార్కెట్ మరింత ర్యాపిడ్ స్పీడ్‌తో దూసుకుపోతుందా? అనే ఆశలు నిన్నటి మార్కెట్ తీరు చూస్తే అర్థమవుతోంది. దీంతో వరసగా ఐదురోజులపాటు బుల్ రన్ చేస్తున్న భారత మార్కెట్లు మరింతగా పుంజుకున్నాయి. ఫలితంగా భారత మార్కెట్లకు రూ.22లక్షల కోట్ల సంపద వచ్చి చేరింది. విదేశీ మదుపర్లు తిరిగి కొనుగోళ్లకు మొగ్గు చూపడం, బ్యాంకింగ్ షేర్ల రాణింపుతో శుక్రవారం సెన్సెక్స్, నిఫ్టీ దాదాపు ఒక శాతం మేర పెరిగాయి. దీన్ని అదునుగా తీసుకున్న డీఐఐలు డొమెస్టిక్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ అమ్మకాలకు దిగారు. రూ.3,202.26 కోట్ల మేర షేర్లను ఆఫ్ లోడ్ చేశారు. ఫారిన్ ఇన్స్టిట్యూషనల్ ఇన్వెస్టర్స్ మాత్రం ఇదే ధోరణి కొనసాగిస్తే భారత మార్కెట్లు 'వి' షేప్ రికవరీని చూసే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని మార్కెట్ పండితులు అంచనా వేస్తున్నారు.

రెండేళ్లలో తెలంగాణలో రూ.1,000 కోట్ల టర్నోవర్

హైదరాబాద్-నవభూమి: జెర్సీ బ్రాండ్‌తో పాలు, పాల ఉత్పత్తులను విక్రయిస్తున్న గోద్రెజ్ జెర్సీ.. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో గట్టి పట్టును చేజిక్కించుకునేందుకు రెడీ అవుతోంది. ఇందులో భాగంగా బాదంపాలు, పన్నీర్, పెరుగు ఉత్పత్తులపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు గోద్రెజ్ జెర్సీ సీఈఓ భూపేంద్ర సూరి వెల్లడించారు. మార్కెట్ కార్యకలాపాల విస్తరణ, వ్యూహాత్మక పెట్టుబడులు, భాగస్వామ్యాల ద్వారా ఈ ఉత్పత్తుల అమ్మకాలను గణనీయంగా పెంచుకోవాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు. గోద్రెజ్ జెర్సీ ఇప్పటికే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలో కీలకమైన బ్రాండ్‌గా ఉందన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కంపెనీ టర్నోవర్ రూ.660 కోట్లుగా ఉందని 2026-27 నాటికి దీన్ని రూ.1,000 కోట్లకు పెంచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సూరి తెలిపారు. కాగా విలువ ఆధారిత ఉత్పత్తులపై మరింతగా దృష్టి పెట్టడం ద్వారా తెలుగు రాష్ట్రాల్లో మరో రూ.1,000 కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలని చూస్తున్నట్లు ఆయన చెప్పారు.
గడచిన ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ఆదాయం రూ.1,540 కోట్లుగా ఉండగా అందులో విలువ ఆధారిత ఉత్పత్తుల వాటా దాదాపు 40 శాతం వరకు ఉందన్నారు. కాగా బాదంపాల మార్కెట్లో మరింత పట్టును చేజిక్కించుకునే ఉద్దేశంతో టాలీవుడ్ నటుడు రానా దగ్గుబాటిని ప్రచారకర్తగా నియమించుకున్నట్లు సూరి వెల్లడించారు. ప్రస్తుతం ఏపీ, తెలంగాణ మార్కెట్లో కంపెనీ రోజుకు 2 లక్షల లీటర్ల వరకు పాలను సేకరిస్తోందని తెలిపారు.

రిలయన్స్ క్యాపిటల్ దివాలా సుఖాంతం

న్యూఢిల్లీ-నవభూమి: అనిల్ అంబానీకి చెందిన రిలయన్స్ క్యాపిటల్ కంపెనీ దివాలా పరిష్కార ప్రక్రియ సుఖాంతమైంది. హిందుజాల నేతృత్వంలోని ఇండ్‌సఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్ లిమిటెడ్ (ఐఐహెచ్ఎల్) రూ.10,000 కోట్లతో ఈ కంపెనీని దక్కించుకుంది. రుణదాతలు, రెగ్యులేటరీ సంస్థల ఆమోదాలూ పూర్తయ్యాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డునీ పునర్ వ్యవస్థీకరించారు. దీంతో ఈ నెల 19న రిలయన్స్ క్యాపిటల్ దివాలా పరిష్కార ప్రక్రియ పూర్తయిందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) తెలిపింది. ఈ ప్రక్రియ మొత్తానికి వై నాగేశ్వర రావు దివాలా పరిష్కార పరిష్కర్తగా వ్యవహరించారు. దేశంలో దివాలా పరిష్కార ప్రక్రియకు వచ్చిన తొలి ఎన్‌బీఎఫ్‌సీ కూడా రిలయన్స్ క్యాపిటలే.

ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్స్‌పై కేంద్రం కొరడా.. 357 వెబ్‌సైట్స్ బ్లాక్..!

న్యూఢిల్లీ-నవభూమి: ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లపై కేంద్రం కొరడా ఝుళిపించింది. జీఎస్టీ ఇంటెలిజెన్స్ అధికారులు అక్రమ ఆఫ్‌షోర్ ఆన్‌లైన్ గేమింగ్ సంస్థల 357 వెబ్‌సైట్‌లను బ్లాక్ చేశారని.. దాదాపు 2,400 బ్యాంక్ ఖాతాలను అటాచ్ చేసినట్లుగా ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం తెలిపింది. రూ.126 కోట్లను ఫ్రీజ్ చేసినట్లు పేర్కొంది. మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌తో అప్రమత్తంగా ఉండాలని.. వాటిని ఎవరూ వినియోగించొద్దని డీజీజీఐ సూచించింది. కొన్ని సంస్థలను నమోదు చేయకుండా, ఆదాయాన్ని దాచిపెడుతూ జీఎస్టీ ఎగవేతలకు పాల్పడుతున్న చట్టవిరుద్ధమైన ఆన్‌లైన్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్స్‌పై చర్యలు తీసుకున్నామని.. 357 వైబ్‌సైట్స్‌ని ఐటీశాఖ సమన్వయంతో బ్లాక్ చేసినట్లు మంత్రిత్వశాఖ పేర్కొంది. బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌కు పాల్పడుతోన్న సుమారు 700 సంస్థలపై నిఘా వేసినట్లు పేర్కొంది.దేశం వెలుపల ఈ తరహా సంస్థలు నడుపుతోన్న పలువురు భారతీయులపై డీజీజీఐ మరో ఆపరేషన్ చేపట్టి.. వారికి సంబంధించిన 166 ఖాతాలను బ్లాక్ చేసింది. ఈ సందర్భంగా ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నది. చాలామంది బాలీవుడ్ ప్రముఖులు, క్రికెటర్లు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్స్ ఈ ప్లాట్‌ఫామ్స్‌కు ప్రచారం నిర్వహిస్తున్నట్లుగా గుర్తించినట్లు పేర్కొంది. ఈ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఆ ప్లాట్‌ఫామ్స్ వ్యక్తుల ఆర్థిక భద్రతను దెబ్బతీసే అవకాశం ఉందని.. దేశ భద్రతను దెబ్బతీసే కార్యకలాపాలకు అవి పరోక్షంగా మద్దతు ఇచ్చే అవకాశాలున్నాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది. జీఎస్టీ చట్టం ప్రకారం.. ఆన్‌లైన్ గేమింగ్‌కు 28శాతం జీఎస్టీ విధిస్తున్నారు. ఈ రంగంలో పని చేస్తున్న సంస్థలు జీఎస్టీ కింద రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుంది. రాబోయే ఐపీఎల్ సీజన్‌తో సహా చట్టవిరుద్ధమైన గేమింగ్ కార్యకలాపాలను అరికట్టేందుకు మరింత కఠిన చర్యలు ఉంటాయని పేర్కొంది.

లగ్జరీ వాచీలకు భలే గిరాకీ

హైదరాబాద్ -నవభూమి: భారత్‌లో ఖరీదైన వాచీలకు రోజురోజుకు డిమాండ్ పెరిగిపోతోందని స్విట్జర్లాండ్‌కు చెందిన వాచీల తయారీ సంస్థ బ్రైట్లింగ్ వెల్లడించింది. దేశీయంగా కొనుగోలు శక్తి పెరుగుతుండటం, నవతరం కొత్త, ఖరీదైన ఉత్పత్తులపై ఆసక్తి చూపిస్తుండటంతో ఈ మార్కెట్ ఏటా 15 శాతానికి పైగా వృద్ధిని నమోదు చేస్తూ వస్తోందని బ్రైట్లింగ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ ప్రదీప్ భానోట్ వెల్లడించారు. ప్రస్తుతం స్విట్జర్లాండ్ నుంచి ఏటా రూ.2,500 కోట్ల విలువైన లగ్జరీ వాచీలు దిగుమతి అవుతున్నాయన్నారు. లగ్జరీ వాచీల మార్కెట్లో బ్రైట్లింగ్‌తో పాటు మరో రెండు స్విస్ వాచీ కంపెనీలు కీలకంగా ఉన్నాయన్నారు. లగ్జరీ వాచీ మార్కెట్లో బ్రైట్లింగ్ మార్కెట్ వాటా 10 శాతానికి పైగా ఉందని ప్రదీప్ తెలిపారు.

ఏప్రిల్ 2025లో బ్యాంక్ సెలవులు ఎన్ని రోజులో తెలుసా..

న్యూఢిల్లీ-నవభూమి: 01 ఏప్రిల్ 2025, మంగళవారం - వార్షిక ఖాతా ముగింపు కారణంగా మేఘాలయ, ఛత్తీస్‌గఢ్, మిజోరాం, బెంగాల్, హిమాచల్ ప్రదేశ్ మినహా దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు
05 ఏప్రిల్ 2025, శనివారం - బాబు జగ్ జీవన్ రామ్ పుట్టినరోజు సందర్భంగా తెలంగాణలో **బ్యాంకులకు హాలిడే**
06 ఏప్రిల్ 2025, ఆదివారం - వారాంతపు సెలవు
10 ఏప్రిల్ 2025, గురువారం- మహావీర్ జయంతి నేపథ్యంలో ఛత్తీస్‌గఢ్, హర్యానా, జార?ండ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మిజోరం, పంజాబ్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, ఢిల్లీ, తమిళనాడు ప్రాంతాల్లో హాలిడే
12 ఏప్రిల్ 2025, శనివారం - రెండో శనివారం దేశవ్యాప్తంగా బ్యాంకులకు సెలవు
13 ఏప్రిల్ 2025, ఆదివారం - వారాంతపు సెలవు
14 ఏప్రిల్ 2025, సోమవారం- డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, గోవా, జార?ండ్, మహారాష్ట్ర, సిక్కిం, తమిళనాడు, ఉత్తరాఖండ్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, కేరళ, సిక్కిం, అసోం ప్రాంతాల్లో సెలవు
15 ఏప్రిల్ 2025, మంగళవారం- బెంగాలీ డే సందర్భంగా కోల్‌కతా, అగర్తలా, గౌహతి, ఇటానగర్, **సిమ్లా ప్రాంతాల్లో హాలిడే**
16 ఏప్రిల్ 2025, బుధవారం- బోహాగ్ బిహు నేపథ్యంలో గౌహతిలో బ్యాంకులు బంద్
18 ఏప్రిల్ 2025, శుక్రవారం - గుడ్ ఫ్రైడే రోజున తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, బీహార్, గోవా, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్, జార?ండ్, కర్ణాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, త్రిపుర, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లో సెలవు
20 ఏప్రిల్ 2025, ఆదివారం- వారాంతపు హాలిడే
21 ఏప్రిల్ 2025, సోమవారం - గరియా పూజ సందర్భంగా త్రిపురలో బ్యాంకులకు హాలిడే
26 ఏప్రిల్ 2025, శనివారం - నాలుగో శనివారం సందర్భంగా దేశవ్యాప్తంగా సెలవు
27 ఏప్రిల్ 2025, ఆదివారం- వారాంతపు సెలవు
29 ఏప్రిల్ 2025, మంగళవారం- మహర్షి పరశు రామ జయంతి నేపథ్యంలో సిమ్లాలో సెలవు
30 ఏప్రిల్ 2025, బుధవారం - బసవ జయంతికి కర్ణాటకలో బ్యాంకులు బంద్

క్రికెట్ ఫ్యాన్స్‌కు గుడ్‌న్యూస్.. థియేటర్లలో ఐపీఎల్ మ్యాచ్‌లు.. బీసీసీఐతో పీవీఆర్ ఐనాక్స్ డీల్!

న్యూఢిల్లీ-నవభూమి: క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూసే ఐపీఎల్ రానే వచ్చింది. 18వ సీజన్ మార్చి 22 నుంచే ఆరంభం కానుంది. తొలి మ్యాచ్ డిఫెండింగ్ ఛాంపియన్స్ కోల్‌కతా నైట్ రైడర్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరగనుంది. ఇక దాదాపు 2 నెలల పాటు అంతులేని వినోదాన్ని పంచేందుకు.. సంబరాల్లో ముంచెత్తేందుకు వచ్చేసింది ఇండియన్ ప్రీమియర్ లీగ్. మ్యాచ్‌ల్ని నేరుగా స్టేడియంకు వెళ్లి చూడాలనుకునే వారి సంఖ్య ఎక్కువే ఉంటుంది. కానీ టికెట్ రేట్లు ఎక్కువ ఉంటాయి. స్టేడియం సామర్థ్యం తక్కువ ఉంటుంది. కాబట్టి స్టేడియాలకు వెళ్లలేని వారు.. టీవీల్లోనో, బయట ఫ్యాన్ పార్క్ ఏర్పాటు చేస్తే అక్కడ చూడటం వంటివి చేస్తుంటారు.అయితే ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌ల్ని థియేటర్లలో చూసే వెసులుబాటు కల్పిస్తోంది ప్రముఖ సినిమా ఎగ్జిబిటర్ పీవీఆర్ ఐనాక్స్. తాజాగా ఈ సంస్థ.. భారత క్రికెట్ నియంత్రణ మండలితో (%దీజజ×%) సంయుక్తంగా కీలక ఒప్పందాన్ని కుదుర్చుకుంది. ఈ ఒప్పందం మేరకు %ఖూ% 2025 మ్యాచులను దేశవ్యాప్తంగా 30కి పైగా నగరాల్లోని పీవీఆర్ ఐనాక్స్ సినిమాస్‌లో ప్రత్యక్ష ప్రసారం చేయనున్నారు. అంటే ఇప్పుడు ఐపీఎల్ కోసం ప్రేక్షకులకు కొత్త అనుభూతి అందించేందుకు పీవీఆర్ ఐనాక్స్ సిద్ధమైంది. మార్చి 22న జరిగే ప్రారంభోత్సవ వేడుకతోనే ఈ ప్రత్యేక స్క్రీనింగ్ మొదలవుతుందని సంస్థ ప్రకటించింది. ముఖ్యంగా వీకెండ్ మ్యాచ్‌లు, ప్లేఆఫ్ మ్యాచ్‌లు థియేటర్లలో లైవ్ స్ట్రీమింగ్ చేయనున్నట్లు వెల్లడించింది.థియేటర్లలో హై-క్వాలిటీ విజువల్స్ అండ్ సౌండ్ ఎఫెక్ట్స్‌తో ప్రేక్షకులకు స్టేడియంలో ఉన్న అనుభూతిని కలిగించేలా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు సంస్థ పేర్కొంది. ప్రీమియం సీటింగ్ అం గ్రాండ్ స్క్రీన్ ఎక్స్‌పీరియన్స్ అందిస్తూ.. సాధారణ టీవీ స్క్రీన్ కన్నా విపరీతంగా పెద్ద స్క్రీన్‌పై మ్యాచ్‌లను ఆస్వాదించే అవకాశం కలుగుతుంది. ఫ్యామిలీ, ఫ్రెండ్స్‌తో కలిసి చూడడానికి వీలుగా.. ఫన్ పబ్‌లు, బార్‌లు కాకుండా, ఫ్యామిలీ ఫ్రెండ్లీ వాతావరణంలో మ్యాచ్‌లను చూడటానికి అవకాశం ఉంటుంది. పెద్ద తెరపై ప్రత్యక్ష ప్రసారం ద్వారా అసలైన ఐపీఎల్ థ్రిల్‌ను అనుభవించవచ్చని చెబుతోంది.ఇక ఈ మ్యాచ్ సమయంలో థియేటర్లలో చూసేందుకు.. పీవీఆర్ ఐనాక్స్ యాప్ లేదా వెబ్‌సైట్ ద్వారా టికెట్లు బుక్ చేసుకోవచ్చు. పీవీఆర్ ఐనాక్స్ ప్రకటించిన వివరాల ప్రకారం.. ఈ థియేటర్ స్క్రీనింగ్ ముఖ్యంగా మెట్రో నగరాలు, టైర్ 2, టైర్ 3 సిటీలలో కూడా అందుబాటులో ఉంటుంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, పుణే, అహ్మదాబాద్ వంటి మెట్రో నగరాలు అలాగే.. విజయవాడ, విశాఖపట్నం, లక్నో, చండీగఢ్, జైపూర్, ఇండోర్ వంటి ఇతర ప్రధాన నగరాల్లో థియేటర్లలో మ్యాచ్‌ల్ని చూడొచ్చు.'గతేడాది థియేటర్లలో క్రికెట్ మ్యాచ్‌ల ప్రత్యక్ష ప్రసారం ప్రేక్షకుల నుంచి విపరీతమైన స్పందన తెచ్చుకుంది. ఈసారి ఐపీఎల్ 2025 కోసం మరింత మెరుగైన అనుభూతిని అందించేందుకు సిద్ధంగా ఉన్నాం." అని పీవీఆర్ ఐనాక్స్ రెవెన్యూ, ఆపరేషన్స్ సీఈఓ గౌతమ్ దత్తా చెప్పారు. సినిమాను, క్రికెట్ అభిమానులను ఒకే వేదికపైకి తేవడం మాకు గర్వకారణం అని అన్నారు. బీసీసీఐ నిర్వహించే ఐపీఎల్ 18వ సీజన్లో మొత్తం 10 జట్లు బరిలో ఉండగా.. 74 మ్యాచ్‌లు జరుగుతాయి. మే 26న ఫైనల్

ఈవీ బీమాకు భారీగా డిమాండ్.. మూడేళ్లలో 16 రెట్లు పెరుగుదల..!

న్యూఢిల్లీ-నవభూమి: ఎలక్ట్రికల్ వాహనాలబీమాకు డిమాండ్ పెరుగుతున్నది. పాలసీ బజార్ ఇంటర్నల్ డేటా ప్రకారం.. గత మూడేళ్లలో ఈవీ బీమా డిమాండ్ 16 రెట్లు పెరిగింది. 2023 ఆర్థిక సంవత్సరంలో ఈవీ కార్ల బీమా వాటా కేవలం 0.50శాతం మాత్రమే ఉండగా.. మార్చి 2025 నాటికి 14శాతానికి పెరిగిందని ప్రైవేటు రంగ బీమా కంపెనీ ఓ నివేదికలో తెలిపింది. ఈ సందర్భంగా పాలసీ బజార్ ఇన్సూరెన్స్ సీబీవో అమిత్ ఛబ్రా మాట్లాడుతూ ఈవీ బీమా డిమాండ్.. సస్టెయినబుల్ మొబిలిటీ వైపు భారత్ పయనిస్తుందనేదానికి సంకేతమని పేర్కొన్నారు.
ఈవీ బీమా వాటా గత మూడేళ్లలో 16 రెట్లు పెరిగిందని తెలిపారు. ఇది ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాలను కొనుగోలు చేయడమే కాకుండా అవసరమైన భద్రతా చర్యలను తీసుకుంటున్నట్లుగా అర్థమని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో విక్రయించిన మొత్తం ద్విచక్ర వాహనాల బీమా పాలసీల్లో 7-8శాతం ఎలక్ట్రికల్ ద్విచక్ర వాహనాలకు చేయబడిందని చెప్పారు. గతేడాది కాలంలో ఈ సంఖ్య రెట్టింపు కావడం విశేషం. గతేడాది 10వేల ఈవీ ద్విచక్ర వాహనాలకు బీమా చేయగా.. ఈ ఏడాది ఈ సంఖ్య 20వేలకు చేరింది. ద్విచక్ర వాహనాల విభాగంలో ఎలక్ట్రిక్ స్కూటర్లదే అత్యధిక వాటా కాగా.. బీమా చేసిన ద్విచక్ర వాహనాల్లో ఈవీ 98-99శాతం ఉన్నాయి.దేశంలోని ఐదు బడా మెట్రో నగరాలైన ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పూణే, చెన్నై, ముంబయి-థానేలో ఈవీ బీమాకు భారీ డిమాండ్ ఉన్నది. ఆయా నగరాల్లో మొత్తం 55శాతం ఈవీ బీమా పాలసీలను వాహనదారులు కొనుగోలు చేశారు. ఢిల్లీ-ఎన్‌సీఆర్ 18.3 శాతం మార్కెట్ వాటాతో ముందంజలో నిలిచింది. బెంగళూరు 16 శాతం వాటాతో రెండో స్థానంలో నిలిచింది. పుణె (7.6శాతం), చెన్నై (6.7శాతం), ముంబయి-థానే (6.4శాతం) డిమాండ్ ఉన్నది. డేటా ప్రకారం.. ఈవీ బీమాలో 58శాతం టైర్-1 నగరాల నుంచి రాగా.. టైర్-2 నుంచి 30శాతం, టైర్-3 నగరాల వాటా 12శాతంగా ఉన్నది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్పెషల్ స్కీమ్.. మార్చి 31 లాస్ట్ డేట్.. 10 లక్షలపై ఎంతొస్తుంది?

న్యూఢిల్లీ-నవభూమి: చాలా బ్యాంకుల్లో ప్రస్తుతం ఫిక్స్‌డ్ డిపాజిట్లపై ఆకర్షణీయ స్థాయిలో వడ్డీ రేట్లు ఉన్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో కొన్ని బ్యాంకులు.. ప్రత్యేక టెన్యూర్లతో కొత్త స్పెషల్ ఎఫ్‌డీ పథకాల్ని లాంఛ్ చేశాయి. ఇటీవల ఆర్బీఐ రెపో రేట్లను చాలా కాలం తర్వాత తగ్గించిన క్రమంలో.. ఇప్పుడు వీటిపై వడ్డీ రేట్లను తగ్గించే అవకాశాలు ఉన్నాయి. గతంలో గడువు ముగిసినా మరోసారి తీసుకొచ్చాయి. ఇప్పుడు వాటి గడువును పొడిగించే అవకాశాలు ఉన్నట్లు కనిపించట్లేదు. ఇందులో భాగంగానే గతంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రత్యేక ఫిక్స్‌డ్ డిపాజిట్ (%ఖీణ%) పథకం తీసుకురాగా.. ఇది త్వరలో ముగుస్తుంది. పెట్టుబడిదారులకు ఎక్కువ వడ్డీ రేటుతో పొదుపు చేసే అవకాశం కల్పిస్తూ, స్థిరమైన రాబడిని అందించేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. 2025, మార్చి 31 వరకు మాత్రమే ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుంది.త్వరలో ఈ ఆఫర్ ముగుస్తుంది కాబట్టి పెట్టుబడిదారులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని బ్యాంక్ కోరుతోంది. ఇక్కడ రెండు స్పెషల్ టెన్యూర్ డిపాజిట్లు ఉన్నాయి. ఇక సాధారణ ప్రజల కంటే వీటిల్లో సీనియర్ సిటిజెన్లకు దాదాపు 50 బేసిస్ పాయింట్ల మేర అధిక వడ్డీ అందుతోంది.35 నెలలు లేదా 2 సంవత్సరాల 11 నెలల డిపాజిట్లపై జనరల్ సిటిజెన్స్‌కు 7.35 శాతం వడ్డీ రేటు ఉండగా.. సీనియర్ సిటిజెన్స్‌కు అత్యధికంగా 7.85 శాతం వడ్డీ రేటు ఉంది. ఇదే సమయంలో 55 నెలలు లేదా 4 సంవత్సరాల 7 నెలల ప్రత్యేక డిపాజిట్లపై వరుసగా సాధారణ ప్రజలు, సీనియర్ సిటిజెన్స్‌కు చూస్తే 7.40 శాతం, 7.90 మేర వడ్డీ రేట్లు ఉన్నాయి. అంటే ఇక్కడ దీర్ఘకాలం పాటు మెరుగైన రిటర్న్స్ పొందుతారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లలో అది కూడా ప్రముఖ బ్యాంకుల్లో డిపాజిట్లపై రిస్క్ ఉండదు.ఇప్పుడు మనం ఇందులో రూ. 10 లక్షలు జమ చేసినట్లయితే ఎంతొస్తుందో తెలుసుకుందాం. 35 నెలల్లో రూ. 10 లక్షలపై సాధారణ ప్రజలకు 7.35 శాతం చొప్పున చూస్తే రూ. 1,47,000 వడ్డీ వస్తుంది. ఇదే సీనియర్ సిటిజెన్లకు 7.85 శాతం వడ్డీ రేటు చొప్పున చూస్తే రూ. 1,57,000 వడ్డీ అందుతుంది. ఇక ఇదే 55 నెలలపై చూసినట్లయితే సాధారణ ప్రజలకు 7.40 శాతం చొప్పున రూ. 2,96,000 వడ్డీ వస్తుంది. ఇదే సీనియర్ సిటిజెన్లకు చూస్తే 7.90 శాతం లెక్కన రూ. 3,16,000 వడ్డీ అందుతుంది.%ఎణఖీజ% బ్యాంక్ ఇతర %ఖీణ% వడ్డీ రేట్లు ఎలా ఉన్నాయో చూద్దాం. సాధారణ పౌరులకు 7 రోజుల నుంచి 10 సంవత్సరాల వరకు సాధారణ ప్రజలకు కనీసం 3 శాతం నుంచి గరిష్టంగా 7.40 శాతం వరకు వడ్డీ రేటు లభిస్తుంది. ఇది రూ. 3 కోట్ల కంటే తక్కువ డిపాజిట్లపై వర్తిస్తుంది. సీనియర్ సిటిజన్లకు 7 రోజుల నుండి 10 సంవత్సరాల వరకు 3.50 శాతం నుంచి 7.90 శాతం వరకు వడ్డీ రేటు లభిస్తుంది.

ఫిజిక్స్ వాలా IPO ద్వారా ఎందుకంత మొత్తాన్ని సేకరిస్తోంది..

న్యూఢిల్లీ-నవభూమి: భారతదేశంలోని అగ్రశ్రేణి ఎడ్యుటెక్ సంస్థ ఫిజిక్స్ వాలా దేశంలోని విద్యా సాంకేతిక సంస్థల్లో మొదటిదైన ఈ సంస్థ ఐపీవోకు వస్తోన్న సంగతి తెలిసిందే. ఆన్ లైన్ ద్వారా క్లాసులు నిర్వహిస్తూ దేశ వ్యాప్తంగా స్టూడెంట్స్, పేరెంట్స్ కు బాగా దగ్గరైంది. ఈ సంస్థ ఇప్పుడు రూ. 4 వేల 600 కోట్ల విలువైన ఇనీషియల్ పబ్లిక్ ఆఫరింగ్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించడానికి ఉవ్విళ్లూరుతోంది. స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో లిస్ట్ కావడం ఈ కంపెనీకి ఒక పెద్ద అడుగైతే, ఇది స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో జాబితా చేయబడిన మొదటి భారతీయ విద్యా సాంకేతిక సంస్థ కావడం మరో విశేషం.ఐపీవోద్వారా నిధులు సమకూర్చుకుని ఎడ్యుటెక్ రంగంలో అగ్రగామిగా ఉండాలని ఫిజిక్స్ వాలా అనుకుంటోంది. ప్రతి వారం 9,500 గంటల విద్యా కంటెంట్ ని ఉత్పత్తి చేస్తూనే, భారతదేశంలోని 18,808 పిన్ కోడ్‌లలో విద్యార్థులను చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అధునాతన సాంకేతికతతో పాటు, విద్యార్థులకు మరింత మేలైన ఫీలింగ్ కలిగేలా ఆధారిత టీచింగ్ ఫెసిలిటీస్ ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఐపీవో ద్వారా సేకరించే నిధులతో ప్రపంచవ్యాప్తంగా విస్తరించి మరిన్ని దేశాలలో తమ సేవలు అందించాలని యోచిస్తోంది. వివిధ పరీక్షలకు విద్యార్థుల్ని సన్నద్ధం చేయడమే కాకుండా, ప్రపంచ వ్యాప్తంగా మరిన్ని కోర్సులను అందించాలని కూడా యోచిస్తోంది.కాన్ఫిడెన్షియల్ ప్రీ ఫైలింగ్ ద్వారా ఐపీవోకి వస్తామని సెబీని కోరిందీ సంస్థ. దీంతో ప్రాస్పెక్టస్ వివరాలను పబ్లిక్‌కు వెల్లడించకుండా నిలువరించేందుకు కంపెనీకి వీలుంటుంది. ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ, సూపర్‌మార్ట్ కంపెనీ విశాల్ మెగా మార్ట్ తరహాలో ఐపీవోకు గోప్యతా దరఖాస్తు విధానాన్ని ఎంచుకుంది. ప్రక్రియను నిర్వహించడానికి ఫిజిక్స్ వాలా సంస్థ కోటక్ మహీంద్రా క్యాపిటల్, యాక్సిస్ బ్యాంక్, మోర్గాన్, ఇంకా గోల్డ్‌మన్ సాచ్స్ వంటి ప్రధాన పెట్టుబడి బ్యాంకులుతో భాగస్వామ్యం కుదుర్చుకుంది.

పసిడి ప్రియులకు బ్యాడ్ న్యూస్.. ఇక బంగారం కొనగలమా..

న్యూఢిల్లీ-నవభూమి: బంగారం ధరలు రోజురోజుకూ చుక్కలు చూపిస్తున్నాయి. పసిడి కొనాలంటేనే ప్రజలు బెంతేలెత్తిపోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పటికే గోల్డ్ రేటు రికార్డు స్థాయికి చేరుకుని పసిడి ప్రియులకు షాక్ ఇచ్చింది. ఇటీవల జీవిత కాల గరిష్ఠానికి చేరిన బంగారం ధర స్వల్పంగా తగ్గుముఖం పట్టింది. అయినా గతేడాదితో పోలిస్తే ధర

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
11 హైదరాబాద్ ఆదివారం 23 మార్చి 2025

ఇంత దారుణం ఎన్నడూ చూడలేదు.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..

బెంగళూరు-నవభూమి: శాసనసభలో గందరగోళాన్ని జీర్ణించుకోలేకపోతున్నానని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కాంగ్రెస్ సీనియర్ సభ్యుడు బీఆర్ పాటిల్ పేర్కొన్నారు. శుక్రవారం శాసనసభలో గందరగోళం కొనసాగుతుండగానే స్పీకర్‌పై బీజేపీ సభ్యులు కాగితాలు విసిరారు. దీంతో స్పీకర్ పదినిమిషాలపాటు సభను వాయిదా వేశారు. ఇదే సమయంలోనే శాసనసభ నుంచి మీడియాపాయింట్‌కు వచ్చిన ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ మాట్లాడుతూ రాజీనామా చేస్తానన్నారు. సభలో ఇటువంటి గందరగోళ పరిస్థితిని గతంలో ఎన్నడూ చూడలేదన్నారు. స్పీకర్‌పై పేపర్లు వేయడం సరికాదన్నారు. ఇదే విషయమై సీఎం సిద్ధరామయ్య మీడియాతో మాట్లాడుతూ బీఆర్ పాటిల్ తనకు మిత్రుడని, ఆయనతో పిలిపించి మాట్లాడుతానన్నారు. కాగా బీఆర్ పాటిల్ కాంగ్రెస్ సీనియర్ నేత కలబురగి జిల్లా అళంద నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొన్ని నెలలకే పలువురి మంత్రుల తీరును తప్పుబట్టి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. మరోసారి సీనియర్లంటే గౌరవం లేకుండా పోతోందని, హోదాలో ఉండదలచుకోలేదన్నారు. దీంతో ఆయనకు సీఎం రాజకీయ సలహాదారుడి హోదాను గత ఏడాది కల్పించారు. ఇటీవలే ఆ హోదా వలన కూడా ప్రత్యేకత ఏదీ లేదని తిరగబడ్డారు. దీంతో మరోసారి బీఆర్ పాటిల్‌కు సలహాదారుడి నుంచి ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా కేబినెట్ హోదా కల్పించారు.

నారాయణమూర్తి 70 గంటల పని వ్యాఖ్యలపై తొలిసారి స్పందించిన సుధామూర్తి.. ఇంతకీ ఏమన్నారంటే..?

న్యూఢిల్లీ-నవభూమి: ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి చేసిన వ్యాఖ్యలు పెద్ద ఎత్తున చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. ఆయన వ్యాఖ్యలను కొందరు సమర్థించగా.. చాలా మంది వ్యతిరేకించారు. ఈ వ్యాఖ్యలపై నారాయణమూర్తి భార్య, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి తాజాగా తొలిసారి స్పందించారు. ఏదైనా పనిని అంకిత భావంతో చేయాలని సంకల్పించినప్పుడు సమయం ఎప్పుడూ పరిమితిగా మారదని వ్యాఖ్యానించారు. ఓ జాతీయ మీడియాతో సుధామూర్తి మాట్లాడారు. 'ఏదైనా పనిని అంకితభావంతో చేయాలని సంకల్పించినప్పుడు.. సమయం ఎప్పుడూ పరిమితిగా మారదు. నా భర్త డబ్బులు లేకున్నా ఇన్ఫోసిస్‌ను నిర్మించాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు అంకితభావం కలిగిన వ్యక్తులతో కలిసి 70 గంటలు, కొన్నిసార్లు అంతకంటే ఎక్కువ సమయం పనిచేసేవారు. అలా చేయడం వల్లే అది సాధ్యమైంది. పని గంటలు చూసుకుని ఉంటే.. ఇప్పుడు ఇన్ఫోసిస్ ఈ స్థాయికి చేరి ఉండేది కాదు' అంటూ చెప్పుకొచ్చారు. తన భర్త మాత్రమే కాకుండా.. ఈ సమాజంలో కొందరు జర్నలిస్టులు, వైద్యులు, ఇతర రంగాల్లోని వాళ్లు వారానికి 90 గంటలు కూడా పనిచేస్తున్నారని సుధామూర్తి పేర్కొన్నారు. కాగా, ప్రపంచ స్థాయిలో ఇతర దేశాలతో భారత్ పోటీ పడాలంటే యువతరం వారానికి 70 గంటలు పని చేయయాలని ఇన్ఫోసిస్ ఫౌండర్ ఎన్ఆర్ నారాయణ మూర్తి వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. 'ప్రపంచంలోకెల్లా భారత్‌లోనే ఉత్పాదకత అతి తక్కువ. ఉత్పత్తిలో మన పని మెరుగు పర్చుకోలేకపోయినా, ప్రభుత్వంలో కొంత స్థాయి వరకూ అవినీతి తగ్గించకపోయినా.. అద్భుతమైన ప్రగతి సాధించిన దేశాలతో మనం పోటీ పడలేం' అని నారాయణ మూర్తి స్పష్టం చేశారు. 'నా యువతరానికి నేను చేసే రిక్వెస్ట్ ఒకటే.. 'ఇది నా దేశం. నా దేశం కోసం నేను వారానికి 70 గంటలు పని చేస్తాను' అని తప్పనిసరిగా ప్రతిజ్ఞ చేయాలి- అని నారాయణ మూర్తి చెప్పారు.

జేజేపీ నేతను కాల్చి చంపిన దుండగులు

చండీగఢ్:నవభూమి: జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) నేతను దుండగులు కాల్చి చంపారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. హర్యానాలోని పానిపట్‌లో ఈ సంఘటన జరిగింది. శుక్రవారం సాయంత్రం పానిపట్‌లోని వికాస్ నగర్‌లో జేజేపీ నేత రవీందర్ మిన్నాపై కొందరు వ్యక్తులు కాల్పులు జరిపారు. తీవ్రంగా గాయపడిన ఆయన మరణించారు. ఈ కాల్పుల్లో మరో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. వారిని హాస్పిటల్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారూగా, కాల్పుల విషయం తెలిసిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పుల్లో మరణించిన జేజేపీ నేత రవీందర్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన హత్యకు కుటుంబ గొడవలు కారణమని పోలీసులు తెలిపారు. వివాదం పరిష్కారం కోసం సమావేశమైనప్పుడు ఘర్షణ చెలరేగిందని చెప్పారు. పారిపోయిన నిందితులను అరెస్ట్ చేసేందుకు పోలీస్ బృందాలను ఏర్పాటు చేసినట్లు పోలీస్ అధికారి వెల్లడించారు. 2024 హర్యానా అసెంబ్లీ ఎన్నికల్లో పానిపట్ సిటీ స్థానం నుంచి జేజేపీ అభ్యర్థిగా రవీందర్ పోటీ చేసి ఓడిపోయారు.

నియోజకవర్గాల పునర్విభజన న్యాయబద్ధంగా జరగాలి : సీఎం స్టాలిన్

చెన్నై- నవభూమి: లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై చర్చించేందుకు తమిళనాడు లోని అధికారపక్షం డీఎంకే శనివారం దక్షిణాది రాష్ట్రాల అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. ఆ రాష్ట్ర సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన చెన్నైలో నిర్వహించిన ఈ సమావేశానికి ఏడు రాష్ట్రాల రాజకీయ పార్టీల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడారు. నియోజకవర్గాల పునర్విభజన న్యాయబద్ధంగా జరిగే వరకూ తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రస్తుత జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదన్నారు. దీన్ని ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రజాప్రతినిధుల సంఖ్య తగ్గితే మన వాణిని వినిపించే శక్తి కూడా తగ్గిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రావాల్సిన నిధుల కోసం తీవ్రంగా పోరాడాల్సి వస్తుందన్నారు. 'మా నిరసన పునర్విభజనకు వ్యతిరేకంగా కాదు. న్యాయబద్ధంగా, పారదర్శకంగా డీలిమిటేషన్ చేయాలనేదే మా డిమాండ్. పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గిపోతే.. రాష్ట్రాలకు రావాల్సిన నిధుల కోసం పోరాటం చేయాల్సి వస్తుంది. అందుకే న్యాయబద్ధంగా పునర్విభజన జరగాలి' అని స్టాలిన్ అన్నారు.

చైనా దురాక్రమణను భారత్ ఎన్నటికీ అంగీకరించబోదు: కేంద్రం స్పష్టీకరణ

న్యూఢిల్లీ-నవభూమి: సరిహద్దుల్లో చైనా దుందుడుకు వ్యవహారశైలిపై భారత్ మరోసారి మండిపడింది. తమ భూభాగాన్ని చైనా ఆక్రమించడాన్ని భారత్ ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేసింది. కాగా, సరిహద్దు వివాదం పరిష్కారానికి చర్చల దిశగా ప్రయత్నాలు జరుగుతుంటే.. చైనా మాత్రం కవ్వింపులకు పాల్పడుతోంది. లధఖ్ భూభాగంలోని కొన్ని ప్రాంతాల్లో కౌంటీల (%జష్ట్రఅఱ ఎశీబఅ-అవం%)ను ఏర్పాటు చేస్తోంది. ఈ విషయంపై ప్రతిపక్ష సభ్యులు పార్లమెంట్‌లో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. చైనా కౌంటీల నిర్మాణంపై కేంద్రానికి సమాచారం ఉందా..? అంటూ అడిగారు. ఈ ప్రశ్నకు విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ లిఖితపూర్వకంగా సమాధానమిచ్చారు. కౌంటీలతో పాటు సరిహద్దు ప్రాంతాల్లో చైనా చేపడుతున్న అభివృద్ధి ప్రాజెక్టుల గురించి కూడా తమకు సమాచారం ఉందని వెల్లడించారు. భారత భూభాగాన్ని చైనా అక్రమంగా ఆక్రమించడాన్ని భారత ప్రభుత్వం ఎన్నటికీ అంగీకరించబోదని స్పష్టం చేశారు.

అలాంటి మహిళలు భర్తల నుంచి తాత్కాలిక భరణం కోరరాదు..: ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ-నవభూమి: బాగా చదువుకుని, గతంలో మంచి ఉద్యోగం చేసిన, ప్రస్తుతం ఉద్యోగం సంపాదించే అవకాశం కల్గిన మహిళలు విడాకుల సమయంలో వారి భర్తల నుంచి తాత్కాలిక భరణం కోరడం సబబు కాదని ఢిల్లీ హైకోర్టు అభిప్రాయం వ్యక్తం చేసింది. మనుషులు సోమరిగా ఉండడాన్ని చట్టం ఏమాత్రం ప్రోత్సహించదని తెలిపింది. అలాగే ఓ మహిళ భర్త నుంచి తాత్కాలిక భరణం కావాలంటూ వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. అంతేకాకుండా వెంటనే మంచి ఉద్యోగం కోసం ప్రయత్నించాలని ఆమెకు సూచించింది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం. 2019లో పెళ్లి చేసుకున్న ఓ జంట.. వివాహం తర్వాతా సింగపూర్‌కు వెళ్లిపోయింది. అయితే భర్త, అతడి కుటుంబ సభ్యులు వేధించడంతో భార్య.. 2021 ఫిబ్రవరి నెలలో తిరిగి భారత దేశానికి వచ్చేసింది. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పి మరీ విడాకుల కోసం దరఖాస్తు చేసుకుంది. అయితే తనకు ఉద్యోగం లేదని, తన పేరిట ఎలాంటి ఆస్తులు కూడా లేకపోవడంతో.. ప్రస్తుతం బంధువుల ఇంట్లో నివసిస్తున్నానని పిటిషన్‌లో వివరించింది. అందుకే తాత్కాలిక భరణం ఇప్పించాలంటూ ట్రయల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది.

దీంతో కోర్టు విచారణ చేపట్టగా.. ఆమె భర్త హాజరై షాకింగ్ కామెంట్లు చేశారు. ముఖ్యంగా తన భార్య ఆస్ట్రేలియాలో ఉన్నత విద్యను అభ్యసించిందని.. పెళ్లికి ముందు ఆమె అధిక వేతనం గల ఉద్యోగం చేసిందని చెప్పుకొచ్చారు. కేవలం నిరుద్యోగం ఆధారంగా తాత్కాలిక భరణం కోరడం.. చట్టాన్ని తప్పుదోవ పట్టించడం కిందకే వస్తుందని వివరించారు. ఇరు వైపుల వాదనలు విన్న న్యాయస్థానం షాకింగ్ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా భార్య వేసిన పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో తీవ్ర నిరాశకు గురైన భార్య ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. పిటిషన్ కొట్టివేస్తూ.. ఉద్యోగ ప్రయత్నాలు చేయాలని సూచన!

ఈక్రమంలోనే నేడు గురువారం రోజు విచారణ జరిపిన ఢిల్లీ హైకోర్టు.. ట్రయల్ కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఉన్నత విద్యార్హత, మంచి ఉద్యోగం సంపాదించే అవకాశం కల్గిన మహిళలు.. విడాకుల సమయంలో భర్తల నుంచి తాత్కాలిక భరణం కోరడం సబబు కాదని అభిప్రాయం వ్యక్తం చేసింది. నిరక్షరాస్యులు అయిన మహిళల మాదిరిగా భర్తలపై ఆధార పడడం తగదని హితవు పలికింది. ప్రపంచ జ్ఞానం కల్గిన అమ్మాయిలు సాధికారతకు ప్రయత్నించాలని సూచించింది. పిటిషన్‌ను కొట్టివేస్తూ.. మనుషులు సోమరిగా ఉండడాన్ని చట్టం ఏమాత్రం ప్రోత్సహించదని జస్టిస్ చంద్రధారీ సింగ్ వెల్లడించారు.

హైకోర్టు న్యాయమూర్తి బంగ్లాలో భారీగా నగదు.. జడ్జికి షాకిచ్చిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ-నవభూమి: ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో హోలీ రోజున భారీగా నగదు బయటపడింది. ఆ రోజున ఆయన బంగ్లాలో అగ్నిప్రమాదం సంభవించడంతో పోలీసులు, ఫైర్ రెస్క్యూ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పుతుండగా.. భారీ ఎత్తున కరెన్సీ కట్టలు వెలుగుచూశాయి. ఇది లెక్కలో చూపని నగదుగా అధికారులు గుర్తించారు. దీనిని తీవ్రంగా పరగణించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా. అత్యవసరంగా కొలీజియం సమావేశం ఏర్పాటుచేశారు. ఆయనను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కొలీజియం నిర్ణయించింది. 2021లో ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన జస్టిస్ వర్మ.. దీనికి ముందు అలహాబాద్ హైకోర్టు జడ్జిగా ఉన్నారు. కాగా, కొలీజియంలో కొంతమంది సభ్యులు... ఆయన కేవలం బదిలీ సరిపోదని అభిప్రాయపడ్డారు. న్యాయవ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీనామా చేయాలని కోరడమో, అంతర్గత విచారణ నిర్వహించాలనే ప్రతిపాదనలు వచ్చాయి. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో జస్టిస్ యశ్వంత్ వర్మ.. ఢిల్లీలో లేరు. ప్రమాదం గురించి ఆయన కుటుంబసభ్యులే ఎమర్జెన్సీ సేవల విభాగానికి సమాచారం ఇచ్చారు. అయితే, తన బంగ్లాలో నగదు లభ్యం కావడంపై ఆయన ఇప్పటి వరకూ స్పందించకపోవడం గమనార్హం. అంతేకాదు, శుక్రవారం ఆయన కోర్టుకు కూడా రాలేదని, సెలవుపై ఉన్నారని విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. ఈ సంఘటన ప్రతిఒక్కర్నీ ఆశ్చర్యానికి గురిచేసిందని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీకే ఉపాధ్యాయ్ వ్యాఖ్యానించారు. సీనియర్ న్యాయవాది అరుణ్ భరద్వాజ్ దీని గురించి ప్రస్తావించగా... చీఫ్ జస్టిస్ పై విధంగా స్పందించారు. ఇదిలా ఉండగా, 2008 ఆగస్టు 13న పంజాబ్-హర్యానా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్ జిత్ కౌర్ నివాసంలో రూ.15 లక్షల నగదుతో ఉన్న బాక్స్ కలకలం రేపింది. ఈ నగదు మరో న్యాయమూర్తి జస్టిస్ నిర్మల్ యాదవ్‌కు ఇవ్వాల్సింది కానీ పొరపాటున జస్టిస్ కౌర్ ఇంటి వద్ద పెట్టినట్లు దర్యాప్తులో తేలింది. సీబీఐ విచారణ అనంతరం 2011లో ఉత్తరాఖండ్ హైకోర్టు న్యాయమూర్తి నిర్మల్ యాదవ్‌పై అభియోగాలు నమోదయ్యాయి. కాగా, జస్టిస్ వర్మ వ్యవహారం న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై మరిన్ని చర్యలు తీసుకుంటారా? అన్నది ఆసక్తికరంగా మారింది. అయితే, హైకోర్టు న్యాయమూర్తిపై చర్యలకు సంబంధించిన 1999లో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను జారీచేసింది. వీటిని అనుసరించి సుప్రీంకోర్టు జడ్జి నేతృత్వంలో ఓ కమిటీ విచారణ జరిపి.. నివేదిక ఇస్తుంది. దీని ఆధారంగా చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.

హనీట్రాప్ గొడవతో అసెంబ్లీలో రచ్చ.. 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలు సస్పెండ్

న్యూఢిల్లీ-నవభూమి: గత కొంత కాలంగా కర్ణాటక అసెంబ్లీ సమావేశాల్లో హనీట్రాప్ అంశం తీవ్ర చర్చకు వస్తోంది. ముఖ్యంగా ఈరోజు జరిగిన చర్చల్లో బీజేపీ నేతలు మరోసారి హనీట్రాప్ అంశాన్ని లేవనెత్తారు. దీనిపై సీబీఐ దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అంతా ఒకేసారి మాట్లాడడం, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేయడంతో.. గందరగోళం ఏర్పడింది. దీంతో సభా కార్యక్రమాలకు అడ్డు పడిన 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధించారు స్పీకర్. ముఖ్యంగా వీరిని 6 నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ పూర్తి వివరాలు మీకోసం. కర్ణాటకకు చెందిన 48 మంది ఎమ్మెల్యేలు హనీ ట్రాప్‌లో చిక్కుకుపోయారంటూ ఆ రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజన్న ఇటీవల అసెంబ్లీలో ప్రకటించడగా.. తీవ్ర దుమారం రేగుతోంది. వీరందరికి సంబంధించిన అసభ్య వీడియోలు, సంభాషణలు.. సీడీలు, పెన్‌డ్రైవ్‌లలో ఉన్నాయని చెప్పారు. ఇది ఏ ఒక్క పార్టీకో పరిమితమైన విషయం కాదని.. అధికార పక్షం సహా విపక్షాలకు చెందిన శాసన సభ్యులు సైతం ఇందులో బాధితులుగా ఉన్నారని తేల్చి చెప్పారు. ఈయన మాట్లాడేకంటే ముందే మంత్రి సతీష్ జార్కిహొళీ మాట్లాడుతూ.. ఓ మంత్రి రెండుసార్లు హనీ ట్రాప్ యత్నం జరిగిన విషయం నిజమేనని తేల్చి చెప్పారు. అయితే ఇది కర్ణాటకకు కొత్త కాదని.. రాజకీయ ప్రయోజనాల కోసం కొంత మంది వీటిని వాడుకుంటున్నారని పేర్కొన్నారు. వీరిద్దరూ చేసిన కామెంట్లపై.. సమావేశాలు జరిగిన ప్రతీసారి చర్చ సాగుతోంది. ముఖ్యంగా ఈరోజు శాసన సభ్యుల జీతాల పెంపు, ముస్లిం కోటా బిల్లును పాస్ చేయడంతో బీజేపీ నేతలు మరింత గొడవ చేశారు. హనీ ట్రాప్ అంశాన్ని పక్కన పెట్టి బిల్లులు పాస్ చేయడం సరికాదంటూనే.. ఈ అంశంపై సీబీఐ దర్యాప్తు చేయించాలని కోరారు. ఇలా అసెంబ్లీలో గందరగోళం కొనసాగింది. దీంతో సభా కార్యక్రమాలకు అడ్డు పడిన 18 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై సస్పెన్షన్ విధిస్తూ.. స్పీకర్ తీర్మానం చేశారు. 6 నెలల పాటు వారిని సస్పెండ్ చేస్తున్నట్లు వివరించారు. దీంతో వారిని వెంటనే మార్షల్స్ బలవంతంగా బయటకు పంపించారు. సస్పెన్షన్ ఉత్తర్వుల ప్రకారం.. ఈ 18 మంది ఎమ్మెల్యేలు అసెంబ్లీ హాల్, లాబీ, గ్యాలరీలోకి రాకూడదు. వారు ఏ స్టాండింగ్ కమిటీ సమావేశంలో కూడా పాల్గొనకూడదు. అసెంబ్లీ ఎజెండాలో వారి పేర్లతో ఎలాంటి అంశం లిస్ట్ కాకూడదు. అంతేకాకుండా ఈ 6 నెలల పాటు వారికి రోజువారీ జీత భత్యాలు కూడా పొందలేరు.

బాలికపై రేప్ పరస్పర సమ్మతితో కూడిన బంధమెలా అవుతుంది..: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ-నవభూమి: మైనర్‌పై అత్యాచారానికి పాల్పడిన నిందితుడికి బెయిల్ కోసం ఓ న్యాయవాది సుప్రీం కోర్టులో పిటిషన్ వేశారు. అయితే అందులో అత్యాచారాన్ని పరస్పర సమ్మతితో కూడిన బంధంగా అభివర్ణించారు. దీనిపై గురువారం రోజు విచారణ చేపట్టిన న్యాయస్థానం లాయర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. మైనర్ బాలికపై అత్యాచారం జరిగింతే.. పరస్పర బంధం ఎలా అవుతుందని ప్రశ్నించింది. మీ పిటిషన్ చదివాకా మేము మానసికంగా అస్వస్థతకు గురయ్యామంటూ న్యాయమూర్తులు చెప్పగా.. అంతా షాక్ అయ్యారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మీకోసం.

పిటిషన్ చూసిన వెంటనే.. దాన్ని వేసిన న్యాయవాదిపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ముఖ్యంగా జస్టిస్ ఎన్. కోటీశ్వర్ సింగ్, జస్టిస్ సూర్యకాంత్‌ల ధర్మాసనం న్యాయవాదితో మాట్లాడుతూ షాకింగ్ కామెంట్లు చేసింది. మీ పిటిషన్ చదివిన తర్వాత మేము మానసికంగా అస్వస్థతకు గురయ్యామని వివరించింది. అత్యాచారానికి గురైన బాలిక వసయు ఎంత అని అడుగుతూనే.. మీరే పిటిషన్‌లో బాధితురాలు మైనర్ అని తెలిపారని గుర్తు చేసింది. కానీ ప్రతీ పేరాలో అత్యాచారాన్ని పరస్పర సమ్మతితో బందం అని రాశారని మండిపడింది. పిటిషన్ మొత్తంలో 20 సార్లు పరస్పర బంధం అని చెప్పారని.. దానికి అర్థం ఏంటో మీరే వివరించాలంటూ ఫైర్ అయింది. అంతటితో ఆగకుండా అసలు మీకు చట్టానికి సంబంధించిన ఓనమాలు అయినా తెలుసా అంటూ ప్రశ్నించింది. మీరు నిజంగానే అడ్వకేట్ ఆన్ రికార్డా (ఏఓఆర్) అని లాయర్‌ను నిలదీశారు. సుప్రీం కోర్టులో అభ్యర్థనలను దాఖలు చేసే అధికారం కేవలం ఏఓఆర్‌లకే ఉంటుందన్న న్యాయమూర్తులు.. వీరికి అత్యున్నత న్యాయస్థానమే పరీక్షలు పెడుతుంటుందని గుర్తు చేశారు. అసలు ఇలాంటి వాళ్లు ఏఓఆర్ లుగా ఎలా అర్హత సాధిస్తున్నారని జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్, జస్టిస్ సూర్యకాంత్ ధర్మాసనం అడిగింది. అలాగే భవిష్యత్తులో 8 నెలల చిన్నారిపై అత్యాచారం జరిగినా.. మీరు సమ్మతితో కూడిన సంబంధమే అనేలా ఉన్నారంటూ పేర్కొంది. మీకు న్యాయ శాస్త్రంలో ప్రాథమిక సూత్రాలు కూడా తెలియట్లేవంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. దీంతో చేసేదేమీ లేక సదరు న్యాయవాది ధర్మాసనానికి క్షమాపణ చెప్పారు. అనంతరం అత్యున్నత న్యాయస్థానం బెయిల్ పిటిషన్‌పై పోలీసులు, ఇతరులకు నోటీసులు జారీ చేసింది.

విమానాలు సమయానికి రావట్లేదు.. ఎయిర్ ఇండియాపై సుప్రియా సూలే అసహనం

న్యూఢిల్లీ-నవభూమి: దేశీయ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా సేవలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొన్న ఈ మధ్య విమానంలో విరిగిపోయిన సీటును తనకు కేటాయించారంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఎయిర్ ఇండియాపై మండిపడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా ఎయిర్ ఇండియా సేవలపై పలువురు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజాగా ఎన్సీపీ ఎంపీ సుప్రియా సూలే సైతం అసహనం వ్యక్తం చేశారు. ఎయిర్ ఇండియా విమానాలు సమయానికి రావట్లేదని ఆమె ఆరోపించారు. తాను గంటలకుపైగా వేచి ఉండాల్సి వచ్చిందంటూ అసహనం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. 'ఎయిర్ ఇండియా విమానాలు నిరంతరం ఆలస్యం అవుతున్నాయి. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. మేం ప్రీమియం ఛార్జీలు చెల్లిస్తాము.. అయినప్పటికీ విమానాలు సమయానికి రావు. ఆలస్యం కారణంగా పిల్లలు, సీనియర్ సిటిజన్స్, నిపుణులు ఇలా ఎంతో మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను ఎయిర్ ఇండియా సంస్థకు చెందిన విమానంలో ప్రయాణించా. దీని కోసం గంట 19 నిమిషాలు వేచి చూడాల్సి వచ్చింది. ఇలాంటి జాప్యాలు పునరావృతం కాకుండా ఆయా సంస్థలు బాధ్యతగా వ్యవహరించాలి. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి. విమానయాన సంస్థలు జవాబుదారీతనంతో వ్యవహరించేలా కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి చర్యలు తీసుకోవాలి' అని ఆమె ఎక్స్ పోస్ట్‌లో రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ పోస్ట్ వైరల్ అవుతోంది.

అమెరికా చట్టాలకు కట్టుబడి ఉండండి.. విద్యార్థులకు భారత్ కీలక సూచన

న్యూఢిల్లీ-నవభూమి: రెండోసారి అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్ అక్రమ వలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న విషయం తెలిసిందే. ఎలాంటి అనుమానాలు వచ్చినా దేశం నుంచి బహిష్కరిస్తున్నారు. హమాస్‌తో సంబంధాలు ఉన్నాయన్న అనుమానంతో ఇటీవలే భారతీయ పరిశోధకుడు బాదర్ ఖాన్ సూరిపై అమెరికా బహిష్కరణ వేటు వేసిన విషయం తెలిసిందే. అంతకుముందు మరో విద్యార్థిని రంజిని శ్రీనివాసన్‌ను కూడా బహిష్కరించింది. ఈ నేపథ్యంలో భారత్ అప్రమత్తమైంది. ఈ మేరకు అమెరికాలోని భారతీయ విద్యార్థులకు కేంద్రం కీలక సూచనలు చేసింది. యూఎస్‌లోని భారతీయ విద్యార్థులు అక్కడ ప్రభుత్వ చట్టాలకు కట్టుబడి ఉండాలని సూచించింది. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అమెరికాలోని భారత ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించింది. ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలు విద్యార్థులు సాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. వీసాలు, వలస విధానాలపై నిర్ణయాలు పూర్తిగా ఆయా దేశాల విచక్షణాధికారానికి సంబంధించినవిగా పేర్కొంది. వాటిని పాటించాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని స్పష్టం చేసింది.

కంపెనీల్లో 50% కోడింగ్ ఏఐతోనే టెక్ కొలువులకు ఏఐ నైపుణ్యం కీలకం



న్యూఢిల్లీ-నవభూమి: టెక్ ఉద్యోగాల్లో చేరేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టూల్స్ వినియోగంలో ప్రావీణ్యం సాధించాలని 'చాట్ జీపీటీ' మాతృ సంస్థ 'ఓపెన్ ఏఐ' సీఈవో శామ్ ఆల్ట్‌మన్ కీలక సూచన చేశారు. ఇప్పటికే చాలా కంపెనీల్లో కోడింగ్ పనుల కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తున్నారని, ప్రస్తుతం అనేక కంపెనీల్లో 50%పైగా కోడింగ్ పనులను ఏఐ నిర్వహిస్తోందని ఆయన ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. టెక్ ఉద్యోగాల్లో చేరాలనుకునే విద్యార్థులంతా ఏఐతో కలిసి పనిచేయడం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. లేకుంటే జాబ్ మార్కెట్‌లో నిలదొక్కుకోవడం కష్టమవుతుందని హెచ్చరించారు. ఏఐలో నైపుణ్యం సాధించిన వారికి దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. మానవ కోడర్ల స్థానంలో ఏఐని ప్రవేశపెట్టాలన్న ఆలోచన నానాటికీ విస్తృతమవుతోందని, దీనికి అనేక మంది పారిశ్రామికవేత్తలు ప్రాధాన్యమిస్తున్నారని తెలిపారు. మరో 6 నెలల్లో 90 శాతం కోడిం

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
12 హైదరాబాద్ ఆదివారం 23 । మార్చి । 2025

ఐశ్వర్యరాయ్ కాల్ చేస్తే ఒత్తిడికి గురవుతాను అంటూ అభిషేక్ షాకింగ్ కామెంట్స్



బాలీవుడ్ క్రేజీ జంటలలో ఐశ్వర్యరాయ్- అభిషేక్ బచ్చన్ జంట ఒకటి. ఐశ్వర్య రాయ్, అభిషేక్ బచ్చన్ పెళ్లి 2007 ఏప్రిల్ 20న జరిగింది. వీరికి 2012 లో ఆధ్య అనే కూతురు కూడా జన్మించింది. త్వరలో ఆద్యని కూడా ఇండస్ట్రీకి తీసుకురానున్నారు అనే టాక్ నడుస్తుంది. ఇక ఈ మధ్య వీరు విడాకులు తీసుకోబోతున్నారంటు పుకార్లు బాలీవుడ్ అంతటా వ్యాపించగా, దానిపై అభిషేక్ బచ్చన్, ఐశ్వర్యరాయ్‌లు స్పందించింది లేదు. కాకపోతే ఇటీవల జరిగిన కొన్ని వేడుకలలో అభిషేక్ బచ్చన్,ఐశ్వర్యరాయ్ జంటగా కనిపించే సరికి పుకార్లకి పులిస్టాప్ పడింది.

ఇక ఇదిలా ఉంటే అభిషేక్ బచ్చన్ నటించిన ఐ వాంట్ టూ టాక్ చిత్రానికి గాను ఆయనకి ఉత్తమ నటుడి అవార్డ్ దక్కింది. ఈ అవకాశం ఇచ్చిన చిత్ర బృందానికి ధన్యవాదాలు తెలియజేస్తూ దర్శకుడి వల్లే తనకి ఈ అవార్డ్ వచ్చిందని అన్నారు. అనంతరం తోటి నటుడు, షో హెూస్ట్ అర్జున్ కపూర్‌తో సరదాగా ముచ్చటించారు అభిషేక్ బచ్చన్.

అర్జున్ కపూర్ మాట్లాడుతూ.. నేను మీతో మాట్లాడాలి అంటూ ఎవరు ఫోన్ చేస్తే మీకు కంగారు వస్తుందని అభిషేక్‌ని ప్రశ్నించాడు. దానికి అభిషేక్ నవ్వుతూ సమాధానం ఇచ్చాడు. నీకు ఇంకా పెళ్లి కాలేదు కాబట్టి ఇలాంటి ప్రశ్నలు అడుగుతున్నావు. ఒకసారి పెళ్లైతే ఈ ప్రశ్నకి నీ దగ్గర కూడా ఓ సమాధానం ఉంటుంది. భార్య ఫోన్ చేసి మీతో మాట్లాడాలి అంటే కంగారు పడతాం, ఆ ఫోన్ కాల్స్ మనల్ని ఒత్తిడికి గురవుతాయి అంటూ సరదాగా కామెంట్ చేశారు అభిషేక్.

బిజినెస్ మేనేజ్మెంట్ కోసం వచ్చిన భాగ్యశ్రీ...!

గత ఏడాది రవితేజతో కలిసి 'మిస్టర్ బచ్చన్' సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మంచి గుర్తింపు దక్కించుకుంది. టాలీవుడ్‌లో మొదటి సినిమా ఫ్లాప్ అయినా అందంతో అందరి దృష్టిని ఆకర్షించింది. టాలీవుడ్‌కి మరో మంచి హీరోయిన్ దొరికింది అనిపించుకుంది. మిస్టర్ బచ్చన్ ఫలితంతో సంబంధం లేకుండా ఏకంగా రౌడీ స్టార్ విజయ్ దేవరకొండకు జోడీగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో సినిమాను చేసే అవకాశం దక్కించుకుంది. విజయ్ దేవరకొండ హీరోగా రూపొందుతున్న 'కింగ్డమ్' సినిమాతో భాగ్యశ్రీ బోర్సే మరోసారి తన అదృష్టం పరీక్షించుకునేందుకు రెడీ అవుతోంది. కింగ్డమ్ హిట్ అయితే భాగ్యశ్రీ టాలీవుడ్‌లో మోస్ట్ బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. మహారాష్ట్రలో పుట్టిన భాగ్యశ్రీ బోర్సే చిన్న వయసులోనే ఫ్యామిలీతో కలిసి సౌత్ ఆఫ్రికా వెళ్లింది. నైజీరియాలోని లాగోస్‌లో భాగ్యశ్రీ చదువుకుంది. బిజినెస్ మేనేజ్మెంట్ చేయడం కోసం ఇండియాకు వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మోడలింగ్‌పై ఆసక్తిని కనబర్చింది. పలు యాడ్‌లలో నటించిన భాగ్యశ్రీకి డైరీ మిల్క్ చాక్లెట్ యాడ్ మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. ఆ యాడ్‌తో వచ్చిన గుర్తింపుతో బాలీవుడ్ సినిమాలో నటించే అవకాశం దక్కించుకుంది. అక్కడ నుంచి టాలీవుడ్‌లో ఈ అమ్మడు అడుగు పెట్టింది. మొత్తానికి బిజినెస్ మేనేజ్మెంట్ చేసేందుకు సౌత్ ఆఫ్రికా నుంచి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే మోడలింగ్‌పై ఆసక్తితో యాడ్స్‌లో నటించి, అటు నుంచి ఏకంగా సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. హరీష్ శంకర్ ఈమెను ఒక యాడ్‌లో చూసి రవితేజకు జోడీగా నటింపజేశాడని సమాచారం. రవితేజ సరసన నటించడంతో మంచి గుర్తింపు దక్కించుకున్నప్పటికీ, ఆ సినిమా సక్సెస్ కాకపోవడంతో ఎక్కువ ఆఫర్లు రాలేదు. అయితే విజయ్ దేవరకొండతో ఈమె కలిసి నటిస్తున్న కింగ్డమ్ పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఆ సినిమా మంచి విజయాన్ని సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయని ఇటీవల విడుదలైన టీజర్ చెప్పకనే చెబుతోంది. కింగ్డమ్ సినిమా కనుక సూపర్ హిట్ అయితే కచ్చితంగా టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్, బాలీవుడ్‌లోనూ భాగ్యశ్రీ బోర్సే బిజీ హీరోయిన్‌గా మారే అవకాశాలు ఉన్నాయి. కింగ్డమ్ సినిమాను పాన్ ఇండియా రేంజ్‌లో భారీ ఎత్తున విడుదల చేయడం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏకంగా ప్రభాస్ రికార్డునే కొట్టేశాడు ఎంతో మంది హీరోయిన్స్ ఇండస్ట్రీలో చాలా కష్టపడి ఎంట్రీ ఇస్తారు. అంతకు ముందు అవకాశాల కోసం చాలా కష్టాలు పడుతారు. కానీ భాగ్యశ్రీ మాత్రం అనూహ్యంగా హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. బిజినెస్ మేనేజ్మెంట్ కోసం ఇండియాకు వచ్చిన భాగ్యశ్రీ మోడలింగ్‌పై ఆసక్తిని కనబర్చడం, ఆ తర్వాత సినిమాల్లో పిలిచి మరీ అవకాశాలు ఇవ్వడం అదృష్టం గా భావించవచ్చు. అదే అదృష్టంతో కింగ్డమ్ హిట్ అయితే భాగ్యశ్రీ భాగ్యరేఖ మారినట్లే అనే అభిప్రాయంను సినీ వర్గాల వారు వ్యక్తం చేస్తున్నారు. భాగ్యశ్రీ ముందు ముందు టాలీవుడ్ యంగ్ స్టార్ హీరోలకు జోడీగా నటించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటూ ఆమె అందాన్ని అభిమానించే వారు అంటున్నారు.

'లుసిఫర్ 2' సినిమాకి మోహన్‌లాల్ పారితోషికం ఎంతంటే.!

మలయాళ నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ దర్శకత్వంలో వస్తున్న తాజా చిత్రం ఎల్2 ఎంపురాన్. బ్లాక్ బస్టర్ చిత్రం లుసిఫర్ సినిమాకి ఈ చిత్రం సీక్వెల్‌గా వస్తుంది. మలయాళీ సూపర్ స్టార్ మోహన్ లాల్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా.. మంజు వారియర్ టోవినో థామస్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా వరుస ప్రమోషన్స్‌లో పాల్గొంటున్నాడు పృథ్వీరాజ్. అయితే ఈ సినిమాకు మోహన్ లాల్ తీసుకున్న పారితోషికం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు పృథ్వీరాజ్.ఆయన మాట్లాడుతూ.. లల్లెట్టన్ (మోహన్‌లాల్) వలనే ఈ సినిమా సాధ్యమైంది. మోహన్‌లాల్ ఈ చిత్రం కోసం చాలా కష్టపడ్డాడు. ఒక దర్శకుడిగా, నేను నిర్మాతల గురించి ప్రతి క్షణం ఆలోచిస్తాను. మనం ఖర్చు చేసే ప్రతి రూపాయికి విలువ ఇవ్వాలని భావిస్తాను. 'లూసిఫర్ 2: ఎంపురాన్' కోసం మోహన్‌లాల్ ఒక్క పైసా కూడా రెమ్యూనరేషన్ తీసుకోలేదు. ఆయన పారితోషికం వదులుకోవడం వల్లే ఈ సినిమా తెరకెక్కిందని చెప్పడంలో సందేహం లేదు. ఆయన రెమ్యూనరేషన్‌ను కూడా సినిమా నిర్మాణానికి ఉపయోగించాం. స్క్రీన్‌పై చూస్తే ఆ విషయం మీకు స్పష్టంగా అర్థమవుతుంది. గేమ్ ఆఫ్ థోర్న్స్ నటుడు జెరోమ్ ఫ్లిన్‌తో పాటు చాలా మంది విదేశీ నటులు ఇందులో పాల్గొన్నారు. వారంతా సినిమాకి చాలా సహకారం అందించారంటూ పృథ్వీరాజ్ చెప్పుకొచ్చాడు.

నిహారిక పాదాలు ఏంటి ఇలా అయిపోయాయి..

టేక్ కేర్ అంటున్న నెటిజన్స్

దాదాపు డజను మంది హీరోలున్న మెగా కాంపౌండ్ నుంచి సోలో హీరోయిన్‌గా వచ్చిన అందాల ముద్దుగుమ్మ నిహారిక. యాంకర్‌గా పరిచయమై ఆ తర్వాత హీరోయిన్‌గా తెలుగు ప్రేక్షకులని పలకరించింది. ఒక మనసు చిత్రంతో హీరోయిన్‌గా మారిన నిహారిక ఆ తర్వాత పలు సినిమాలు చేయగా, ఏ ఒక్క సినిమా కూడా మంచి ఫలితాన్ని అందుకోలేకపోయింది. దీంతో నిహారిక హీరోయిన్ గా కాకుండా నిర్మాణ రంగం వైపు వేసి సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా నిలిచారు. మంచి కంటెంట్‌తో , తక్కువ బడ్జెట్‌తో సినిమాలు చేస్తూ హిట్లు కొడుతూ విమర్శల ప్రశంసలు దక్కించుకుంటుంది.నిహారిక ముద్దపప్పు అవకాయ్, నాన్న కూచి, మ్యాడ్ హౌస్ , ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ, హాలో వరల్డ్, బెంచ్ లైఫ్ వంటి వెబ్ సిరీస్‌లు నిర్మించి మంచి అభిరుచి గల నిర్మాతగా పేరు తెచ్చుకుంది. ఇక గత ఏడాది కమిటీ కుర్రోళ్లు అనే సినిమాను నిర్మించారు. రూ. 10 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ. 25 కోట్లు రాబట్టి తొలి ప్రయత్నంలోనే నిహారిక నిర్మాతగా మంచి సక్సెస్ దక్కేలా చేసింది. ఇక ప్రస్తుతం వాట్ ది ఫిష్ అనే సినిమాను నిర్మిస్తున్నారు నిహారిక కొణిదెల. ఇక ఈ అమ్మడు నిర్మాతగా రాణిస్తూనే హీరోయిన్‌గాను మంచి హిట్ కోసం ప్రయత్నిస్తుంది. మలయాళ మూవీ మద్రాస్ కారన్‌లో నిహారిక హీరోయిన్‌గా నటించగా, ఈ చిత్రానికి వాలి మోహన్ దాస్ దర్శకత్వం వహించారు.సినిమాలతో ఎంత బిజీగా ఉన్న నిహారిక సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తనకి సంబంధించిన విషయాలని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టింది. ఇందులో రిజల్ట్ ఆఫ్ గ్రేస్ క్లాస్..థ్యాంక్యూ అంటూ శరన్ జిత్ కౌర్‌ని ట్యాగ్ చేసింది. అలానే తన కాళ్లపై మచ్చలతో ఉన్న పిక్ కూడా షేర్ చేసింది. అంటే నాట్యం నేర్చుకునే క్రమంలో నిహారిక గజ్జలు కట్టుకోవడం వలన తన పాదాలు ఇలా అయినట్టు నిహారిక తన పోస్ట్ ద్వారా వెల్లడించినట్టు అర్థమవుతుంది. ఈ పిక్ చూసిన నెటిజన్స్ జాగ్రత్త, టేక్ కేర్ అంటూ కామెంట్స్ పెడుతున్నారు.

ప్రభాస్‌కి అన్నయ్య అతడే అయితే సంచలనమే!

పాన్ ఇండియాలో ప్రభాస్ ఎంత పెద్ద స్టార్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. అతడి కటౌట్ కూడా అలాంటిం దే. అందుకే ఇండియాలో ఎంత మంది స్టార్లు ఉన్నా? ప్రభాస్ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. అతడు పాన్ ఇండియాకి కనెక్ట్ అవ్వడానికి కూడా ప్రధాన కారణం ఆ కాటౌట్ కూడా ఒకటి. సాహెూ చిత్రం సౌత్‌లో ఫెయిలైనా నార్త్ మార్కెట్ లో మాత్రం సంచలన వసూళ్లు రాబట్టినప్పుడు మరోసారి డార్లింగ్ స్టామినా ఏంటన్నది అర్థమైంది. అటుపై సలార్, కల్కి 2898 లాంటి బ్లాక్ బస్టర్లతో మరింత స్ట్రాంగ్ అయ్యాడు. ఇప్పుడా భారీ కటౌట్ తో సంచలన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ చిత్రానికి రంగం సిద్ధం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ కాఫ్ గా కనిపించనున్నాడు. సందీప్ మార్క్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ఇందులో నెక్స్ట్ లెవల్ యాక్షన్ ఉంటుందని ఇప్పటికే హింట్ కూడా ఇచ్చేసాడు. మరి అలాంటి కంటెంట్ లో సంజయ్ దత్ కూడా భాగమైతే ఎలా ఉంటుంది? అందులోనూ ప్రభాస్ కి అన్నయ్య పాత్రలో ఖల్ నాయక్ కనిపిస్తే ఇంకెలా ఉంటుంది? వెండి తెరపై అది అద్భుతమే కదా. ఇప్పుడా ఛాన్స్ తీసుకోవడానికి సందీప్ రెడ్డి వంగా సిద్ధంగా ఉన్నట్లు సన్నిహితుల సమాచారం. ప్రభాస్ కి అన్నయ్య పాత్రలో సంజయ్ దత్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ప్రభాస్ వయసు..కటౌట్ ఆధారంగా సంజయ్ దత్ అయితే పక్కాగా సరితూగుతాడని సందీప్ భావిస్తు న్నాడుట. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇప్పటికే సంజయ్ దత్ సౌత్ సినిమాల్లో నటించడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే. కేజీఎఫ్ లో విలన్ గా నటించాడు. లియో, డబుల్ ఇస్మార్ట్ లోనూ నటించాడు. ఈ చిత్రాలు సౌత్ లో ఆయనకు మంచి క్రేజ్ ని తీసుకొచ్చినవే.

అభిమానుల కోసం ఆయనే మారాడా?

డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పబ్లిక్ మీటింగ్ లకు వెళ్తే ఎలాంటి పరిస్థితి ఎదుర్కొంటున్నారో తెలిసిందే. అభిమానులంతా ఓజీ ఓజీఅంటూ నానా హంగామా క్రియేట్ చేస్తున్నారు. ఆయన ప్రజా సమస్యల పై...ప్రభుత్వ పాలనపైనా మాట్లాడుతుంటే అంటూ కింద నుంచి కేకలేస్తున్నారు. దీంతో ఆయన కూడా రెండు...మూడు సందర్భాల్లో తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేసారు. మీరు మారరా? అంటూ ఒకసారి సమయం..సందర్భం లేదా అంటూ మరోసారి కస్సుమన్నారు. అయినా అభిమానుల్లో ఎలాంటి మార్పు రాలేదు. తాజాగా కర్నూల్ లో జరిగిన కార్యక్రమంలో పవన్ కళ్యాణ్ మాట్లాడుతుండగా మళ్లీ నినాదాలు అందుకున్నారు. మీరు మారరా అంటూ పీకే స్వరం అందుకున్నారు. అయితే ఈసారి ఆయన చిరునవ్వుతో మారరా అన్నారు. ఇక్కడిదే సర్ ప్రైజ్. ఎప్పుడూ చిరాకు పడే పవన్ కళ్యాణ్ ఈసారి మాత్రం నవ్వుతూ స్వాగతించడం ఇంట్రెస్టింగ్. అభిమానులు ఎలాగూ మారరు..తనే మారాలనుకున్నారో ఏమో! అందుకే ఇలా. ఏదీ ఏమైనా పవన్ నవ్వడం అభిమానుల్లో సంతోషాన్ని నింపింది. అభిమానుల కోసమైనా పీకే సినిమాలు చేస్తారు? అన్న ధీమా వాళ్లలో మళ్లీ మొదలైంది. ఇక పవన్ కళ్యాణ్ షూటింగ్ లు పూర్తి చేయాల్సిన సినిమాలు రెండు ఉన్న సంగతి తెలిసిందే. హరిహరవీరమల్లు కోసం నాలుగు రోజులు డేట్లు ఇవ్వాలి. ఇస్తే షూటింగ్ ముగించి మే 9న రిలీజ్ చేయాలని మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే ఓజీ షూటింగ్ కూడా ముగింపు దశలోనే ఉంది. పవన్ కళ్యాణ్ అందుబాటులో లేకపోవడంతో పూర్తి కాని పరిస్థితి ఏర్పడింది. వాళ్లకు డేట్లు ఇస్తే వీలైనంత త్వరగా అన్ని పనులు పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని చూస్తున్నారు.

బెట్టింగ్ యాప్ ప్రమోట్ చేసిన హైదరాబాద్ మెట్రో.. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన అనన్య నాగళ్ల

బెట్టింగ్ యాప్ వివాదం రెండు తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఈ విషయంలో సీరియస్ అయిన తెలంగాణ పోలీసులు పలువురిపై కేసు నమోదు చేశారు. ఇందులో నటులు రానా దగ్గుబాటితో పాటు ప్రకాశ్ రాజ్, విజయ్ దేవరకొండ అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, శోభా శెట్టి తదితర నటులపై కేసు నమోదు చేశారు. బెట్టింగ్ యాప్‌లు చట్టవిరుద్ధంగా నడుస్తుండటంతో వీటిని ప్రమోట్ చేయడం వల్ల సామాన్య ప్రజలు మోసపోతున్నారని పోలీసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ యాప్‌లలో పాల్గొనడం వల్ల ఆర్థిక నష్టంతో పాటు మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు తలెత్తుతాయని హెచ్చరిస్తున్నారు. కాగా ప్రస్తుతం ఈ కేసుకు సంబంధించి విచారణ కొనసాగుతోంది.ఇదిలావుంటే బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు సినీ ప్రముఖులపై నెటిజన్లు దుమ్మెత్తిపోస్తున్న విషయం తెలిసిందే. నటి అనన్య నాగళ్లను బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసినందుకు సోషల్ మీడియాలో తిట్టడం మొదలుపెట్టారు. అయితే తనపై వస్తున్న విమర్శలపై స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చింది అనన్య.

ఈడెన్‌లో ఇప్పటివరకు ఎవరిది పైచేయి.. టాస్ గెలిస్తే ఏం చేయాలి..

బెంగళూరు-నవభూమి: బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ ఐపీఎల్‌లో ఎన్నో ఏళ్లుగా చాలా బలమైన లైనప్‌తో ఆడుతోంది. ఆరంభం నుంచి విరాట్ కోహ్లీ ఆ జట్టు తరఫునే ఆడుతున్నాడు. అలాగే క్రిస్ గేల్, డివిల్లీర్స్, డుప్లెసిస్ వంటి హార్డ్ హిట్టర్లు కూడా బెంగళూరు తరఫున బరిలోకి దిగారు. అయితే ఇప్పటివరకు ఒక్కసారి కూడా బెంగళూరు టీమ్ టైటిల్ సాధించలేకపోయింది. మూడు సార్లు ఫైనల్స్‌కు వెళ్లినప్పటికీ అదృష్టం కలిసి రాలేదు. ఇక, 2016 తర్వాత ప్లే-ఆఫ్స్‌తోనే ఆర్సీబీ కథ ముగుస్తోంది.మరోవైపు, కోల్‌కతా నైట్ రైడర్స్ మాత్రం ఐపీఎల్‌లో తన హవా కొనసాగిస్తోంది. మూడు సార్లు (2012, 2014, 2024) ఐపీఎల్ టైటిల్స్‌ను కైవసం చేసుకుంది. ఇంతకు ముందు సీజన్లలో బాగా తడబడినప్పటికీ 2024లో అద్భుతంగా కమ్‌బ్యాక్ చేసింది. ముచ్చటగా మూడోసారి టైటిల్ కైవసం చేసుకుంది. ఈ నేపథ్యంలో 2025 సీజన్ తొలి మ్యాచ్‌లో బెంగళూరు రాయల్ ఛాలెంజర్స్ జట్టుతో తన స్వంత మైదానం అయిన ఈడెన్ గార్డెన్స్‌లో తలపడబోతోంది.ఇప్పటివరకు ఐపీఎల్‌లో కేకేఆర్, ఆర్సీబీ జట్ల మధ్య 34 మ్యాచ్‌లు జరిగాయి. వాటిల్లో కేకేఆర్ 20 సార్లు, ఆర్సీబీ 14 సార్లు విజయం సాధించాయి. ఇక, ఈడెన్ గార్డెన్స్‌లోఈ రెండు జట్లు ఇప్పటివరకు 12 సార్లు తలపడ్డాయి. వాటిల్లో కేకేఆర్ 8 సార్లు గెలుపొందగా, ఆర్సీబీ నాలుగు సార్లు మాత్రమే విజయం సాధించింది. ఇక, ఈడెన్ గార్డెన్స్‌లో కేకేఆర్ ఇప్పటివరకు మొత్తం 88 మ్యాచ్‌లు ఆడింది. వాటిల్లో 52 మ్యాచ్‌ల్లో గెలుపొంది, 36 మ్యాచ్‌ల్లో ఓడిపోయింది. ఈడెన్ గార్డెన్స్ పూర్తిగా బ్యాటింగ్‌కు సహకరించే పిచ్. గత 15 మ్యాచ్‌ల్లో చూసుకుంటే మొదటి బ్యాటింగ్ చేసిన జట్టు 7 సార్లు గెలిచింది. సెకెండ్ బ్యాటింగ్ చేసిన జట్టు 8 సార్లు గెలుపొందింది. ఈ నేపథ్యంలో టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంటే కాస్త ఉపయోగం ఉండేలా

బంకర్ బస్టర్స్ అదుర్స్

హైదరాబాద్-నవభూమి: గచ్చిబౌలి బౌల్డర్ హిల్స్ వేదికగా జరుగుతున్న ఆరో రియాల్టీ టీ9 గోల్ఫ్ టోర్నీలో బంకర్ బస్టర్స్ టీమ్ అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. శుక్రవారం జరిగిన రెండో రౌండ్ పోటీలో బంకర్ బస్టర్స్ 3.5-0.5 తేడాతో ఐరా లయన్స్‌పై ఘన విజయం సాధించింది. బంకర్ బస్టర్స్ తరఫున సింగిల్స్‌లో రాజు, ప్రీతమ్ కుమార్ మెరుగైన ఆటతీరుతో కీలక పాయింట్లు ఖాతాలో వేసుకున్నారు. డబుల్స్‌లో మంగర్, శైలేంద్ర జోడీ ఆకట్టుకుంది.

ఉప్పల్‌లో బ్లాక్ టికెట్ల దందా.. పోలీసుల ఎంట్రీ

న్యూదిల్లీ-నవభూమి: ఐపీఎల్ నయా సీజన్ మొదలవడానికి ఇంకా మరికొన్ని గంటలే మిగిలి ఉన్నాయి. ఆర్సీబీ వర్సెస్ కేకేఆర్ మధ్య జరిగే తొలిపోరుతో మెగా సంబరం షురూ కానుంది. ఇకపై రోజుకో పోరాటంతో ఆడియెన్స్‌ను అలరించేందుకు అంతా సిద్ధమైపోయింది. తెలుగు అభిమానుల కోసం సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌లు ఎలాగూ ఉన్నాయి. ఈ తరుణంలో ఒక్కసారిగా బ్లాక్ టికెట్ల దందా కలకలం రేపింది. ఎస్ఆర్‌హెచ్ హెూం గ్రౌండ్ అయిన ఉప్పల్‌లో అప్పుడే బ్లాక్ టికెట్ల దందా స్టార్ట్ అయిపోయింది. ఉప్పల్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో రేపు జరిగే సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ మ్యాచ్‌కు బ్లాక్ టిక్కట్ల దందా మొదలైంది.టికెట్లు స్వాధీనం..ఉప్పల్ మెట్రో స్టేషన్ వద్ద సన్‌రైజర్స్-రాజస్థాన్ మ్యాచ్ టికెట్లను భరద్వాజ్ అనే ఓ వ్యక్తి బ్లాక్‌లో అమ్ముతూ కనిపించాడు. దీంతో అతడ్ని ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు పట్టుకున్నారు. అతడి దగ్గర నుంచి 4 టికెట్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు భరద్వాజ్ వద్ద దొరికిన టికెట్లను ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు ఎల్బీనగర్ ఎస్‌వోటీ పోలీసులు. కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**